ASK01L113

Telugu Classics - Popular Edition Series

రాజశేఖరచరిత్రము

(మాదయగారి మల్లన ప్రణీతము)

పరిష్కృతము:

పుట్టపర్తి నారాయణాచార్యులు

ప్రకాశకులు:

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవనం - హైదరాబాదు-4

Telugu Classics - Popular Edition Series

రాజశేఖరచరిత్రము

(మాదయగారి మల్లన ప్రణీతము)

పరిష్కృతము :

పుట్టపర్తి నారాయణాచార్యులు



ప్రచురణ :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

కళాభవనం - హైదరాబాదు-4

ప్రథమ ముద్రణ
ప్లవంగ-1967
ప్రతులు-4000

వెల: రూ. 1-00.

ముద్రణ:
బి. వి. ఆర్. బాల్ రెడ్డి అండ్ కంపెని,
పార్కు లైన్, సికింద్రాబాద్.

తొలిపలుకు

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావు గారు చేసిన సూచన ననుసరించి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి, తెలుగు భాషలోని ప్రాచీన సాహిత్యము అందరికి అందుబాటులో నుండు నట్లుగా ముద్రించి ప్రకటించవలెనని నిశ్చయించినది. తెలుగు భాషలోని పూర్వ గ్రంథ సముదాయము యీనాడు పాఠకునికి సక్రమముగా సరస మైన ధరకు లభ్యమగుటలేదు. ఈ లోటును తీర్చి ప్రాచీన గ్రంథ సంచయ మును విడివిడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమి, ఒక ప్రణాళికను సిద్ధము చేసినది. ఈ ప్రణాళిక ప్రకారము యీ కార్యక్రమము మూడు తరగతులుగా విభజించబడినది. మొదటిది ప్రాచీన ప్రబంధాల ప్రకటన. రెండవది మహాభారతము, భాగవతము, హరివంశము, భాస్కరరామాయ ణము, బసవపురాణము, భోజరాజీయములను సంగ్రహించి ప్రకటించుట; మూడవది భారత భాగవతాల నుండియు నాచన సోమన, కంకంటి పాప రాజు, కూచిమంచి తిమ్మకవి రచనలనుండియు భాగాలను ఏర్చికూర్చి ప్రకటించుట. మొదటి తరగతిలో 27 ప్రబంధాలను 27 సంపుటాలుగా, రెండవ తరగతిలోని గ్రంథములను 15 సంపుటాలుగా, మూడవ తరగతి లోని గ్రంథాలను 8 సంపుటాలుగా మొత్తము 50 సంపుటాలను ప్రకటించు కార్యక్రమము స్వీకరించవలెనని అకాడమి తీర్మానించినది,

ఈ ప్రణాళిక ప్రకారము ప్రతి సంపుటము డెమ్మైసైజులో క్యాలికో బైండుతో 200 పేజీల గ్రంథముగా నుండవలెనని నిర్ణయించ బడినది. ప్రతి గ్రంథములో గ్రంథకర్తను గూర్చి, గ్రంథ ప్రాశస్త్యమును గూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలెనని నిశ్చయించ బడినది. ప్రతి సంపుటము వెల ఒక రూపాయి మాత్రమే. ఈ విధముగా యీ సంపుటాలనన్నిటిని సుమారు 5 సంవత్సరముల కాలములో ముద్రించి ప్రకటించవలెనని అకాడమి కార్యవర్గము తీర్మానించినది.

మేము కోరినంతనే ఈ సంపుటము సిద్ధముచేయు బాధ్యతను స్వీకరించి, నిర్ణయించిన గడువులోపల ప్రాతప్రతిని కార్యాలయానికి అందజేసిన ప్రసిద్ధ పరిశోధకులు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు గారికి అకాడమీ పక్షాన కృతజ్ఞతలు.

పైన పేర్కొనిన 50 సంపుటాల ప్రాతప్రతులను సిద్ధముచేసి ముద్రించుటకు, అవసరమైన డబ్బును పూర్తిగా అకాడమీకి యిచ్చుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానము గావించి యిందులో కొంత డబ్బును విడుదలకూడ చేసినవి. ఇందుకు అకాడమీ పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. అనుకొనిన వ్యవధిలో సంపుటాలను సిద్ధము చేసి, ఆంధ్రపాఠక లోకానికి అందజేయుట జరగగలదని విశ్వసించుచున్నాము.

దేవులపల్లి రామానుజరావు

హైదరాబాద్
25-9-1967

రాజశేఖర చరిత్రము

ఉపోద్ఘాతము

రాయలవారు - సమరాంగణ మండెంతయో - సాహిత్యమందు నంతే సార్వభౌములు. ఆతనికడ నష్టదిగ్గజములను కవులుండిరి. వీరందరు తెలుగు వారేనా? చెప్పలేము. విద్యానగరము పేరు ప్రసిద్ధిగాంచిన కన్నడ, తమిళ కవులను గూడ నాదరించినది. తెలుగువారు వారిని "మీరుదిగ్గజములు గాదు పొమ్మ"ని యెనిమిదిమంది యాంధ్రకవులకు మాత్రమే దిక్కులు బంచియిచ్చినారు. వారెవ్వరెవ్వరనుటలో మరల సందేహములు. మల్లన రాయలకడనుండెననుటకు "రాయవాచకము" ప్రమాణము.[1] 'కృష్ణరాయవిజయ' కర్త యీతనిని 'ముఖ్యకవుల' చిట్టాలో[2] జేర్చెను; అగుటచే రాయల దిగ్గజములలో నీతడొక్కడేమో యని యనుమానించుటకు వీలున్నది. మల్లన శౌనకగోత్రుడు. ఆరువేలనియోగి. అఘోరశివాచార్యులకు శిష్యుడు. ఆగురువు, పుష్పగిరి యందుండినవాడు. 'వరాహపురాణము'లో మలయమారుతములు నింపిన ఘంటసింగయ యఘోరశివాచార్యులయంతేవాసి. ముద్దుపల్కుల ముక్కుతిమ్మనయు, నీగురువుశిష్యుడే. మల్లన "రాజశేఖరవిలాసమం"దొక గురువునుగూర్చి వర్ణించెను. అరుణపురమందు ముకుందుడను బ్రాహ్మణుడు; ఆతనివర్తనమిట్టిది.

---

1. రాయవాచకము; పుటలు. 89, 115, 116;

2. గీ. అటులు జయలక్ష్మిగై కొని యలరుకరుల
హారుల ధనపంక్తులను దనపరముచేసి,
నెలయు శ్రీకృష్ణరాయలవిభనగరిమఁ
గాంచి, కన్నులపండువు గాఁగ నపుడు;
గీ. సరససాహిత్యరచన విస్ఫురణ మెరయ
సారమధురోక్తి మాదయగారిమల్ల
నార్యఁ డలయల్లసాని పెద్దార్యవరుఁడు
ముక్కుతిమ్మన మొదలైన ముఖ్యకవులు;

మ. సరసాహారములింటఁబెట్టి బహుశిష్యశ్రేణికిం దెల్పు శా
స్త్రరహస్యస్థితి; చెప్పునధ్యయనసంధ్యల్; హవ్యకవ్యంబులన్
సురకోటిన్ బితృకోటి నేమరక బ్రోచున్; విప్రవర్గంబులో
సరిలేరెచ్చట నమ్మహోత్మకునకున్ సౌజన్యభవ్యోన్నతిన్. (3అ-11)

పై పద్య మఘోరశివాచార్యుల కన్వయించునని 'ఆరుద్ర'[3] గారన్నారు. నిజమే కావచ్చును; మల్లనతండ్రి మాదయ్య. ఈతని నివాసగ్రామమున మరికొందరు మల్లనలుండుటనుబట్టియో బ్రౌఢకవిమల్లన మొదలుగా మరి కొందరుమల్లన్నలు కవులలోనుండుటనుబట్టియో, యితని తండ్రితోఁగూడ జేర్చి మాదయ్యగారిమల్లయ్య యనుచున్నారు. 'పై మాటలు చాగంటి శేషయ్యగారివి.[4] విజయనగరకాలములో - తండ్రిపేరును తమపేరుముందు వాడుకొనుట - అలవాటుగా నున్నట్లున్నది. కొన్నిశాసనములందట్లే కని పించును. కవులు గూడనారీతిగనే వాడఁజొచ్చిరి. మనుచరిత్రలో - పెద్దన గారు నరసరాజునువర్ణించుచు. 'తిమ్మభూపతిఈశ్వరుని'గా[5] బలికిరి; భట్టు మూర్తి 'శ్రీరంగాధిపుకోనభూవిభుఁడ'ని[6] వాడెను. తెనాలిరామకృష్ణుఁడు 'రంగయామాత్యవరుని శ్రీరామమంత్రి'[7] యనివర్ణించినాఁడు. తండ్రుల పేరులేగాక - ప్రభువులపేరులుగూడ వాడుకొనుటయు గనుపించును.

---

3. నమ్మగ్రాంధ్రసాహిత్యం-vii: పుట 60;
4. ఆంధ్రకవి తరంగిణి-vii: పుట: 199:
5. గీ. ఆడిజగంబుల మిగులఁ బ్రఖ్యాతిఁ గాంచె
ధరణిదనదత్తవివిధోపజ్ఞావిధాత
మాజ్ఞితశ్రీవినిర్జితనిర్జరాల
యేశ్వరుఁడు, తిమ్మభూపతిఈశ్వరుండు; (మను: 1-26)
6. శా. శ్రీరంగాధిపుకోనభూవిభువి కీర్తిస్వచ్ఛతుండాంకతే
జోరాజద్విజరాజు.....(వసు 1-39)
7. గీ. .....
.....
వైర్యహేమాద్రి, ప్రజ్ఞ శాంతనవుమాద్రి
రంగయామాత్యవరునిశ్రీరామమంత్రి (పాండు 1-41)

ఈయలవాటుముఖ్యముగ - పాలకవర్గములో; వారి యాశ్రితులలో; 'రామరాజతిమ్మరాజ,' 'రామరాజ విఠల', యిట్టివి కొన్ని శాసనములలోఁ జూచుచునేయున్నాము. మాదయ్యది 'అయ్యంకి' యగ్రహారము. దానిని కృతిభర్తయైనయప్పనమంత్రియే యొసగెనేమో! కావ్యరచనకై యాతని సంబోధనమిట్లున్నది.

ఉ. శంకరపాదసేవనవశంకరమానసపంకజాత! ని
శ్శంకవచోవిలాస! రుచిసారవినిర్జితపూర్ణపూర్ణిమై
ణాంక! దురత్తరాననభయంకర! శౌనకగోత్రపాత్ర!య
య్యంకిపురాగ్రహారవిభవాకర! మాదయమల్ల సత్కవీ. (1ఆ, 13ప)

అయ్యంకి నగ్రహారముగా దానిచ్చినందువలననే - పెనుగొండచేత్రాడు వంటిసమాసముతో - దానినీడ్చియుండునని నాయూహ. అయ్యంకి మల్లన కగ్రహారమగుటచే - వీరయ్యంకి 'వాశై'యుందురని యొకదృష్టి.[8] అగ్రహారమునుబట్టి, వారాత్రాంతమువారేల కావలెనో నాకర్థముగాదు. ప్రభువులగ్రహారములిచ్చునప్పుడు - కవులదేత్రాంతమో - అందులోనే యీయవలెనను నియమమేమున్నది? తమకు బుద్ధిపుట్టినచోట నిత్తురు. తమయేల్బడిసాగినచోట నిత్తురు. ఈయలవాటున్నందుననే.

"కోకటగ్రామాద్యనేకాగ్రహారంబు
లడిగినసీమలయందు నిచ్చె"

అని, "అడిగినసీమలలో నిచ్చుటనుపెద్ది రాజు పెద్దగా జెప్పికొన్నాఁడు. రాయలు సార్వభౌముఁడు గదామరి! మాయింటికథనే యెత్తికొన్నచో - మావి మొన్నటి వరకును మూడగ్రహారములు. కాని మా యింటిపేరు "పుట్టపర్తి"వారు అది మాకగ్రహారముగాదు. మల్లన రాయలసీమలోని యేదోత్రాంతమునకుఁ జెందినవాఁడనినాయనుమానము. కృతిభర్తనాదిండ్ల యప్పన రాయలసీమవాఁడే. ఆగ్రామ మనంతపురముజిల్లాలో "నార్పల" దగ్గరగాబోలు - ఉన్నదని విన్నాను. అప్పమంత్రి - వినుకొండ - లేక

---

8. చూడుఁడు ఆంధ్రకవి తరంగిణి-vii పుటము;

కొండవీడుసీమలు పాలించుచున్నప్పుడీ యగ్రహారమునిచ్చియుండవచ్చును. అప్పమంత్రి సాళ్వతిమ్మరుసునకు మేనల్లుడు. బిడ్డమగడుగూడ. తిరుమలాంబ సాళ్వతిమ్మరుసు బిడ్డ. ఈమె యప్పమంత్రిభార్య. అప్పనకు గోపన మంత్రి తమ్ముడు. ఈతడును - పేరుత్రోసిన దండనాథుడు. మంత్రియును; గోపరాజు 'కృష్ణార్జునసంవాద' కావ్యమును రచించినాడు. అది ద్విపద; "రాజశేఖరచరిత్రము"ను త్రాయునాటికి - గోపమంత్రి గుత్తిలోనుండినాడు; ఈ విషయమును కవియే తెలిపెను.

ఉ. ప్రాపితరాజ్యవైభవనిరాకృతపాకవిరోధియైన యా
గోపనమంత్రి, ధర్మధనగోపనసమ్మతి, గుత్తిదుర్గల
క్ష్మాపరిపాలనక్రమసమిద్ధభుజాబలశాలి, రూపరే
ఖాపరమత్స్యలాంఛనుఁడయావహకార్యధురంధరుండిలన్. (1ఆ 27ప)

అప్పలరాజుగూడ నొకనాడు గుత్తిదుర్గాధ్యక్షుడుగ నున్నవాఁడే. ఆతనిపై నీక్రిందిచాటువున్నది.

క. రాజమనోజా! విద్యా
భోజా! కవికల్పభూజ! భూసురకులది
గ్రాజా..... .....
.....రవితేజ! గుత్తియప్పలరాజా! [9]

ఇది యెవ్వరుత్రాసినదో తెలియదు; విజయనగరకాలమున గుత్తిదుర్గము చాల ప్రధానమైనది; అత్యంతముఖ్యులనే దానికిఁ బాలకులుగా నియమించుచుండిరి. రాజశేఖరచరిత్రమును త్రాయునాటికి - అప్పమంత్రి - వినుకొండ యందో - కొండవీడు నందో - యుండియుండునని నా యనుమానము.

శా. వైరించప్రతిభావదావదవచోవైయాత్యసాతత్యస
త్యారూఢస్థితిపాండవాగ్రజ! మహీయఃస్వచ్ఛకీర్తిచ్ఛటా

---

9. చిన్ననాఁడెక్కడో విన్నాను. పద్యము పూర్తిగా జ్ఞప్తికి రాలేదు. ఎక్కడ వెదకిననుదొరకలేదు.

పారావారనిమగ్నశత్రుగణ! శుంభత్పూర్వభూభృద్ధి శా
నారీమన్మథ! బంధురతృణచణా! నాదిండ్ల వంశాగ్రణీ! (1ఆ 91ప)

పై పద్యమున మల్లన, తూర్పునాటిచెలువల కందరికి - అప్పనచే తాళి గట్టించినాడు. లేక తూర్పు దిక్కునెడునాయిక యేమో! కాక - ఉదయగిరి దుర్గాధిపత్యమని దీనియర్థమగునా? అప్పమంత్రి యొడ్డోలగమును కవియిట్లుట్టంకించెను.

సీ. భట్టియుగంధరప్రముఖుల కృత్యంబు,
లొఱగులొత్తెడు మంత్రులొక్కవంక
విక్రమార్కోదగ్ర విక్రమక్రమకళల్,
లెక్కసేయని శూరు లొక్కవంక
శేషాహిభాషావిశేషంబుమెచ్చక,
యుండు విద్వద్బ్రహ్మలొక్కవంక
కాళిదాసాదుల కవితాప్రగల్భత,
నొఱయు సత్కవివర్య్యు లొక్కవంక

గీ. దానమానక్రియానూనగానసరణి
వెలయు తుంబురునారదాదుల గుఱించి
యుల్లసంబాడు, గాయకు లొక్కవంక
మహిమ గొలువంగ నప్పన మంత్రివరుడు. (1-11)

ఈ సంరంభమంతయు కొండవీటున జరిగి యుండవచ్చును. లేక వినుకొండయందు; రాజశేఖరచరిత్ర రచనాకాలమెప్పుడనుటయు మరియొక విమర్శ.

చాగంటి శేషయ్యగారు-రాయలు పట్టాభిషిక్తుడగుటకు ముందే గ్రంథ రచన సాగియుండునన్నారు. రాజశేఖరచరిత్రమును, గృతియిచ్చి - నాదిండ్ల యప్పమంత్రిని మెప్పించి - యాతని పలుకుబడిచే మల్లన రాయల యాశ్రయమును సంపాదించికొనెనని - వారియూహ.[10] అష్టదిగ్గజము

10. చూడు ఆంధ్రకవితరంగిణి-vii: పుట 260;

లలోఁ దానొక్కఁడైన తరువాత - దీనిని వ్రాసియున్నచో - రాయలను గూర్చి యొక్క మాటయైనఁ జెప్పియుండడా? యని వారి సందేహము. కృష్ణరాయల యాశ్రయమున నున్నవారందఱు - ఆతనిపేరు గ్రంథస్థము చేసియే తీరవలెనను నియమమేమున్నది? ధూర్జటి యష్టదిగ్గజములలో నొక్కఁడు. ఆతని గ్రంథమున రాయల యూసే లేదు. మల్లన రాయల దిగ్గజములలో నొక్కఁడే గాక-యుద్ధములలోఁగూడ వెంటనుండినవాఁడు; అతఁడు రాయలపైఁగొన్ని చాటువులు చెప్పియుండవచ్చును. వానిలో నొక్కటైన నిప్పుడు చిక్కుటలేదు; ఏమైనవి? కాలగర్భమున నంతరించి నవి. అట్లే - మల్లన రాయలపై నొకకావ్యమల్లి యుండవచ్చుమ. అదియు నంతరించియుండవచ్చును. కాదని మనమెట్లు చెప్పగలము? అట్టి కావ్య మొకటి వ్రాసియున్నచో - దాని విషయము తన గ్రంథ పీఠికలోఁ దడవి యుండఁడా? యని - మరియొకప్రశ్న. తడవి యుండవచ్చును. కాని - తడవియే కావలెనను నియమమేమున్నది? పెద్దనామాత్యులు "హరికథా సార"మును వ్రాసిరని మనకుఁ దెలియును. దానిని గురువైన శఠకోప యతి కంకిత మొనర్చిరి. అందుచే - నాగ్రంథముపై వారికాదరగౌరవము లుండియుండును; మరి - యాగ్రంథమును - మనుచరిత్రపీఠికలోఁ జెప్ప లేదేమి? మల్లన రాయలకొకగ్రంథము నంకితమిచ్చి యుండుననుటకుమాత్ర మాధారమేమున్నది? ఈ యూహలన్నియు నాకాశ ఖడ్గచాలనము. 'రాజ శేఖరచరిత్ర'లోఁ దిమ్మరుసునుగూర్చిన ప్రస్తావమిట్లున్నది.

సీ. ఏమంత్రిమణి నిజస్వామికార్యక్రియా
తత్పరమానసోత్సాహశాలి
ఏమంత్రిమణి మిత్రహితబాంధవాశ్రిత
ప్రకరరక్షణకళాప్రౌఢబుద్ధి
ఏమంత్రిమణి వచోహేలాతిసైర్మల్య
శీతలతాధూతశీతరోచి
ఏమంత్రిమణి సుధాధామశాంభవధామ
ధాళధళ్యసుతుల్యధవళకీర్తి

గీ. యట్టిమంత్రికులో త్తంసమహితనృపతి
పటలమకుటాగ్రఘటితపత్పద్మయుగళ
సకలకర్ణాటరక్షావిచక్షణుండు
దీనసురశాఖి సాళువతిమ్మమంత్రి. (1-33)

ఇందులోఁ దిమ్మరుసునకు "సకలకర్ణాటరక్షావిచక్షణుఁ"డని మాత్రమే వాడెను గనుక - సాళువతిమ్మరుసుప్రజ్ఞ-గొప్పవిజయమును సాధించుటకు ముందే - యీ గ్రంథము పుట్టియుండునని - శేషయ్యగారి మరియొక యనుమానము. కాని - యీయొక్క విశేషణములో 'గండపెడుకర్ణార' మున్నది. పైఁగా - నాల్గుపాదములలోఁ గొన్నిగుణములు చెప్పనేచెప్పెను. దీర్ఘపాదములుగల సీసపద్యము - తిమ్మరుసుపై నాతనికున్న గౌరవమును దెలుపుచునే యున్నది. ఈ గ్రంథములో సాళ్వతిమ్మరసునెందుకు చెప్ప వలసివచ్చినది? అప్పనమంత్రిమూమయైనదానివలన; ఇంతకుమించి యాతనిఁ జెప్పినచో-నది యప్రసక్త మే యగును. ఈ వంశములోఁ బ్రభస్తికి వచ్చిన వాఁడు చిటిగంగన, ఆతనిని గూర్చి - కవి రెండు పద్యములలోఁ జెప్పనే చెప్పెను.

ఉ. సాళువనారసింహమనుజప్రభుకార్యకళాధురంధరుం
డై, లవణాబ్ధి వేష్టితధరాధిపదుర్మతమంత్రిమంత్రిశుం
డాలవితానకేసరి యనంగ ననంగసమానరూపరే
ఖాలలితాంగుఁ డట్టిచిటిగంగనయొప్పు గుణానుషంగుడై .(1-19)

శా. అంగాధీశకళింగరాజమగధాధ్యక్షాదిభూభృత్సభా
రంగాభంగవిహారముల్ -ఘనశిలాగ్రావస్థలీసంసర
ద్గంగోత్తుంగతరంగనిర్గళితనిధ్వానోద్భటప్రక్రియా
సాంగత్యంబులు, చిట్టిగంగవిభువాచారంభసంరంభముల్. (1-20)

కనుక - తిమ్మరుసికఁడ ప్రసక్తానుప్రసక్తుఁడు, అంతమాత్రమే కాదు. ఒకవ్యక్తినిఁగూర్చి చెప్పినప్పుడు - ఆతఁడు సాధించిన ఘనవిజయము లన్నియు నేకరువుపెట్టుటకారంభించినచో - గ్రంథమునకంతెను - బీఠికయే

పెద్దదగును, అట్టి చిత్తవృత్తియందరకునుండదు. భట్టుమూర్తివంటివాఁడు చేయును. గోజరాజు కృష్ణార్జునసంవాదమును - గొండవీడు విజయానంతరమే వ్రాసినాఁడుగదా, అప్పటికిఁ దిమ్మరుసు "ఘనవిజయము"లను సాధించియే యుండెను, కాని - గోపమంత్రి అప్పాజీనిగూర్చి—

"శ్రీయఃపోనిత్యుండు శ్రీకృష్ణదేవ
రాయసామ్రాజ్యభారధురంధరుండు
బలవదరాతిభూపతినుతపాద
తలుఁడు సాళువతిమ్మదండనాయకుఁడు."

అనిమాత్రమే చెప్పి యూరకొనెను; కనుక తిమ్మరుసునకు వాడిన విశేషణములనుబట్టి-కావ్యారచనాకాలమును నిర్ణయించుట కష్టము. పెద్దనామాత్యులమనుచరిత్ర యెురవడిగా - మల్లనకావ్యమును వ్రాసియుండునని నాయూహ. నాకుఁ దోచిన కారణములివి. మల్లన తనకావ్యములో నొక యోగినిని వర్ణించినాఁడు, ఆవర్ణన మిక్రిందిది.

సీ. అలికంబుపై రక్తతిలకంబు, తెలిగన్ను
గవయందుఁగాటుక, కర్ణపాళ
ములఁ బటికంపుఁగుండలములు, గళమున
సంకు, బూసలకంఠసరులు, గుబ్బ
చనుదోయి వన్నెకుచ్చులిగంత, దాపలి
కరమునందు విభూతికడుపాల,
పాణిపద్మంబున మాణిక్యమయవీణ,
పదయుగంబునఁ బైడిపాదుకలును,

గీ. ఉదరబంధంబు, లాతంబు, యోగపట్టె,
సింగినాదంబు, బెత్తంబు, చెన్ను మెఱయ
నుట్టిపడ్డట్టు యోగిని యోర్తు వచ్చి
లీల నారాజశేఖరు వ్రాల నిలిచి. (1-94)

ఈయోగిని మనుచరిత్రలోని యూహాపథసిద్ధునకు 'నకల'ని నాభావము. ఈకథలో నీమె వచ్చిచేసినపని యేమియు లేదు. 'తాపసపుత్రి' నిచ్చిపోవుట యొక్కటే. ఒకచిలుకనుగూడనిచ్చెను. ఈరెండుపనులు - 'శంఖురాణి'యే చేసియుండవచ్చును. మంధరపర్వతవర్ణనగూడ - పెద్దనగారి మనుచరిత్ర నుండి తెచ్చికొన్నదే. 'కవ్వపుఁగొండచేరువ నొక్కకోనగలదని కవిచెప్పెను. ఈకోన యేకొండకడనైననుండవచ్చును. ఈక్రింది పద్యములు జూడుఁడు:

ఉ. విందునుబోలె నోవిమతవీరభయంకర! రాజలోకసం
క్రందన! నీవురా నెదురుగాఁజను దెంచె నిలింపకామినీ
బృందలతాంతకాంతకబరీభరసౌరభసారసమ్మిళ
న్మందరకందరాసవిధమంధరబంధురగంధవాహముల్. (2-45)

క. ఇందుమణిమందిరాంగణ
మందారమరందమత్తమధుకరనినదా
నందమునఁ బొంది నగరా
ణ్ణందనయుం దాను బ్రమధనాథుఁడు మెలఁగున్. (2-46)

పై వానిలోఁబెద్దనగారు స్పష్టముగ నగుపించుచునే యున్నారు. రాజశేఖరచరిత్రములో నీక్రిందిపద్యముగలదు.

స్రగ్ధర. ప్రచ్ఛన్ మత్తేభరాజప్రకుపితమదహార్యఋమై ఘోరభంగిన్
గ్రొచ్చున్ రథ్యవ్రజంబున్ ఘటఘటరభటిన్ ఘోణిమై పైపయిం, గా
ర్చిచ్చై యేతెంచి యేర్పున్ జిటచిటమనుచున్ సేనలం గాన మాడ్కిన్;
వచ్చుంగార్కొంచు గాఢధ్వని మొగులయి దా వానపెన్వెల్లి నిండన్.
(2-76)

ఈ క్రింది గ్రథనము మనుచరిత్రలోనిది.

స్రగ్ధర. గ్రుద్దున్ గోత్రాచలంబుల్ గులగులలయిపో గోతముల్ గ్రుద్దులీలన్
ఖద్దిన్ జెండాడు వ్రాకుల్, కవుగిటికొలఁదుల్, కత్తి నొక్కొక్క ఘాతన్
ప్రోద్దామ వ్రేఁడివాతాద్భుతగతిఁ బఱచున్ భూమి జవ్వాడఁ గా ని
ట్లద్దేవీనందనుండత్యనుపమబలుఁడై యీవనారంభ వేళన్. (4-8)

పై రెంటికినిఁగలపోలిక యూహించికొనుటంత కష్టముగాదు, మను చరిత్రలో - బ్రహ్మమిత్రుఁడు శాపమిచ్చుఘట్టములో-నీపద్యమున్నది.

క. ధనరాజ్యరమామదమున
గనుగానని నిన్ను శిష్యుఁగాగైకొనుకం
చెను నేరమిగలదే! నను
గనలించుచుఁబ్రేలకఁ బొకాలుమటన్నన్. (5-11)

మల్లనగారి పద్య మీక్రిందిది.

మత్త. బాల! యౌవనగర్వరేఖఁ బిసాళమాడెదవేల నా
మ్రోల! నెవ్వరిగాఁ దలంచితి! మోహసాలసమూహ ని
ర్మూలనక్రమశాలి చక్రధరున్ భజించుకృతార్థుఁడన్
జాలఁజాలుఁ! బొకాలు! పుట్టు! రసాతలంబున మర్త్యలై. (1-57)

ఇచ్చటికథగూడ శాపమిచ్చుటయే. మనుచరిత్రలోని దీక్రిందిపద్యము.

ఉ. అబ్బురపాటుతోడ నయనాంబుజము ల్వికసింపఁ గాంతిపె
ల్లుబ్బి కనీనికల్ వికసితోత్పలపంక్తుల గ్రుమ్మరింపఁగా
గుబ్బమెఱుంగుచన్గవ గగుర్పొడువన్ మదిలోనఁ గోరికల్
గుబ్బతిలంగఁజూచె నలకూబరసన్నిభు నద్ధరామరున్. (2-28)

దీనివంటిదే మల్లనగారిది.

ఉ. గబ్బిపిసాళివాలుతెలిగన్నులతేటమిటారిచూపులన్
మబ్బుకొనంగఁజేసె విటమానసముల్ దమివెల్లిముంపుచున్
గుబ్బమెఱుంగుచన్నుగవకుంకుమపూఁతలకమ్మతావి యా
గుబ్బలుగాఁ జరింపుదురు కొమ్మలు తత్పురమార్గవీధులన్. (1-48)

రాయల యాముక్తమాల్యదలోని -

చ. సరసుల నర్మమింపులనొసంగఁ గదంబపుదండగట్టుచోఁ
గరఁగుటఁ దెల్పు దృక్తరళకాంతులు-నుత్తరమిచ్చునంతరాం

తరముల నవ్వులున్గ లువతండము మొల్ల లునంచు మిన్నుగ్రు
చ్చి రహిని రిత్తమాలొసఁగి సిగ్గువహింతురు పుష్పలావికల్. (2-20)

అనెడు - పుష్పలావికలభ్రాంతియే - మలనలో -

చ. అరవిరిబాగుతో నలరులమ్మలతాంగుల లేఁతనవ్వులన్
బెరసి సరంబులప్పటికి-బెంపువహించుటఁజేసి చూపరుల్
గరమనురక్తిఁమై నిలిచి కైకొని పిమ్మటఁ బోయిచూచి యా
నరములుగావు పొమ్మనుచు సారెకుగ్రమ్మర వత్తు రేమనన్. (1-49)

అనెడు విటులభ్రాంతి యైనది. కనుక - 'మనుచరిత్రయు' 'ఆముక్త
మాల్యద'గడ్డకు వచ్చిన తరువాతనే. మల్లన రాజశేఖరచరిత్రమును వ్రాసి
యుండునని నాయనుమానము. పారిజాతాపహరణము ననుసరించిన పద్య
ములుగూడ నున్నవి. విజ్ఞులు ప్రమాణము, ఆనాటి-రచనామార్గమునుబట్టి
కొన్ని యెక్కువగా వర్ణింపవలసిన ఘట్టములనుగూడ మల్లన జారవిడిచి
నాఁడు.

పెద్దనగాఁరరుచాస్పదపురమును వర్ణించుచు - మొదట చాతుర్వర్ణ్య
ములనుగూర్చి చెప్పిరి. తరువాత వారికి వర్ణింపయోగ్యమైనవారు వెల
యాఁడైనారు. ప్రవరుని నోటినుండిగూడ "స్వాహావధూవల్లభా!" యని-
చల్లగాఁ బలికించిననారు పెద్దనామాత్యులు. ఆనాటియభిరుచులట్టివి.
మల్లన్న శృంగారములోఁ 'గవితాపితామహుల'కేమియు దీసిపోనివాఁడు.
'ఆవంచిక'పురమును వర్ణించుచు - నాతఁడు మొట్టమొదటనే 'వారవధూ
టుల'పైఁ బడినాఁడు.(1-47) కనుక - శృంగారమును వర్ణింపవలసివచ్చి
నప్పుడు 'పోనీలెమ్మ'ని యుపేక్షించుదృష్టి యతనికి లేదనుట స్పష్టము.
కాని- చాలచోటులమాత్రము - "అనాశ్వాసితదుఃఖితే మనసి"-యన్నట్లు
న్నది. దీనికిఁ గారణము- చరిత్ర వక్రించుటయేనని నాయూహ. కృష్ణదేవ
రాయల కడపటి దినములంతమంచివికావు. అంతవరకును - పతివ్రతవలె
యనుసరించుచువచ్చిన విధి - కడపటిదినములలో నాతని వెక్కిరించినది.
పుత్రోదయముగానివేదన యొక్కటి. గజపతులతో సంబంధము చేసికొ

న్నను - అది రసికముగానిమెఱమెఱయొక్కటి, తన యనంతరము - సింహాసనముగతియేమి యను బాధ యొక్కటి. యీ వనములో నణఁగి యుండి - క్రమముగాఁ దలనెత్తిన యుదరవ్యాధి యొక్కటి. వీనితో నాతనిమనస్సు సదమఁడమగుచుండెను. మనుచరిత్రలోని కడపటి మూఁడా శ్వాసములు - మొదటివానివలెఁ రక్తి గాలేవు. దానికిఁ గారణము - పెద్దన్న గారికిఁ జిత్తశాంతి కొఱవడుటయే. "మనుచరిత్ర వేఁకటివరకును - వసు చరిత్ర చీఁకటి వఱకును" బాగుండునను జనశ్రుతి - మాత్రాంతములలోఁ జాలదివములనుండి యున్నది. రాజశేఖరచరిత్రలో - మూఁడవయాశ్వాస మున - సంధ్యాకాలవర్ణన వచ్చును. రెండవదానియందు - నొకసారి తొంగిచూచును. ఈరెండు సందర్భములందును సంధ్యాదేవి యొక్క సీస పద్యమునకైనను నోచికొనలేదు. రెండవయాశ్వాసములో - మూఁడు పద్యములు. మూచూచి వెడలిపోయినది. మూఁడవయాశ్వాసములోని చంద్రుఁడు(3-141) ముచ్చటగా నొకపద్యములోఁదోకముడుచుకున్నాఁడు. ఆపద్యమిది.—

మ. జలజాతాహితమాంత్రికాగ్రణి కళాజాలాధ్యుఁడై దీపికా
కలికాభీలవిషానలావిలతమఃకాలాహి మార్కొ, వియ
ల్లలనాదేహము తారకానికరలాలాబిందువై యుండ వె
న్నెలమందుల్పయిఁబూసి తీర్చెననఁ గాన్పించెంబ్రసన్నద్యుతిన్. (3-141)

కవి 'ప్రసన్నద్యుతి' యనుచున్నాఁడేకాని - లాలాబిందువులు మొద లైన వానిని జ్ఞాపకమునకుఁదెచ్చి రోఁతఁబుట్టించినాఁడు. మనుచరిత్రలోఁ బెద్దనామాత్యులు పదునాఱు పద్యములలో నీ ఘట్టమును వర్ణించిరి. చాలని దానికొక్క చూర్ణిక; ప్రబంధకవులకు విరహవర్ణనము వచ్చినచోఁ బండుగ; రాగములు తీసితీసి వర్ణింతురు. ఇక్కడినాయిక విరహవేదన మనకుఁ దెలియుటయేలేదు. గొజ్జగినీరు జల్లిన విరిపూసెజ్జపైన 'చెలి కత్తెలు పరుండబెట్టినపుడు 'యెందుకోలెమ్మ'నుకొందుము. ఆమెవిర హము మనకుఁ గన్పించునదొకపద్యములోనే. అదియిది.

చ. చిలుకపురోహితుండగుచుఁ జెంగటనుండఁగ - సిగ్గుపెం దెరల్
దొలఁగఁగఁద్రోసి, బంధుగతిఁ దోరపుఁగోర్కులు సందడింపఁగాఁ
దలఁపులతాంగికన్న మునుదానకనుంగవ దోయిలించి-చూ -
పులఁదలఁబ్రాలుపోసె నృపపుత్రునిపై విరహాగ్నిసాక్షిగన్. (3-131)

దీనినిఁబట్టి యామెచేఁ చంద్రదూషణాదులను మనము ధ్వనిగా నూహించికొనవలెనంతే, నాయిక "ఛాన్స" రాజశేఖరుఁడే తీసికొన్నాఁడు. అతఁడు-రాకానిశాకరు నిట్లాడిపోసికొనెను.

సీ. కఱచుకొంచును ద్రావగాఁ గాచియున్నారు
సురలు నీయెమ్మెలు స్రుక్కవేల?-
ఋయము నానాటనగ్గలముగా నికనొత్తి
వచ్చు నీజాడలు వదలవేల?-
పెనుపాఁపపగవాఁడు పెడతలగండఁడై
యుండ నీమదవృత్తి యుడుగవేల?-
అదియునుగాక మేనంతయు గాళిప
ట్టుకరాఁదొడంగె నీవికృతియేల?-

గీ. అదరిపాటుగ నుదధిలోనౌర్వవహ్ని
నెపుడు పడియెదవో గాని యెఱుగరాదు
చెప్పినట్టులువచ్చునే శితమయూఖ!
ఏలత్రుళ్ళిద విదియేమి మేలు నీకు? (3-149)

ఉ. రాహువుగాను, నిన్నఱుగరాచినశూరుఁడగాను, నీతను
ద్రోహముచేసినట్టియలరోహిణితండ్రిని గాను, దజ్జగ
న్మోహిని. నీలనీలకచ, ముద్దులచక్కెరబొమ్మఁగూర్పక
య్యో! హరిణాంక! తావకమయూఖముఖంబుల నేచనేటికిన్.(3-150)

చంద్రుఁడు తనబలగమునంతయు విడిచి - రాజకుమారున కొంటిగాఁ జిక్కినాఁడు, నాయకుఁడు వానినిఁ గూడ చక్కఁగాఁ దిట్టలేకపోయెను. ఇతరప్రబంధములలో - ముద్దుముద్దుగా - ముద్దియలచేతఁ దిట్టించికొన్న

చంద్రునకు యీ "మగతిట్ల"పై నసహ్యముపేసినది. పెద్దన్న - చంద్రాది దూషణమును - పదునాల్గు పద్యములతో జేయించినాఁడు. వసుచరిత్ర కారుఁడు - తిట్లవర్ష మునే గురిపించెను.

నాయికానాయకులపెండ్లి ముగిసినది. ఉత్సవమారంభమైనది. ఎంత ముసలివాఁడైనను బెద్దన్న పౌరకాంతల శృంగారచేష్టలకై పదిపద్యములు వెచ్చించినాఁడు. మల్లన యీయూనే యెత్తికొనలేదు. రాజశేఖరుని పెండ్లి యీరివారికిఁ దెలిసినట్లే లేదు. ప్రబంధకవిగా - మాదయ్యగారిమల్లన - యే 'కుర్చీ'లోఁ గూర్చొనవలసినవాఁడో - చెప్పుటఁగష్టము. ఆవచ్చిన యింతప్రభాతముగూడ (3-150) ఒక్కగీతపద్యములో మొగము చూపించి వెళ్లినది. రాజనిందమాత్రము బ్రహ్మాండముగా బాహువులు సారించి చేసినాఁడు, ఆపద్యమిది.

సీ. నెమ్మేనితిమిరమ్ము, నేత్రగోళంబుల
పర, కర్ణపుటముల ప్రత్తి, నోరి-
వాకట్టుమందు, గర్వలతాలవాలంబు,
వినయకృత్యంబులవేరువిత్తు,
కరుణారసంబుతెక్కలికాఁడు, మదిచొక్కు,
పాతకంబులపాలిపట్టుకొమ్మ-
మొగమోట కుడుగనిపగ, రాజసంబుల
యిక్కువ, గురుసేవ కెదురుచుక్క-

గీ. పరుషవర్తనకునికి, లోభంబుచెంకి,
బాంధవస్నేహసిందూరపాలకంబు,
కలశ-పాథోధిపుత్రికేగంటిచూడ్కి
గాని-రాజులనేరమిగాదు సువ్వె, (2-21)

పీనినన్నిఁటినిఁబట్టి చూచినచో - మల్లనగారికిని - మనఃస్థిమితములే దేమో యనిపించును. అందుకే యాతఁడు కృతిపతిగా నాదిండ్ల పనిఁబట్టి కొన్నాఁడు.

అప్పయామాత్యుఁడు "ఆదివైష్ణవకథానియతకర్ణుఁడు." మల్లన-శంకరపాదసేవనవశంవదమానసుఁడు. "నాదిండ్ల యప్పనకు" వీరవైష్ణవమంతగానున్నట్లు లేదు. కాని-మల్లనకుమాత్రము - 'శివమరులు' - కొంతయెక్కువయే. శ్రీచక్రార్చనయుఁ (3-1) గద్దు. ఆవంచికపురములో-రాజు శివభక్తుఁడైనాఁడు. ఆవాసన యంతటితో నాఁగలేదు. ఊరిలోఁజాలమంది 'శివుఁడే దైవ'మన్నారు. ఊరివారి శివభక్తిని మల్లన వర్ణించినపద్ధతియిది:-

శా. చూడంజిత్రము! పత్రపుష్పములకంచుం జేర నేతెంచు పెం
బ్రోడల్ శైవకథారహస్యములకై పోరాడుచుం బోవుచోఁ
గూడన్వచ్చి-తదీయవాదములచిక్కుల్ దీర్చుఁబో-పట్టణ
క్రీడాకాననవీథికాగ్రశుకశారికిన్నరద్వంద్వముల్. (1-71)

పూలకై వచ్చినవాళాసంగతిమఱచిపోయి-శైవకథారహస్యములకై - వారిలో వారు తగవులాడుకుందురట! ఆవాదములంతటితో నాఁగలేదు. పోరాటమువఱకుఁ బోయినవి. వివాహములోఁ దక్కిన కవులు 'లక్ష్మీనారాయణు'లఁ బాడింపఁగా - నీతఁడు 'గౌరీకల్యాణమునే' గీర్తించెను. ఇట్టివాఁడుగూడ 'నరుణుని'చేత శ్రీమహావిష్ణువునుగూర్చి తపము చేయింపవలసివచ్చినది. చేయింపక యేమిసేయును? ఇంటిలోఁ దిన్నఁగా "పెద్దమ్మ"-ప్రవేశించినది. అరుణుని దారిద్ర్యమును - కవి యిట్లువర్ణించినాఁడు.

మ. కులనిర్మూలనకారణంబు, ప్రతిభాకుట్టాక, ముద్వేగకో
పలతాదోహద, మాజవంజవసుఖప్రత్యూహ, మాత్మవ్యథా
జ్వలనజ్వాలిక, కామినీనయనవీక్షాపాతసంరోధి, ని
ష్కలఘుశ్వాశ్రయభూమి, లేమి యది యూహ! యేమిగావింపదే!(3-14)

గీ. పలుచఁగాఁజూచునెంతయు బంధుసమితి;
పిలువఁ బిలువంగఁ బలుకరు బిడ్డలైన;
రచ్చకెక్కెడుమాట, గారాబుసతియు;
లెక్కసేయదు - లేమి దూలించెనేని. (3-15)

గీ. కష్ట దారిద్ర్యదోషంబుకతనఁగాదె
ప్రాభవముదక్కి మును ఋతుపర్ణ విభుని
వంటవాడయి గొల్చను వైరసేని
వాసిఁ జెఱుపదె! యెంతటివాని నైన. (3-16)

ఈదారిద్ర్యము-మల్లన దేనేమో యని నాయనుమానము. అరుణుఁడు తపమొనరించుటకై యమునాతటమును జేరినాఁడు. అక్కడ - మరలమల్లన్నలో-శివపక్షపాతము 'నేనున్నా'నన్నది. ఆతనియమునాతటము లెట్లున్నవో చూచుఁడు:-

మ. జటిసంఘాతసమీపసంఘటితరజ్యద్వాలుకాలింగసం
పుటముల్ జన్మపరంపరాఘలతికామూలచ్ఛిదాపాదనో
ద్భటముల్, ముక్తివధూకుచాగ్రపటముల్ భాస్వత్తనూసంభవా
తటముల్, వానికడన్వసించునరుచెంతం జేరవేచింతలున్.

(3-77), కావలెననిసమాసములో 'రజ్యద్వాలుకాలింగముల'ను జేర్చి-తృప్తిపడినాఁడు శివపారమ్యము దోషమని నాయభిప్రాయముగాదు. దారిద్ర్యము - మల్లనభావములకు దెబ్బగొట్టిన దనియే.

మల్లన తనకావ్యములో 'అమరభాషాకవివర్యులకు'నమోవాక'మర్పించెను. ఒక్క-కాళిదాసునకుమాత్రమే మొదటిమ్రొక్కు. తక్కిన 'వ్యాకోచవచోవిలాసు'లగు కవుల కొక్కఁ డొడ్డిసంభావన. ఒకసారిచేతులు జోడించి. అందరిని-పంచుకొమ్మన్నాఁడు. కవిత్రయమున కాతఁడు నమస్కారమొనరించెను. ఆ నమస్కృతియిట్లున్నది.

గీ. సరససంస్కృతపుష్పగుచ్ఛప్రసూత
మగుదెనుంగను నెత్తావికఖిలదిశల
దరుణపవమానమగుకవిత్రయవిశేష
చతురవాచానిరూఢికంజలియొనర్చి. (1-7)

ఇక్కఁ దక్కిన కవులనాతఁడు బుష్టికరింపనే లేదు. తనవ్యక్తిత్వమునుగూర్చి కవి వర్ణించికొన్న తీరిది:-

క. చెప్పఁదగుఁ గవితరసముల్
జిప్పిల; నప్పప్ప!భళిభళీ!యన; లేదా
యెప్పుడు జేయకయుండుట
యొప్పు సుమీ! సుకవి యెంతయుచితజ్ఞుఁడొకో !"(1-18)

పై పద్యములోని "యప్పప్ప"– అప్పనమంత్రియే. కవిసంప్రదాయమునను సరించి-కుకవినిరాసము చేయవలసి వచ్చినది. ఆ నిరాసము శార్దూలమైనది.

శా. గాఢార్థ ప్రతిపాదనక్రమకళాకౌశల్యముల్లేక; వా
చాఢక్కార్భటితోడఁదామతము-"మజ్జా!"యంచుగై వారముల్
ప్రౌఢిం జేయుచుఁ బ్రాజ్ఞులన్నగుచు గర్వాగ్రంధులై యుండున
మ్మూఢస్వాంతులు మెచ్చకుండుటయ సమ్మోదంబుమాబోంట్లకున్"(1-9)

వాచాఢక్కార్భటిమాత్రముగొప్ప, గాఢార్థ ప్రతిపాదనము సున్న, చాలనిదానికిగర్వాగ్రంధులు, పై వానిలోని-'వాచాఢక్కార్భటి'- మల్లన్నకు గూడఁగొంచెమో - గొప్పగనోయున్నదే. ఈతనియందును-గాఢార్థప్రతిపాదనము గన్పించుచోటులు చాలతక్కువ. కాకున్నచోఁ గొంతవినయముండియుండవచ్చును. తన్నుగుర్తింపవలసినంతగాఁగుర్తింపలేదేయనుబాధ మల్లనకునుగద్దు. దానినిఁ బర్యాయోక్తితో నావిష్కరించుటయే - 'నిశ్శంకవచో విలాసఁదురఱు రాననభయంకర' - ఇత్యాదిసంబోధనలు, ఇంతకన్నను స్పష్టముగా మరియొకచోటనున్నది.

రాజశేఖరచరిత్రలో నొకచిలుక వచ్చును. ఆచిలుక తనపాండిత్యము నిట్లుచెప్పికొనెను.

శా. వాదింతున్, బహువేదశాస్త్రకలనావైయాత్యసంసిద్ధి, న
వ్వేదవ్యాసులతోడనైన, మదిసంవీక్షించి యచ్చోట నేఁ
గాదన్నన్మరినిర్వహింపఁగనశక్యంబేరి; కస్మత్పద
శ్రీదాంపత్యము నాక నాక యనుకో సిగ్గయ్యెడిఁ భూవరా!(3-122)

పై పద్యములో జిలుకకుబదులు-మల్లన్నయే యగుపించుచున్నాడు. నాల్గవపాదములో దనకుదానే 'మర్ఖు' యనుకొని కైవారము చేసికొన వలసివచ్చినందుకు బిడియము పాపము!

రాజశేఖరచరిత్రము మూడాశ్వాసములకావ్యము. ఈకథను మల్లన యెక్కడినుండి తీసికొన్నాడో తెలియదు, వస్తువు పౌరాణికమైనట్లు తోచదు, 'ఆవంచిక' యనునొకమహానగరముండెనట!. పేరుగూడ గ్రొత్తగనే యున్నది; దానిని హేమధన్వుడనురాజు పాలించుచుండెను; అతనిభార్య పేరు పాలిక. వారికి సంతానము లేదు ఒక్కనాడారాజు భార్యతోనిట్లన్నాడు.

గీ. నీలకంఠునిశిరసుపై నీళ్ళుజల్లి
పత్తిరిసుమంత నెవ్వాడు పారవైచు
కామధేనువు వానింటిగాడిపసర
మల్లసురశాఖి వానింటిమల్లెచెట్టు (1-65)

పైపద్యము జెప్పుటలో - శివభక్తిలోనిగొప్పతనమును వింగడించుటయే కవిభావము. కాని-యాచెప్పిన పద్ధతి బాగలేదు. అటుతరువాత నాతడు శివభక్తినిబొగడుటకారంభించినాడు. వానిలో నొక్కటియీపద్యము.

సీ. కడలేనిసంసారజడధిలో మునిగిన
జనులపాలిటినావ శంభుసేవ
కడుదూరమైయున్నకైవల్యసీమకు
జక్కనిపెనుత్రోవ శంభుసేవ
యతిలోకభాగ్యంబులను ముత్తియంబుల
సరులగూర్చినకోవ శంభుసేవ
సకలాగమజ్ఞానసారమహీజాత
జాతంబులోచేవ శంభుసేవ

గీ. నిరవధిక్రూరపాతకదురవగాహ
గహనదహనసమున్నిద్రగంధవాహ

సఖశిఖామాలికలదేవ శంభుసేవ
సద్గుణలతాతములతీవ శంభుసేవ (1-67)

పైసీసపద్యములవంటివానిని "ఊకుడుపద్యము" లనవచ్చును. నన్నయ్య గారిసీసములను విశ్వనాథవారు "గునుగుసీసము" లన్నారు. శ్రీనాథుని పద్యములకు నారాయణరెడ్డి "గుట్టుపుసీసము"లని పేరుపెట్టెను. నాదృష్టిలో పైసీసములు "ఊకుడుసీసములు" చెప్పువాడుచెప్పుచుండగా వినువాడర్ధ నిద్రలోనుండియు నూకొట్టవచ్చును. రాజశేఖరచరిత్రమునువ్రాయునాటికి మల్లన్నకు గావ్యరచనమునకుఁ గావలసిననిలుకడ, శాంతి, లేవనుటకుఁ పై పద్యమువంటివి యుదాహరణములు, రాజునకు శివభక్తి విశేషముగ సాఁగింతమను మనసు పుట్టెను, తానొక్కఁడే పూజించిన నెట్లు? ఆతఁడు వెంటనే యిట్లు 'ఫర్మానా' నిచ్చినాఁడు.

క. హాటకపైలధనుర్ధరుఁ
బాటింపనివాఁడు నాకుఁ బగవాఁడనుచున్
కూటపరిపంథిగర్వో
చ్చాటనగుణశాలి యతఁడు చాటంబంచెన్ (1-69)

మధ్యయుగములోని రాజుల చిత్తవృత్తులే యట్టివి. తామేత్రోవఁ ద్రొక్కిన-దమ్మాశ్రయించిన వారందరదే త్రోవ ద్రొక్కవలెను, 'తాము' నందియన్న నంది-పందియన్న పంది' ఈ పద్ధతికిఁ గొన్ని యపవాదము లుండవచ్చును. కాని చాలవఱకు నాటిపద్ధతులన్నియు నింతే. కృష్ణ రాయలకేమో బుద్ధిపుట్టినది. ఆతఁడు వైష్ణవమును స్వీకరించెను. అప్పటి నుండియు నాతని దృష్టిలో పైవము "వెఱ్ఱిపైవము". ఇఁక నేమున్నది? పెద్దిరాజుగారు శఠకోపయతులను వెదకికొన్నారు. మహామంత్రులు వైష్ణవమును స్వీకరించిరి. తెనాలిరామలింగఁడు-విభూతి దుడిచివేసి నామ ముల కెగబ్రాకినాఁడు. లేకున్నచో రాయలకడఁ దమపలుకుబడి సాఁగి రాదేమోయన్న భయము. పైవుఁడైన చోళరాజునకు భయపడి రామానుజులు మేలుకోటకుఁ బరువెత్తవలసి వచ్చెను.

మల్లన్న దసకాలము నాఁటిరాజుల యలవాటుల నీ పద్యములో స్పష్ట ముగఁ జూపించినాఁడు.

సీ. పరమండలోద్భేదపదములాలోకించి
మంత్రరహణకళామహిమఁదాల్చి
ద్వీపాంతరమ్ముల తెఱఁగులాకర్ణించి
గడినున్నమన్నీలక్రమ మెఱింగి
దుర్గాధిపతులసుద్దులు విచారము సేసి
బలములనప్పటప్పటికిఁజూచి-
నిజరాజధానిలోని విశేషమ్ములని
మంత్రిసామంత్రులమతములరసి-

గీ. పేదసాదల విన్నపంబాదరించి
వ్రతులమైనట్టిమముబోటివారి నరసి
రాజ్యమేలినఁదగుగాక ప్రాజ్యవైభ
వంబు గలదని సుఖియించువాఁడు నృపుఁడె! (2-20)

శివసేవతో రాజునకుఁగొడుకుపుట్టెను, వానికి - "రాజశేరుఁడ"ని తండ్రి నామకరణము చేసినాఁడు. శుద్ధాంతకాంతామణుల యుపచారములతో వాఁడు బెరిగెను, ఫాలమున రావిరేకతో నుండిన యాబాలకుఁడు - మూఁడవకన్నుగలిగిన పరమశిపుని (2-6) వలెనున్నాఁడట! ఇంతలో వానికి యౌవనముబ్రవేశించినది. యౌవనముయొక్కరాకను మల్లన్న నూత్న రమణీయముగఁ జెప్పినాఁడు.

మ. వనితానేత్రచకోరచంద్రిక, తనుస్వచ్ఛందకాంతిచ్ఛటా
ఖని;యుత్సాహకళాభరూరి, మతిరేఖామంత్రసంసిద్ధి, భో
గనివాసంబు, లతాంతసాయకభుజాగర్వావలంబంబు యౌ
వన మమ్మానవనాథపుత్రునకు, మవ్వంబొప్పనేతెంచినన్. (2-7)

యౌవనోదయముతో నాకుమారుఁడిట్లు భాసించెను,

సీ, ధర నొక్కమైఁదాల్పఁ దరముకాదని భోగి
వరుఁడు దాల్చినతనుద్వయమనంగ,
హృదయగేహము బాసి యీశుఁడేగకయుండ
నలవరించిన బోరుతలుపనంగ,
సముదీర్ణ లావణ్యజలధిలోఁజూపట్టు
లాలితశ్రీ వాలలత యనంగ
నిందిర విహరింప నెడముగా-నజుఁడు, గా
వించిన క్రొందమ్మివిరులనంగ,

గీ. నిడుదబాహు:యుగమ్మును, వెడఁదయురము
కొమరుమీసలు, దీర్ఘనేత్రములుమెఱయ
మానినీజనమానసమానహరణ
చతురతరమూర్తి యీరాజసుతుఁడు మెఱసె. (2-8)

ఇంతలోఁ దండ్రికుమారునకు యువరాజపట్టాభిషేకమొనర్చెను. రాజశేఖరుఁడు విజయయాత్రకు బయలుదేరినాఁడు, ఆక్రమమిట్టిది.

ఉ. రామునికంశె, నప్పరశురామునికంశె, ధనుర్విశేష వి
ద్యామహనీయుఁడై మెఱసి యాతఁడు చేతులతీటవో సము
ద్దామవిరోధిబాహుజవితానమునుక్కడగించి వీరల
క్ష్మీమదిరాక్షికిన్ వలపుగీల్కొలిపెన్ విషమాస్త్రకేళికిన్. (2-11)

ప్రబంధకవులకు శృంగారప్రసక్తివచ్చినప్పుడు 'పూజ్యపూజక' భావము గూడ సున్నయగును. భువనైకమాతయైనలక్ష్మీదేవికిని విషమాస్త్రకేళికా హ్వానింపఁబడుట తప్పలేదు.

ఒకనాఁడు హేమధన్వుఁడు పేరోలగముండెను. ఆతనితో సభాసదులు. ఇంతలో నుడిగాలివలె 'జటిలకౌశికుఁడ'నుమని యచటికి వచ్చినాఁడు. ఆతనినివాసము బదరికాశ్రమములోనట! 'బహువేదవిద్యామహనీయుఁడ" నని తానే చెప్పికొన్నాడు. వరతంతుమహాముని శిష్యుఁడు. ఆతఁడు వచ్చిన వెంటనే - భూపతిగద్దియడిగ్గి-వినయవినమితుఁడయ్యెను, ముని-రాజును

లెక్కసేయనే లేదు. "ఓయినరనాథా! నీవు నిర్విచారముగ రాజ్యముమ పరిపాలించుచున్నావు. కాచము - రత్నమునరిగాఁ జూచుమహామహుల తపము చూరలఁబోవుచున్నది."-వడగండ్లవానవలె నొకచే యార్భాటము. ఇంతకు జరిగినదేమి? ఆతనిబిడ్డనొకరక్కసుఁడెత్తికొనిపోయినాఁడు. ఆమె పేరు భానుమతి. తనభార్యయుడిగమునకై యారక్కసుఁడామెనెత్తి కొని పోయెను. ఇంతవఱకు నావేశముతో నెగుడుదిగుడుగా మాట్లాడినమని వాని 'యడ్రస్సు'ను స్తిమితముగా నిట్లుచెప్పుచున్నాఁడు.

సీ. వినవయ్య ధరణీశ! విరివియై కవ్వంపుఁ
గొండచేరువ నొక్కకోన గలదు-
బెడగై నయక్కోన నడుచక్కి మిక్కిలి
భీకరంబగు నొక్కబిలము గలదు-
తలఁకింతయునులేక తద్బిలద్వారంబు
సరణిబో నొకరక్తసరసి గలదు
ఘోరతరంబై నయారక్తసరసివెం
బడిబోవ నటనొక్క బయలు గలదు.

గీ. పరభయంకర మందొక్కపురము గలదు
తత్పురంబుననుండి సంతతము వచ్చి
ఆత్మతరుణికుడిగమునేయంగవలసి
పొంచి సవరలపాపలఁగొంచుఁబోవు. (2-28)

ఆరాతునకొక్కగుఱ్ఱము, అది లోహమయమైనది. వాఁడు దానిపై నెక్కి యతుకిన్నరపురస్తోనుముల నూటాడించెడివాఁడట: ఒకవేళ సింహమై యురుకును. బెదరించును. ఒకప్పుడు హరిణమై యొద్దనిలుచును. మరియొక ప్పుడు-ఘోణియై భూజములఁ బెకలించును. వేరొకసమయమున శలభ ముగాఁగాన్పించును. ఇంకొకతడవ మౌనిగావచ్చునట! ఇంకొకతోయమున నగ్నియై వెలుఁగును. ఒకయెడ మేఘమగును. ఒకప్పుడు శైలమగును. వానిధాటియన్న - బదరికాశ్రమవాసులై నతాపసులకు హాడలు;-వాఁడు

కామరూపి యని పై పెంపకమునకు భావము. ఆయాశ్రమవాసుల జపతపో నిష్ఠలేవియు సాగుటలేదు. ఆరాతుసుడు శలభమై వచ్చి యేమి చేసెడి వాడో తెలియదు. ఇంతహడావిడిచేసిన యారాతుసునిపేరే మరచినాడు మల్లన్న, వానికూరున్నది గాని-పేరులేదు. ఇంతకు నామునిబాలిక కెంత వయస్సు? ఏడు (2-33) సంవత్సరములు. ఏడుసంవత్సరములదానినెత్తి కొనిపోయి-యారక్కసుడేమి పాముకొందమను కొన్నాడో! ప్రబంధకవి యైన మల్లన్నకు - భానుమతిబాల్యచేష్ట లనువర్ణించుటలో నౌచిత్యము గాబట్ట లేదు. ఆతడుచెప్పిన తీరును జూడుడు.

సీ. కడుపార దొండపండిడి ముద్దుగఁబిన
రాచిల్కకొదమలఁ జూచిచూచి-
పాదులలోనిండఁ బాల్పోసి పెంచిన
చూతపోతమ్ములఁ జూచిచూచి -
తోడికన్నెలు దాను గూడిమాడిచరించు
సురపొన్ననీడలఁ జూచిచూచి -
బృందావనంబుల్ఁ బెంచి తిన్నెలమీఁద
సూటిబెట్టినమ్రుగ్గు సూచిచూచి-

గీ. సంతసంబున దేవపూజలు ఘటించి
పారికాంతులసేవకై పరమనియతి
లీల నడయాడుచున్న బాలికలఁ జూచి
హృదయవీధిక నెట్లు భరించువాఁడ! (2-35)

కవితలో మేనుమఱచినమల్లన్న 'స్త్రీవర్ణనము' చిట్టాలోని "ఏణాంకని భాస్య"-(2-36)అనుపదమొక్కటితీసి-యాచిన్నపిల్లపై విసరివేసినాఁడు.

తెనుఁగుపదములలో-శ్లేషలను పొదిగించుటలో-చేమకూర వెంకటకవి సిద్ధహస్తుఁడు. సంస్కృతశ్లేషలను ప్రౌఢముగాఁ జెప్పవలెనన్న - భట్టు మూర్తియే గావలెను. ఆతనిశ్లేషలు సర్వాంగశోభితములుగా నుండును.

పెద్దన్నగారు మనుచరిత్రలోనకక్కడక్కడనివివాడిరి. మల్లన్నకును సంస్కృత శ్లేషలపై నభిమానమున్నట్లే యున్నది. ఈ క్రింది పద్యమును జూడుఁడు.

మ. పలుమారంబుధరంబుచూపుబహురూపం, బంబరాసక్తి; శీ
తలభానుండును బొట్టఁబెంచుకునై తాల్చుంగళాప్రౌఢి; ని
చ్చలు వారింపఁ జరించువారినిధియాశాబద్ధుఁడై; వీరలన్
తిలకింపందగునోటు దాతలని-నాదిండ్లప్పనిం జెప్పుచోన్. (1-32)

కాని-శ్లేషసామ్రాజ్యసర్వంకషచక్రవర్తి భట్టుమూర్తియే. ప్రబంధకవు లందరికివలెనే - మల్లనయును జమత్కారప్రియుఁడు. ఒక్కొక్కరి చమత్కారము వేఱువేఱుగానుండును - మల్లన్నయాగుణమిట్టిది.

క. పడఁతులకన్నులఁ గనుఁగొని
యడియాసలఁబోవుఁదల్లులని శఫరంబుల్
నిడుదలొ! యటువలె, నవికడు
వెడఁదలొ! జడమతులకావి వేకముగలదే! (2-158)

జలక్రీడాసందర్భములోని దీపద్యము. అందుచే సరస్సులోని బేడిసలకు-వారికన్నులను సమీపించుట సంఘటించుచున్నది. మధ్యయుగమునందలి కవులొకరీతిగా - సాహిత్యవీరులు. ప్రతిభకన్న వ్యుత్పత్తియెక్కువ. కవిత్వము హృదయధర్మముగాక - వాఢించి తేల్చికొనవలసిన పదార్థమైనది. అందుచే-వారికి-శాస్త్రబలమావశ్యకము. నన్నయాదులకు శాస్త్రబలము లేదనికాదు. దానినావిష్కరింపవలెనను వీరలక్షణము తక్కువ. మల్లన్న లోను - దక్కిన ప్రబంధకవులలోవలె-నక్కడక్కడ శాస్త్రము 'నేనున్నా' ననుచున్నది. క్రిందిదొక యుదాహరణము.

మ. వనితారత్నము మోము-భ్రూవిలసనవ్యాపారముల్ వక్రము
ద్రనిరూపింపఁగ - సప్రమాణగతినేత్రంబుల్పచారింప-నీ
సునఁదర్కింపఁగడంగివచ్చుద్విజరాజున్గ్రహస్థానయు
క్తునిఁగాఁజేసిచెలంగునప్రతిభచేఁగొత్తల్ వితర్కింపగన్.

పై పద్యములో దర్కశాస్త్రవాసనయున్నదని యందరెఱిఁగినదే. ప్రబంధ కవులలోఁ జాలమందికవులకు-ఒకభావము నెట్లు చెప్పవలెనను చింత యెక్కువ. అనఁగా-ప్రాతభావములనే తీసికొని - తమయుక్తివై చిత్రితోఁ జెప్పవలెననునాస కొందరికేవి చెప్పవలెననుచింత, వారి యలం కారములు - వస్తువులు చాలవఱకచుంబితములుగా నుండును. ఈ తెగ వారిలో-నాదృష్టిలో రాయలొక్కఁడు, రామకృష్ణుఁడు పట్టభద్రుఁడు. ఈ వాసన మల్లన్నకు గూడఁ గొంతయున్నట్లున్నది. ఏయలంకారము చెప్పి ననుఁ గ్రొత్తగాఁ భాసింపఁజేయుట, వనవిహారములో నీపద్యమున్నది.

చ. కలితకపోలకాంతికళికల్ దళుకొత్త నొకర్తు-తీగయు
య్యెల వడినాడువేళ జరణాంబుజనిర్మితలాక్షసోకి-త
త్తలమహిజాతపల్లవవితానముమించె-మదీయసామ్యముల్
దలఁపకుమంచుఁ దత్పదము తన్నిన నెత్తురుగ్రక్కునోయనన్. (2-146)

ఒకతె తీగయుయ్యాలపై నూఁగుచున్నది. దాని చరణములకు లత్తుక. ఆకాలు - చెట్లలోనిపల్లవములకుఁ దాఁకినది. లత్తుకవానికంటుకొన్నది, దానినిఁ గవి యుత్ప్రేక్షించుచున్నాఁడు. "నాచరణములతోడి - పోలికకు రాకుఁడని" వనితపల్లవములనుదన్నినదట! ఆతాపునకవి నెత్తురుగ్రక్కె నట! క్రొత్తయుత్ప్రేక్ష.

సీ. వనజవాసకు దండ్రిపనిచినమత్యంపు
సరముచాడ్పున నంచచాలు మెఱయ-
జలదేవతాపుత్రికలుదాల్ప నిచ్చిన
గిలుకలక్రియ చెందొవలు ధనర్వ-
కాసారపతిభుజాంగదవ్రజదీప్తుల
సరణి నూర్మ్మిల బేడిసలు నటింప-
సమధికసౌరభ్యసంపదఁ గాపాడు
నారెకులనగ భృంగాళి దిరుగ-

గీ. పత్రఫలపుష్పకిసలయభాగ్యరేఖ
నిండి బొంపిరివోవుచు నీడఁజూచు
పగిది తీరతరుశ్రేణి ప్రతిఫలింప
పొలఁతుకలు జూచి తమలోన;బొగడిపొగడి,(2–152).

సరోలక్ష్మికి సముద్రుఁడొసఁగిన ముత్యాలసరమువంటి యంచలచాలు. జలదేవతాపుత్రికలాడుకొనుచున్న గిలకలవంటికలువలు–అలలపైనాడుబేడి సలు–కాసారపతిభుజాంగద వజ్రదీప్తులవలెనున్నవి. పద్మములసౌరభ్యమును రఱించుచున్న తలారులవలెఁ దుమ్మెదలుదిరుగుచున్నవి. తీరతరుశ్రేణి పత్ర ఫలపుష్పకిసలయములచే నలంకరించి కొన్నవి. తమయలంకారములుబాగుగ నున్నవో లేవో యని నీడఁజూచికొనుచున్నవఁట! అద్దములోవలె; ఎంత సహజముగానున్నది; పైభావములకన్నిటికిది – కోవురమెత్తినటులున్నది. ఈ క్రిందివద్యముగూడ నిట్టిదే. నాయికయొక్క విరహబాధనపనయించుటకుఁ జెలులుచేయు శైత్యోపచారములిట్లు వర్ణించుచున్నాఁడు.

సీ. చెంగావిగట్టె నెచ్చెలియోర్తు మానంపు
రవిగ్రుంకనగుసాంధ్యరాగమనఁగ–
కర్పూరరజమొకకాంతచల్లె వియోగ
దహనమహాకీర్తిమహిమయనఁగ–
కలువలకన్నులకలఁదియొత్తె నొనర్తు
ప్రాణవాయువులోని కణఁచెననఁగ–
బొండుమల్లియలొకపొలఁతి రాశిగఁబోసె
నంగజభూతోపహారమనఁగ–

గీ. నబలకీర్తి శిరకృత్యములొనర్ప
నంతకంతకు సంతాపమావహిల్లఁ
జెలులు కనుఁగొని తమలోన నలబలంబు
లుడిగి–నివ్వెఱగంద నందోర్తు జూచి. (3–110)

రాజశేఖరుఁడు విరహభారముతో రాత్రియంతయు వేగించినాఁడు. అంతలోఁదెల్ల వారినది. ఆయుదయరాగమిట్లున్నది.

గీ. రతిపశరవర్ష నాశనక్రమము దెలుప
మొనసి దీపించు నలయింద్రధనువనంగ
ప్రాచియుమిసినతాంబూలరసమనంగ
యుదయరాగంబు మెల్లన యుప్పతిల్లె. (3-152)

ఇంద్రధనువు వర్ష నాశనక్రమమును దెలుపును. ఉదయరాగము-మన్మధ శరములనెడు వర్ణమింకినదని తెలుపుటకు వచ్చిన శక్రచాపమట్లున్నది. ప్రాచీదేవి యుమిసిన తాంబూలరసమువలెనున్నది. అంతమాత్రముతోఁ దృప్తిపడలేదుమల్లన. సూర్యప్రకాశమునిట్లు వర్ణించుచున్నాఁడు.

గీ. తనదుమనుమనిపెండ్లి కెంతయును వేడ్క
నఖిలదిజ్నాగపతుల రమ్మనుచు శోభ
నాక్షతంబులువెట్టిన యట్టికరణిఁ
గమలబాంధవదీప్తి నల్గడలుమెఱసె. 3-153)

రాజశేఖరుఁడు సూర్యవంశమునఁబుట్టినవాఁడు. అందుచే సూర్యుఁడు దిజ్నాగపతులనుఁబెండ్లికి రమ్మని యాహ్వానించినాఁడు. ఆతనిదీప్తి-శోభనాక్షతములవలె నున్నది. ఇట్టి యుదాహరణము లాతని కావ్యమునిండఁ జిక్కును. క్రొత్తవస్తువులను బట్టికొని వచ్చుటలోఁగూడ నాతనికిదృష్టి యెక్కువ.

క. తరుణపవమానమదకే
సరిపోతము విటపికుంజసామజకుంభాం
తరములు గ్రొవ్వినఁదొఱఁగెడు
గురుమౌక్తికభాతి రాలెఁ గ్రొవ్వీరులవిగో! (2-113)

పవనమును గేసరికిఁ బోల్చుట వింత. అట్లే కుంజములను సామజములకు బోల్చుటయును - చెట్లనుండి రాలినపూవులు గజకుంభములనుండి రాలిన

మౌక్తికములవలె నున్నవఁట! అరుణపుర రాజు తనదుహితకు వివాహమొనరించి - యుడుగరలిచ్చినాఁడు. అవి యనేకములు. వానిలో నీ క్రిందివియుఁగొన్ని:

క. పసుపునకిచ్చుఁ గుమారికి
వసుధాతలభర్త శాలివరవర్ణి తముల్
కుసుమశరచాపరుచిభూ
లసమానములూళ్లు నూరు లర్ఘ్యముగాఁగన్. (3-185)

ఇచ్చిన యూళ్లలోనిభూములు-చెఱుకుఁబండెడివట: హంపీకవులకు చెఱకన్నచోఁజాలఁబ్రీతి. నేటికిని నాప్రాంతములలోఁ జెఱుకుపంట యొక్కువ, మనముతప్పక గమనింపవలసినదీ పద్యము:-

ఉ. ప్రాణముప్రాణమైనతనయామణి నప్పుడు చేరఁ బిల్చి-యిం
ద్రాణికినై నఁ గంసరిపురాణికినై న గణింపరాని-క
ట్టాణిమెఱుంగుముత్తియమనర్ఘ్యము ముంగరకిచ్చుఁ దల్లి య
ఖ్వీణరుచిప్రకాండములు చెంగట వెన్నెలగాయుచుండగన్. (3-187)

ఆకాలపువారికి ముంగరయన్నచోఁ ప్రాణము, నిగమశర్మఅక్క-గూడ శోకించిన దిందుకే. ముక్క-అలోనదికించికొనుటకుఁ దల్లిచక్కని ముత్తె మిచ్చినదట! ఇట్టివి వర్ణించుట తెనాలిరామకృష్ణునివంతు. ఈ యలవాటు మల్లన్నకును గొంతకద్దు. విజయనగర కవులందఱును సంగీతప్రియులు. అగుటచే - వారిరచనలో శయ్యాసౌభాగ్యమెక్కువ.

ఆసాహిత్యకారులందఱును - సంగీతమును నేర్చుచుండిరి. లేకఁ బదిం బదిగా విని-యాసంస్కారమునెడదఁ బట్టించికొనుచుండిరి. మల్లన్నకును - సంగీతమునఁ బ్రవేశమున్నట్లున్నది. ఆతనిపద్యము తీగఁదీసినట్లు సాఁగును. ఉదాహరణమున కొక్కటి.

సీ. విరహోపన్నగఫణావిహరణంబన వేఁడి
యూర్పులఁ బయ్యెద యొయ్యేఁగదల

ననురాగజలధిసంజనితఫేనచ్ఛాయ
లన మేనివెలిచాయ లతిశయిల్ల
గాఢచింతాలతాకలికాకదంబకం
బనఁ ఘర్మకణజాల మంకురింప-
నురుమోహతిమిరఖద్యోతంబులనఁ గాకఁ
బెట్టుకుంకుమలేర్చి బేటులెగయఁ

గీ. గుటిలకుంతల యున్నయిప్పటితెఱంగు
ప్రాణపదమైనమనకుఁ జెప్పంగనేల
జాలనట్టింటి పగయైన శంబరారి
యట్టివానికి మది దయ బుట్టకున్నె. (3-104)

కవిగా-మల్లన్నకన్నియుపకరణములునున్నవి. గొప్ప వ్యుత్పన్నుఁడు. ప్రతిభాశాలి. కాలము కలసిరాలేదు పాపము. అన్నిహంగులు నందటి కమరునా! ఎవరో-యదృష్టవంతులకమరును.

చరిత్రలో నక్కడక్కడ కొన్నివ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములున్నవి. 'వైరిసమాసము'లును గలవు. అనంతమైన యాంధ్రభాషను-బాల ప్రౌఢవ్యాకరణములలో సమన్వయ పరుపజూచుట - కుంజరయూథమును దోమకుత్తుకలో దూర్పయత్నించుట; సంస్కృతశబ్దములుగూడఁగొన్నిటిని మల్లన కవిప్రహితమైన లింగములలోగాక - భిన్నలింగములలో వాడినాఁడు. గీర్వాణమున నిఘంటువులు కొల్లలు. కనుక నావిషయమున - కవిది పొరపాటనుటకంటెను, మనకుఁ దెలిసినది కొద్ది యనుకొనుట శ్రేయస్కరము. 'రాజశేఖరచరిత్రము' నాకొక్కప్రతిమాత్రమే దొరికినది.సరియగు పాఠమునూహించికొనుట - కొంతకష్టమేయయ్యెను. నెల్లూరు వర్ధమాన సమాజమువారాగ్రంథమును నాకొసగి - నాకార్యమునకెంతయోతోడ్పడిరి. వారికి నా కృతజ్ఞతలు దేశమున నాకన్న నెందరో గొప్పవారున్నారు. కాని "ఆంధ్రప్రదేశసాహిత్య అకాడమీ"వారు - ఈ గ్రంథపరిష్కరణము

నకు నన్నెన్నికొన్నారు. అది వారి యౌదార్యము. మిత్రులు దేవులపల్లి రామానుజరావుగారు కార్యదర్శులుమాత్రమేగాదు. కార్యశూరులును. వారియభిమానమునకు నాయంజలి. ఈకార్యమును నాశక్తికొలది, యోర్పు కొలది నిర్వహించితిని. నాలోపములను దయతో మన్నింతురని విజ్ఞులను వేఁడుకొనుచున్నాను.

పుట్టపర్తి నారాయణాచార్యులు

రాజశేఖర చరిత్రము

ప్రథమాశ్వాసము

శా. శ్రీవక్షోరుహశాతకుంభకలశశ్రీవిభ్రమాపాదన
ప్రావీణ్యస్థితిమించు వేంకటగిరిగ్రావద్వయాగ్రంబునం
దావిర్భూతజనానురాగమునఁ బ్రత్యక్షాకృతింబొల్చు న
ద్దేవోత్తంసుఁడు, ప్రోచుఁగాత, మననాదిండ్లప్పదండాధిపున్. 1

మ. నిజకోటీరవియద్ధునీలహరికానిర్యత్కణశ్రేణి య
ద్రిజపై వాయువశంబునం జెదర, నాతీ! నీదు కల్యాణవే
ళ, జటాసక్తములైన ప్రాలనుచు, లీలంబల్క, నవ్వించు నా
త్రిజగన్నాయకుఁ, డేలుఁగాత దయ నాదిండ్లప్పమంత్రీశ్వరున్. 2

ఉ. బుద్ధులప్రోడ, నాల్గుమొగములగ్గల విశ్రుతమూర్తి, తమ్మిపూ
గద్దియమీఁదనుండి త్రిజగంబులు నేలుచునుండువేలుపుం
బెద్ద, వచోవధూటి వలపించిన సర్వగుణైకశాలి, యు
ద్యద్దయఁ బ్రోచుఁగాత, సుగుణాంబుధిఁ దిమ్మయమంత్రియప్పనిన్. 3

శా. ఏదేనొక్కపురంధ్రిగానసుధచే హేలాకరాంభోజవి
దారదండం బిగిరించెనా నఖరుచుల్ నర్తింప ప్రేమాయించున
య్యాదిబ్రహ్మముఖాగ్రరంగనటి, విద్యాబుద్ధిసంసిద్ధి మా
నాదిండ్లప్పని కిచ్చుఁగాత, హృదయానందంబు సంధిల్లఁగన్. 4

చ. ఎలుకలరాచతేజి నెఱయెక్కుడుగాఁ, దపరంజిపైఁడిని
గ్గులుగలమేనిపెన్వడుగు, క్రొన్నెలదాలుపుమద్దుపట్టి, కొ
మ్మలుగలవేల్పు, విఘ్నతరుమూలములం బెకలించు బల్లిదుం
డలగణభర్త, యప్పసచివాగ్రణి కీవుత నీప్సితార్థముల్ 5

క. ఆకాళిదాసముఖ్య
వ్యాకోచవచోవిలాసులగు నామరభా
షాకవివర్యులకు నమో
వాకం బొనరించి, యే నవారితభక్తిన్. 6

గీ. సరససంస్కృతపుష్పగుచ్ఛప్రభూత
మగు తెనుంగనునెత్తావి కఖిలదిశలఁ
దరుణపవమానమగు కవిత్రయవిశేష.
చతురవాచానిరూఢి కంజలియొనర్చి. 7

క. చెప్పఁదగుఁ గవిత రసము
ల్చిప్పిల, నప్పప్ప, బళిబళీ యన; లేదా !
యెప్పుడు చేయకయుండుట
యెప్పు సుమీ! సుకవి; యెంత యుచితజ్ఞుఁడొకో! 8

శా. గాఢార్థప్రతిపాదనక్రమకళాకౌశల్యముల్లేక వా
చాఢక్కార్భటితోడఁ, దామ తము 'మర్ష్టూ'యంచుఁ గై వారముల్
ప్రౌఢింజేయుచుఁ, బ్రాజ్ఞులన్నగుచు గర్వగ్రంథులై యుండు న
మ్మూఢస్వాంతులు మెచ్చకుండుటయు సమ్మోదంబు మాబోంట్లకున్ 9

వ. అని యిష్టదేవతాప్రార్థనంబును, బురాతనచతురసుకవిప్రశంసనంబును, గుకవినిరసనంబును గావించి, యే నొక్క మహాప్రబంధంబు నిర్మింపఁ దలఁచియున్న సమయంబున. 10

సీ. భట్టియుగంధర ప్రముఖుల కృత్యంబు,
లొరగు[1]లో త్తెడు మంత్రు లొక్కవంక
విక్రమార్కోదగ్ర విక్రమక్రమకళల్,
లెక్కచేయని శూరు లొక్కవంక
శేషాహిభాషావిశేషంబు, మెచ్చక
యుండు విద్వద్బ్రహ్మ లొక్కవంకఁ

---

1 వంకలు దిద్దు.

గాళిదాసాదులఁ గవితాప్రగల్భత,
నొరయు[2]సత్కవివర్యు లొక్కవంకఁ

గీ. దానమానక్రియానూనగానసరణి
వెలయుతుంబురునారదాదుల గుఁజించి
[3]యుల్లసంబాడుగాయకు లొక్కవంక
మహిమఁ గొలునంగ నప్పనమంత్రివరుఁడు. 11

క. పేరోలగముండి కవి
త్వారూఢవిశేషగోష్ఠి నాలించుతమిన్
'రారామ్మ'ని ననుఁబిలిచి సు
ధారసమధురోక్తిఁ బలికెఁ దద్దయుఁ బ్రీతిన్. 12

ఉ. శంకరపాదసేవనవశంవదమానసపంకజాత! ని
శ్శంకవచోవిలాస! రుచిసారవినిర్జితపూర్ణపూర్ణిమై
ణాంక! దురంతశాననభయంకర! శౌనకగోత్రపాత్ర! య
య్యంకిపురాగ్రహారవిభవాకర! మాదయమల్లసత్కవీ ! 13

క. నీవిపుడు చెప్పఁదలఁచిన
భావరసోద్యన్మహాప్రబంధము నాపైఁ
గావింపు మంకితంబుగఁ
గోవిదహృదయప్రమోదగుంభితఫణితిన్. 14

వ. అని సబహుమానంబుగాఁ గర్పూరతాంబూలానర్ఘ్య మణిమయాంబ
రాదులొసంగినం బ్రీతచేతస్కుండనై యంగీకరించి. నారచియింపం
బూనిన యిమ్మహాప్రబంధంబునకు సారఘనసార ప్రాయంబగు నాయ
కుని వంశావతారం బభివర్ణించెద. 15

శా. శశ్వత్తీవ్రతపోమహామహిమచే, జంభాసురద్విట్పురీ
వైశ్వర్యకళాసమృద్ధి సరిగా వేర్వేర నిర్మించి, వే

---

2. రాచు, పరిఢించు, 3. ఉపాలంభించు.

దశ్వాసుండగు వేల్పుఁబోనికెనయై తా మించె నేమౌని, యా
విశ్వామిత్రమునీంద్రు, మామకమనోవీథిం బ్రశంసించెదన్. 16

క. ఆకౌశికవంశాంబుధి
రాకాహిమరోచి, సచివరత్నము, పుణ్య
శ్లోకుఁడు, వితరణరేఖా
[4]నాకానోకహము, మంత్రి నామన వెలసెన్. 17

చ. అతనికి సింగమాంబకు మహామహు, లాశ్రితవజ్రపంజరుల్,
సుతులు జనించి, రంచితవచోరచనాఫణిభర్త, లోకస
మ్మత [A]నుతమార్గవర్తనుఁడు, మాదయమంత్రియు గంగనార్యుఁడున్
గతకలికల్మషుండు చిటిగంగనయు, న్నిగమత్రయాకృతిన్. 18

ఉ. సాళువనారసింహమనుజప్రభు కార్యకళాధురంధరుం
డై, లవణాబ్ధి వేష్టిత ధరాధిప దుర్మతమంత్రమంత్రిశుం
డాలవితానకేసరి యనంగ, ననంగసమానరూప రే
ఖాలలితాంగుఁ డట్టి చిటిగంగనయొప్పు గుణానుషంగుఁడై 19

శా. అంగాధీశకళింగరాజమగధాధ్యక్షాది భూభృత్సభా
రంగాభంగవిహారముల్, ఘనశిలాగ్రావస్థలీసంసర
ద్గంగోత్తుంగతరంగనిర్గళితనిధ్వానోద్భట ప్రక్రియా
సాంగత్యంబులు, చిట్టిగంగవిభువాచాసంభ్రమారంభముల్. 20

క. అందగ్రజునకు, ధృతిజిత
మందరకుధరునకు, మాదమంత్రికి సొంద
ర్యేందిరయగు నమలాంబకు
నందనులు జనించి రార్యనందితులగుచున్. 21

శా. ఆ రూఢోన్నతి నన్నపార్యుఁడును, సింగామాత్యుఁడున్, సర్వవి
ద్యారాజీవభవాకృతిన్ వరదదండాధీశుఁడున్, మంత్రిచూ

---

4. కల్పవృక్షము; A శ్రుతి.

డారత్నంబగు మాధవుండు, నరిరాడ్గర్వచ్ఛిదాపాదన
శ్రీరామాపరమూర్తి యీతఁడనఁగా, శ్రీరామభద్రాఖ్యుఁడున్. 22

గీ. అందు వరదయమంత్రిసంక్రందనునకు
గోపమాంబకు నుదయించి రాపగేంద్ర[5]
సన్నిభులు తిమ్మనార్యుండుఁ జిన్నతిమ్మ
ఘనుఁడుఁ గొండయమంత్రిపుంగవుఁడు ననఁగ 23

ఉ. వారలలోన నగ్రజుఁ, డవారితశౌర్యుఁడు, తిమ్మమంత్రిమం
దార, ముదగ్రదోరసివిదారితదారుణవైరివీరకం
ఠీరవకంఠశోణితధునీఘనఫేనవిభాసి[6]తత్పత
ద్భూరిసితాతపత్రరణభూమి, యతండొక మంత్రిమాత్రుఁడే? 24

శా. నాదిండ్లాన్వయవార్ధిశీతరుచి, దానశ్రీత్రసంపన్నుఁడా
శాదంతావళదంతకుంతపటలస్పర్ధాళుసత్కీర్తి, నా
నాదేశక్షితిపాలమంత్రికులరత్నం, బాశ్రితవ్రాతవి
శ్రాదాక్షిణ్యనివాసభూమి, యన లోకఖ్యాతి మించెన్మహిన్. 25

గీ. సత్యగుణశీలి యమ్మహాసచివమణికిఁ
గృష్ణమాంబకుఁ గోనమంత్రీశ్వరుండు
భాగ్యసంపన్నుఁడప్పనప్రభుఁడు గోప
దండనాథుఁడుఁ బట్టి రుద్దండలీల 26

ఉ. ప్రాపితరాజ్యవైభవనిరాకృతపాకవిరోధియైన యా
గోపనమంత్రి, ధర్మధనగోపనసమ్మతి గుత్తిదుర్గల
క్ష్మాపరిపాలనక్రమసమిద్ధభుజాబలశాలి, రూపశే
ఖాపరమత్స్యలాంఛను, డయావహ[7] కార్యధురంధరుం డిలన్. 27

సీ. శీతలాకృతిఁ గొంత చెప్పంగఁదగుఁజంద్రు.
నెలనెల నుష్ణాంశుఁ గలయఁడేని

---

5. సముద్రము; 6. అక్కడఁబడుచున్న; 7. శుభమును గల్గించునది.

వితరణస్థితిఁ గొంత ప్రతివచ్చు మేఘుండు,
చపలానుషంగంబు[8] సడలెనేని
భోగసంపదఁ గొంతఁబురుడింపఁదగుఁ నింద్రుఁ
బాకారి[9] యనుపేరఁ బరఁగఁడేని
సౌందర్యమునఁ గొంత సరివత్తు రాశ్వినే
యులు, భేషజంబూని[10] యుండరేని

గీ. కొంత యెనవచ్చు గాంభీర్యగుణమునందు
నంబుధిస్వామి యొకవేళ నడఁగఁడేని
యనఁగ సర్వగుణఖ్యాతి నతిశయిల్లె
మానధనరాశి, గోపనమంత్రివరుఁడు. 28

క. ఆయనుఁగుందమ్మఁడు విన
యాయతమతిఁ గొల్వ నప్పనార్యుఁడు నతఁడున్
బాయక యన్యోన్యప్రియు
లై యలరిరి, రామలక్ష్మణాకృతులగుచున్. 29

క. ఆయప్పమంత్రిగుణములు
వేయితెఱంగులఁ జెలంగి వినుతియొనర్పన్
డాయఁగఁ గాకోదరకుల
నాయకునకుఁ గాక, కవిజనంబుల తరమే. 30

సీ. నిజకీర్తిజలధి, కున్నిద్రగుణస్ఫూర్తి,
నిత్యపూర్ణేంద్రుగా నిలిపినాఁడు
కరపేతి, పరశిరఃక్రమ కిరీటాగ్ర
పీఠులపై వాఁడిఁ బెట్టినాఁడు
ధరఁదాల్ప, హరిదంతదంతిసంతానంబు
మూలకు ముట్టఁగాఁ దోలినాఁడు

---

8. మెఱపుతోడి సంబంధము, చపలులతోడి స్నేహము; 9. పాకుఁడను రక్కసుని గూల్చినవాడు, వంటలకు శత్రువు; 10. మందు, బడాయి.

వాచానిరూఢి, గర్వము చూపవచ్చిన
శేషాహి నాలుకల్ చీటినాఁడు

గీ. కపటరాజన్యమంత్రి, దుర్గర్వభార
తిమిరపటలంబు, శేముషీతీవ్రభాను
భానుమాలికచేఁ బటాపంచచేసి
వెలసినాఁడన, నవ్వన వినుతిఁగాంచె 31

మ. పలుమా ఱంబుధరంబు చూపు బహురూపం బంబరాసక్తి; శీ
తలభానుండును బొట్టపెంచుటకునై తాల్పుంగళాప్రౌఢి; సి
చ్చలు వారింపఁజరించు వారినిధి యాశాబద్ధుఁడై ; వీరలన్
దిలకింపందగు నోటు! దాతలని, నాదిండ్లప్పనిం జెప్పుచోన్. 32

సీ. ఏమంత్రిమణి నిజస్వామికార్యక్రియా
తత్పరమానసోత్సాహశాలి
యేమంత్రిమణి మిత్రహితబాంధవాశ్రిత
ప్రకరరక్షణకళాప్రౌఢబుద్ధి
యే మంత్రిమణి వచోహేలాతి నైర్మల్య
శీతలతాధూతశీతరోచి
యేమంత్రిమణి సుధాధామశాంభవధామ
ధాళధళ్యసుతుల్యధవళకీర్తి

గీ. యట్టి మంత్రికులోత్తంస, మహితనృపతి
పటలమకుటాగ్రఘటితపత్పద్మయుగళి
సకలకర్ణాటరక్షావిచక్షణుండు
దీనసురశాఖి, సాళువతిమ్మమంత్రి 33

గీ. అమ్మహామంత్రి కతని యర్ధాంగలక్ష్మి
సకలపుణ్యాంగనాజనశ్లాఘనీయ
అమ్మమాంబకు నుదయించి లలినిమెఱయు
తిరుమలాంబికఁ బెండ్లి యై తేజరిల్లె 34

ఉ. చెప్పెడిదేమి; నవ్వుచు రచించినమాటలు, రాముబాణముల్
దప్పినఁ దప్పఁ, డాశ్రితకలాపముముంగిటనున్న వేలుపుం
దిప్ప, వివేకశాలి. యువతీజన చిత్తవినూత్నదర్పకుం,
డప్పనమంత్రి, వానిఁ దరమా! నుతియింప నిలింపకోటికిన్ 35

శా. నాదిండ్లప్పని శుభ్రకీర్తి లమృతాంధస్సింధుపీచిఘటా
తాదాత్మ్యంబు వహింపఁ బోలు నదిగాదా! తద్భుజాపీఠికా
ప్రాదుర్భూతపటుప్రతాపసుషమాభర్మాంబుజాతచ్ఛటా
శ్రీ దాంపత్యముచూపు నెప్పుడు నభస్సీమవిజృంభించుచున్ 36

క. అప్పనవెట్టక, నాదిం
డ్లప్పన చేతికి నొసంగు నభిమతఫలముల్
తెప్పలుగాఁ గోకొమ్మని.
యప్పనఁగా నెఱుఁగ రెందు యాచకముఖ్యుల్ 37

క. ఈదృగ్గుణాహి[11] కర్ణున
కాదరసల్లపన నవకృతా? హృతిచాతు
ర్యోదయచమూ[12] కర్ణున
కాదిమవైష్ణవకథానియతకర్ణనకున్ 38

క. కుటిలారిభయదసేనా
ర్భటికిన్, బలశౌర్య నిలయపటికిన్ రాధా
విటమంత్రలిఖిత? మతిసం
పుటికిన్, సత్రామృతాన్నపోషితజటికిన్ 39

క. దంభేతరమతిగతిసో
హంభావమ్మతికి, సంభృతావనిబాహా
స్తంభధృతకుంభినీధర
కుంభీనసజరఠకమఠకుంభీ? తతికిన్ 40

---

11 పాములవతంసములుగాఁ గలవాఁడు (శివుఁడు) 12. శేషుఁడు; విహిత?

క. శ్రీకవితాపఘనోద్భు
ష్యా(?) కోటినవినరోమసంఘమిషవస
ల్లోకో త్తరగుణబీజా
స్తోకాంకురనిధికి, దానదుగ్ధాంబుధికిన్. 41

క. శీలవదాళివిధాతకు,
సాళువతిమ్మప్రధానజామాతకు, ను
ద్వేలస్పర్శనవిజిత
త్రైలోక్యచరాచరప్రదాతకుఁ బ్రీతిన్ 42

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయెనర్పం బూనిన యిమ్మహాప్రబం
ధంబునకుం బ్రధానకారణంబగు నావంచికపురవరం బెట్టిదనిన 43

సీ. సౌధచరద్వధూజనదర్పణీ[13] భవ
ద్దివ్యలోకస్రవంతీజలంబు
రజతవప్రస్థాణుగజచర్మశాటీభ
వత్పరిఘూవారివలయితంబు
శాతమన్య[14] వశిలాస్థగితకాంచీదామ
భాసురోపవనాళి పరివృతంబు
పౌరప్రతాపవిభ్రాంతికృత్కుట్టిమ
స్థలశోణమణిరుచిస్థపుటితంబు

గీ. బహువిధా మోదమోదితభసలకలభ
విసరవిస్మరఝుంకార వేణునినద
సరసగాయకగాన ప్రసంగసౌఖ్య
కరణకరమగు నావంచికాఖ్యపురము 44

శా. నీడల్బాలు పసిండిమేడలపయిన్, నీలాలకల్ పుట్టచెం
డాడం, దాఁకిన కందుగాని, శశియం దంకంబుగాదంచు వా

---

13. అద్దముగానగుచున్న; 14. ఇంద్రనీలములు ;

దాడన్ వచ్చినయంకకానికిఁ, దదీయాశంకతో?, వీటిపెన్
బ్రోడల్ తోడ్కొనిపోయి చూపుదురు తన్నూత్న క్రియాకేళికల్; 45

ఉ. వారణవారకర్ణపుటవాతకిశోరవిసారసారక
ర్పూరపరాగముల్ నెఱయుఁబో పురవీధులఁ, దారతారము
క్తారమణీయమంటపవితానవినిర్గతకాంతివాహినీ
పూరములోపలం గలయఁబొల్చు వినిర్మలవాలుకాకృతిన్ 46

ఉ. వాడల వాడలన్ మెఱయు వారవధూటుల వక్త్రిపద్మ సం
క్రీడదనూనవాసనకుఁ గేలిసరోవరపుల్లహల్లక
క్రోడసుగంధిగంధములకుం, గలహంబులు చక్కఁ బెట్టి చె
ల్లాడఁగఁ జేయు సజ్జనుక్రియన్, మలయాచలవాతపోతముల్ 47

ఉ. గబ్బిపిసాళివాలుఁదెలికన్నుల తేటమిటారి చూపులన్
మబ్బుకొనంగఁ జేసి, విటమానసముల్ దమివెల్లి ముంపుచున్
గుబ్బ మెఱుంగుఁజన్నుఁగవకుంకుమపూఁతల కమ్మతావి యా
గుబ్బలుగాఁ జరింపుదురు, కొమ్మలు, తత్పురమార్గ వీధులన్ 48

చ. అరవిరిబాగుతో నలరులమ్మలతాంగుల లేఁతనవ్వులన్
బెరసిసరంబులప్పటికిఁ బెంపువహించుటఁ జేసి, చూపఱుల్
గరమనురక్తిమై నిలిచి కైకొని, పిమ్మటఁబోయిచూచి యా
సరములుగావు పొమ్మనుచు, సారెకుఁ గ్రమ్మటివత్తు రేమనన్ 49

ఉ. కాఁకరపండువంటి జిగిగల్గిన మేలివసిండి, ధాత్రికిన్
ద్రావేఁకము, ద్రవ్వి పోసినను వేయియుగంబులుచెల్లు ధాన్యముల్
పోకఁకుఁ బుట్టెఁడమ్మినను బోనొక కల్పముపట్టుఁ జూడ్కిపే
రేఁకటి దీఱు, వైశ్యపతులిండ్లు గనుంగొన నొప్పునప్పురిన్ 50

క. అన్నగరి చిఱుతయేనుఁగు
గున్నలపై నెక్కి, నిక్కి కోయఁగ వచ్చున్

పోన్ ?

మిన్నేటి పసిఁడి తామర
లన్నన్ మఱి యేమిచెప్ప నందలి కరులన్ 51

చ. బిసరుహబంధుఁగొండచఱిఁ బెట్టుటయొండెఁ, బయోధి నీటిలో
మసలక వైచుటొండె, నడుమన్నిలఁబట్టఁగరావు వాగె వె
క్కసములు, మాకు నెందు సరిగావు సుమీయని యాడుచుండు సం
తసమున భానురథ్యములఁ, దత్పురి తుంగతురంగ సంఘముల్. 52

వ. మఱియు నప్పురంబు, పురందరశిలాశకలనికరనిచితరచితవప్రప్రభాపూ
రంబులు పురరాజపట్టాభిషేచనోచితకచనిచయగళితకలితోత్పలకందళం
బులంబోలి పొలయ, నికటఘటయంత్రసలిలసంవర్ధితారామస్థలపరితో
దారశాలికేదారంబులు సతతసన్నిహితదర్వకకల్పితానల్పకనకమయ
వేదికలంబోలి మించ, నంచితంబై, యంగజహరశరీరంబును నయో
ధ్యాపురంబునుంబోలి, సదారామాభిరామక్రీడావర్ణనీయంబై, విష్ణు
వక్షస్థ్సలంబును విమలాపగాజలంబునుంబోలి పద్మాలంకృతంబై, నీతి
విహారయోగ్యంబయ్యు నానీతివిహారయోగ్యంబై, ఖండనవక్రిమంబులు
శాస్త్రంబులయంద, శూన్యగృహంబులు చతురంగఫలకంబులయంద.
కార్శ్యంబులు కామినీమధ్యంబులయందకాని, తన యందుఁ బొరయ
నీక యొప్పు నప్పురంబున కధీశ్వరుండు.

సీ. శ్రీసతీసీమంతసిందూరవేదిక,
కపటారికాసారగంధకరటి
గంభీరగుణకథాకలశపాథోరాశి,
సాతత్యసత్య విశ్రమణసీమ
సకలబాంధవకలాపికలాపనీరదం,
బుదితాఘధరణిభృద్భిదురపాణి
నిజకీర్తివల్లరినీరంధ్రదిగ్వీథి,
కవికుటుంబత్రాణకల్పశాఖి

గీ. సజ్జనానూనకరుణారసప్రవర్తి
భూజనాత్యంతసంస్తుత్యపుణ్యమూర్తి

కామినీలోకహృద్వశీకరణపుష్ప
ధన్వుఁడననొప్పు, నాహేమధన్వనృపతి; 54

మ. అతఁడుత్తుంగతురంగధాటిరభసుండై, విద్విషన్మండలీ
నతపాందాంబుజుఁడై, యయాతిరఘుమాంధాతృప్రభావప్రభా
న్వితుఁడై, తాల్చె నశేషభూభరము కంఠేకాలకంఠస్థల
స్థితిసంభావితసంభ్రమభ్రమితుఁడై శేషాహి చెల్లాడఁగన్. 55

క. కని, కరము మోడ్చు పగఱి
న్గనికరమునఁ బ్రోచు, లేక కలహించెద నే
నని, లోనఁ, జలము పూనిన
ననిలో, నిజకోపవహ్ని కాహుతిచేయున్ 56

సీ. కడుపారఁగాఁ బచ్చికలుమేసి
తముఁదామె యావులుచేపి చన్నవసిపితుకుఁ
దటికాల మొక్కింత దప్పనీక మొగుళ్ళు
నెలమూడువానల నెలమిఁగురియు
బెరిఁగి దట్టంబులై బీరువోక తనర్చి
సకలసస్యములు దున్నకయపండుఁ
దలపూవువాడక తామరతంపరై,
ప్రజలు నూఱేండ్లును బరిణమింత్రు

గీ. మునుల తపములు నిర్విఘ్నముగఁ జెలంగ
నెందుఁ గలిదోష మావంత చెందనీక
క్రతుఫలంబుల సురల యాకండ్లు దీర్చి
ధరణిఁ బాలించె నాహేమధన్వనృపతి. 57

క. ఈలీల సకలధాత్రీ
పాలన మొనరింపుచును, విభావసుతనయం
బాలిక యను బాలిక కుల
పాలికగా, నతఁడు సౌఖ్యపరతంత్రుండై. 58

గీ. పెద్దకాలంబు నడపిన పిదపఁ దనకుఁ
బుత్రలాభంబులేమికిఁ బొగిలి పొగిలి
యొక్కనాఁడు మనంబున నోర్వలేక
పలికెఁ, నారాజు పాలికాలలనఁ జూచి 59

చ. మలయజగంధి! యీ కరిసమాజము నీహాయపంక్తి యీభటా
వలియునుగల్గి నాబ్రతుకు వన్నెకు నెక్కదు పుత్రహీనతన్
గలువలవిందుపొందువెలిగా నుడుపంక్తులు మింట మిన్కనన్
బొలఁపటీయున్న రాత్రిగతిఁ, బూర్వకృతంబది యెట్టిదో కదా! 60

ఉ. మచ్చికతోడఁ బాఱులు కుమారుని నక్కునఁజేర్చి విధికిన్
వచ్చి సుఖోపలాలనమునన్ మునుమాపులు ముద్దుసేయఁగా
నిచ్చల నిచ్చలుంగని యొకించుకయేనియుఁ బాయవేకటుల్
ముచ్చటదీఱ నింక మనముం గయికొందుమె! యట్టిభాగ్యముల్ 61

సీ. లోచనానందకల్లోలినీభర్తకుఁ,
దోయజారాతి పుత్రుండె కాఁడె
శ్రవణహితాలాపరత్నాంకురాళికి
రోహణాచలము పుత్రుండె కాఁడె
యమితపాతకపుంజతిమిరమండలికి, న
ఖండదీపంబు పుత్రుండెగాఁడె
సంసారసుఖమహీజాత సంఘమునకు,
దోహదసేవ పుత్రుండెకాఁడె

గీ. దుఃఖములఁ బాపి ముక్తికిఁ ద్రోవచూపి
ప్రోవఁ జాలినవాఁడు పుత్రుండెకాఁడె
కాన నిహపరసాధనకారణంబు
తల్లిదండ్రుల కాత్మీయతనయుఁడబల! 62

ఉ. చందురువంటి నెమ్మొగము చక్కటిఁ దూలఁగఁబుట్టు వెండ్రుకల్
గెందలిరాకుఁ బాదములఁ గీలొక్కనఁ జేసినయట్టి చిన్నిపైఁ

డండెలు గల్లు గల్లుమన నాడుచు నల్లనచేరవచ్చి నా
ముందఱనాడ నెన్నొఁడొకొ ముద్దియ! ముద్దుఁగుమారుఁ గాంచుటల్ 63

గీ. తోయజానన యొకబుద్ధి తోఁచెనాకు
నాధికారణమీశ్వరుం డఖిలమునకుఁ
గాన నద్దేవదేవుని కరుణలేక
యీప్సితార్థంబు లేరికి నేల కలుగు? 64

గీ. నీలకంఠుని శిరసుపై నీళ్ళుచల్లి,
పత్తిరి సుమంత సెవ్వఁడు పాఱవైచుఁ
గామధేనువు వానింటిగాడిపసర
మల్లసురశాఖ, వానింటిమల్లెచెట్లు. 65

సీ. నవరత్నమయభూషణములు దాల్చినవారు
సింహాసనస్థులై చెలఁగువారు
పరతత్త్వవాసనాపరతఁ గాంచినవారు,
నిఖిలవిద్యాప్రౌఢి నెఱయువారు
చిరకాలజీవులై, క్షేమమొందెడువారు
వితరణవిఖ్యాతి వెలయువారు
బంధుమిత్రస్ఫూర్తిఁ బాయకుండెడువారు,
బహుపుత్రలాభంబుఁ బడయువారు

గీ. చక్కఁదనమున వన్నెకునెక్కువారు
తొంటిమేనుల సద్భక్తితొంగలింపఁ
గాశికానాథుఁ గామారిఁ గాలకంఠు
పూజచేసిన వారెపో పువ్వుఁబోఁడి! 66

సీ. కడలేని సంసారజడధిలో మునిఁగిన
జనులపాలిటనావ, శంభుసేవ
కడుదూరమైయున్న కైవల్యసీమకుఁ
జిక్కని పెనుద్రోవ, శంభుసేవ

యతిభోగభాగ్యంబు లనుముత్తియంబుల
సరులఁగూర్చినకోవ, శంభుసేవ
సకలాగమజ్ఞానసారమహీజాత
జాతంబులోచేవ, శంభుసేవ

గీ. నిరవధిక్రూరపాతకదురవగాహ
గహనదహనసమున్నిద్రగంధవాహ
సఖశిఖామాలికలశేవ, శంభుసేవ
(సద్గుణలతాంతములతీవ, శంభుసేవ.) 67

✓ క. కావున మన మద్దేవుని
భావంబున నిలిపి సుతునిఁ బడయుదమనుచున్
దేవియును దానుభూపతి
కేవలతరశైవమార్గకృతనిశ్చయుఁడై. 68

క. హాటకశైలధనుర్ధరుఁ
బాటింపనివాఁడు నాకుఁ బగవాఁడనుచున్
గూటపరిపంథిగర్వో
చ్చాటన గుణశాలి, యతఁడు చాటంబంచెన్. 69

ఉ. ఎచ్చటఁ జూచినం బ్రమథ హిండిత[15] చండనిశాతవర్తనం
బెచ్చటఁ జూచినన్ గుహగణేశ్వరభవ్యగుణానువాదనం
బెచ్చటఁ జూచినన్ శివసమీహితపుణ్యకథానుకీర్తనం
బచ్చపడంగఁ జేసె నతఁ, డాదిమశైవకులాగ్రగణ్యుఁడై. 70

శా. చూడం జిత్రము, పత్రపుష్పముల కంచుంజేరనేతెంచి పెన్
ప్రోడల్ శైవకథారహస్యములకై పోరాడుచుం బోవుచోఁ
గూడన్వచ్చి తదీయవాదముల చిక్కుల్దీర్చుఁబో పట్టణ
క్రీడాకాననవీథికాగ్రశుకశారికిన్నరద్వంద్వముల్ 71

---

15 వ్యాప్తము;

శా. కించిన్మర్దళ నృత్యగీతసరస క్రీడావిధంబుల్, శుకీ
చంచూచంచదనూనరత్నఖచిత స్తంభంబు, లభ్రంకషో
దంచ ద్గోపుర పంక్తులు న్మెఱయ, నుద్యద్భక్తి నూరూరఁ గ
ట్టించెన్ భూపతి దేవతానిలయకోటిన్ జాహ్నవీజూటికిన్. 72

సీ. చంద్రకాంతోపలస్వచ్ఛవేదీస్థలుల్
కట్టిజవ్వాదిచేఁ గలయనలికి
యనవుగాఁ గ్రొత్తకట్టాణిముత్తియముల
నిగ్గులు వెదచల్ల ముగ్గువెట్టి
యర్ఘ్యోదకంబుల నభిషేక మొనరించి
రమణీయరత్నపీఠమున నునిచి
మృగమదపంకంబు మేన నిండనలంది
మేలేర్చి క్రొవ్వీరుల్ గీలుకొలిపి

గీ. ధూపమర్పించి కర్పూరదీప మొసఁగి
యమృతదివ్యాన్నరుచిరోపహారమిచ్చి
వనితయును దాను సాష్టాంగవినతిఁ జేసి
చంద్రధరుఁగొల్చు నారాజచంద్రుఁడెపుడు. 73

శా. రాజచ్చంద్రశిలాతలాంతరలతారమ్యప్రదేశంబులన్
గాజుంగుప్పెలలోని యచ్ఛతరగంగావారి నోలార్చి యా
రాజున్ దేవియు మంత్రపూతముగ హేరాళంపుఁ బూగుచ్ఛులన్
బూజల్ సేయుదు, రిచ్చలంజెలఁగి ముప్పూటం, బురారాతికిన్. 74

క. సంతానకాంక్ష నాశ్రిత
చింతామణి సకలలోకసేవితుఁ, గరుణా
స్వాంతుని, రాజతశై లని
శాంతుని, భజియింతు రెపుడు సతియున్ బతియున్ 75

క ఆమానవపతి చిత్తా
రామములో నుండమరిగి, రాజతభూభృ

తీసమకయి పోఁదలంపక
సోమకళాధరుఁడు, మిగుల సోమరియయ్యెన్. 73

వ. ఖిన్నవిధంబునం బరమశైవాచారసంపన్నులగు దంపతులప్పరమేశ్వరుని
సేవింప నొక్కనాఁడు, 77

చ. కలఁగని యమ్మహీవిభుఁడు ప్రక్కునలేచి నిజంబుగా మదిన్
దలఁపుచు, మేను గర్పొడవ, నల్గడలుం బరికించి, "యోకృపా
జలనిధి! యోమునీంద్రవరసంస్తుత! యో జగదేకనాథ! నిన్
గలఁగను గొంటిఁ; దొంటికలికల్మషజాలము వీడుకొంటి" నే; 78

మ. అని యంతంతకు నమ్మహామహిమ కత్యాశ్చర్యముంబొంది య
జ్జననాథాగ్రణి పాహిపాహి యనుచున్ సంతానదానక్రియా
జనకంబైన ఫలంబు మౌళినిడి వటుఁపీఠిపైఁదార్చి లో
చనయుగ్మంబునఁ జేర్చుచుంబొగడుచున్ సంతోషితస్వాంతుఁడై. 79

ఉ. పాలిక మేలుకొల్పి నరపాలశిఖామణి "వింటివే వినీ
లాలక! నిన్న రేయి యొక యచ్చెరు, వాశ్రితపారిజాత సు
శ్యాలశశాంకమౌళి, మనపాలిటి కొంగుపసిండి, మందమం
దాలసలీలవచ్చె, దరహాసవిభాసిముఖారవిందుఁడై. 80

క. వచ్చి" భవద్భక్తికి నే
మెచ్చితి నీ ఫలము నీ సమీహిత మొసఁగున్
బుచ్చుకొను"మనుచుఁ జేతికి
నిచ్చి భవానీశుఁడరిగెనే లలితాంగీ!" 81

క. అని పలికి యభవుఁడిచ్చిన
యనర్ఘ్యఫలము విభుఁడిచ్చె నాత్మాంగన కెం
దును శివభక్తులకును గలఁ
గనిన ఫలంబెన్న నిజముగాఁ జేకుఱుఁగా! 82

ఉ. ఇచ్చిన మ్రొక్కి పుచ్చుకొని యింపును సొంపును బల్లవింపఁగా
నచ్చపలాయతేక్షణ, శివార్పణమంచు సుధారసంబుతో
మచ్చరికింపఁజాలురుచిమత్కల మాదట నారగించి, వా
క్రుచ్చఁగరాని మోదమునకున్నెలవై, పెనుపొందె నంతటన్ 83

సీ. చూపుఁదేటులపిల్ల లూపాడఁజొచ్చెఁబో,
యూడక యవి యేల యడఁగియుండుఁ?
జనుఁగవజక్కవల్ పెనుపొందియుబ్బెఁబో,
యుబ్బక యవియేల యూరకుండు?
వేణికానీలాహి విస్ఫూర్తి మించెఁబో,
మించక యదియేల మిన్నకుండు?
చిఱునవ్వుమొలకలు చిగురొత్తఁదలఁచెఁబో,
తలఁపక యని యేల నలఁగియుండు?

గీ. ననఁగ నొకక్రొత్తచెల్వ మయ్యంబుజాత
గంధికెంతేని గల్గె నక్కనకశైల
కార్ముకానూనకరుణావికాసలబ్ధ
ఫలరసామృతధార లల్పంబె తలఁప? 84

క. ఈరీతి నమ్మృగేక్షణ
యారూఢమనోనురాగయై యుండుతఱిన్
మేరుమహీధరకార్ముక
కారుణ్యము కతనఁ గొన్ని ఘస్రంబులకున్ 85

సీ. కౌనుదొడ్డతనంబుఁ గని చింతపడుగతిఁ
గుచముఖంబులు నీలరుచి వహించె
మందస్మితంబున మరగిరాదన ముద్దుఁ
బలుచనిచెక్కులు పలకఁబాఱె
ఫలరసంబులకెవ్వి ప్రతిరామి,నొల్లదో
యన జిహ్వికన్నిట నరుచి పుట్టె

గర్భస్థుఁడగుబాలు కమనీయగుణభార
మహిమనా, నడ లతిసుందమయ్యెఁ

గీ. గలికిబేడిసమీలతోఁ గలహమాడు
వాలుఁజూపులదాటులు డీలుపడియె
మంటికమ్మనితావిపై మనసుపాఱె; 86
నాఁడునాఁటికిఁ బాలికానలినముఖికి

వ. అట్లు గర్భభరాలసయైన యయ్యంగనకుం బుంసవనాది కృత్యంబులు
నిర్వర్తించినయనంతరంబున,నవమాసావసానంబగుటయు శుభముహూ
ర్తంబునఁ గుమారుండుదయించిన 87

మ. కురిసెం బువ్వులవాన చూపఱులచూడ్కుల్ వేడ్కనోలాడఁగా
నెరసె న్మ్రోల్లనిచల్లగాలికొదమల్ నెత్తావి నిండారఁగాఁ
బొరసెన్ దిక్కులునొక్కవింతచెలువంబున్ దత్కుమారప్రతా
పరుచింబోలమినాఁ బ్రశాంతగతి సంప్రాప్తించె వైశ్వానరున్ 88

ఉ. అప్పుడు బంధుమిత్రసచివాన్వితుఁడై మహనీయవైభవం
బుప్పతిలన్ ధరామరసముత్కరముం బిలిపించి యిచ్చోఁబో
తెప్పలుగాఁ గరుల్ హరులు ధేనువు లంబరముల్ మణివ్రజం
బప్పతి, యప్పతిం దెగడునట్టిసమున్నతదానవైఖరిన్ 89

మ. నరనాథోత్తముఁడీగతిన్ వివిధదానప్రౌఢిఁ బుత్రోత్సవ
స్ఫురణంబొప్ప ఘటించి, సూతకదినంబుల్వుచ్చి, దాక్షాయణీ
వరకారుణ్యవిశేషబంధుఁడగుటల్ వర్ణింపుచున్ రాజశే
ఖరనామం బొనరించెఁ బుత్రకునకుం, గౌతూహలాయత్తుఁడై 90

శా. వైరించప్రతిభావదావదవచోవైయాత్యసాతత్య!స
త్యారూఢస్థితిపాండవాగ్రజ!మహీ యుఃస్వచ్ఛకీర్తిచ్ఛటా
పారావారనిమగ్నశత్రుగణ!శుంభత్పూర్వభూభృద్ధి శా
నారీమన్మథ!బంధురఘృణచణా!నాదిండ్లవంశాగ్రణీ! 91

క. చతురతరవచనరచనా
చతురానన! త్రిచతురాశ్వసప్తిజవా! నీ
చతురంగఖురరజోవిక
చతురాపాణ్ణయనకమల! సముదగ్రబలా! 92

మాలిని

హరిచరణపయోజధ్యానసంధానమార్గా!
స్థిరమతిగుణధారా! శిక్షితాఘప్రచారా
సురసురభివితీర్ణస్తోత్రపాత్రప్రకారా!
గిరిచరగరిపిరా! కృష్ణమాంబాకుమారా! 93

గద్య

ఇది శ్రీమదఘోరశివాచార్యగురుకరుణావిశేషలబ్ధసారస్వత,
మాదయామాత్యపుత్ర, మల్లయనామధేయప్రణీతంబైన రాజశేఖర
చరిత్రంబను మహాప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

రాజశేఖర చరిత్రము

ద్వితీయాశ్వాసము

క. శ్రీరమణీరమణీయవి
హారాయతనూత్నలోచనాంభోజయుగా!
దోరమితకీర్తినిరసిత
తారకభృత్కాశ! యప్పదండాధీశా! 1

వ. అవధరింపుమత్తెఱంగున నావర్తితనామకరణాదిసంస్కారుండై ప్రతి
దినప్రవర్ధమానుండగుచు నక్కుమారుండు 2

ఉ. నిద్ధపురత్నభిత్తి దనసీడ గనుంగొని తోడనాడున
మ్మ్మద్దులబాలుఁడంచుఁ గరముల్ పలుమాఱును జాఁచి చీరుచున్
16విద్దెముచేయుచుం దిరుగు, విందులు విందులు విందులంచు నే
ర్పొద్దు నృపాలుఁడున్ సతియుఁ బొంగుచు నక్కున గారవింపఁగన్ 3

శా. కేళీకాంచనసౌధవీథికలచక్కిం దొట్లలోఁ బెట్టి యో
ప్రాలేయాచలకన్యకాధవకృపాపారంగతా! నిద్రపో
వే! లావణ్యపయోనిధీ! యనుచు నావిర్భూతమోదంబునన్
జోలల్ పాడుదురక్కుమారకునకున్ శుద్ధాంతకాంతామణుల్. 4

క. అల్లారుబెల్లమై గలు
గల్లున నందియలు మొరయఁగా వేడుకపె
న్వెల్లి మునిఁగించె ధరణీ
వల్లభనందనుఁడు, చూచువారలచూడ్కుల్ 5

గీ. కలుకుఁజూపుల మూడవకన్ననంగ
రత్నములు గీలుకొల్పిన రావిరేక

---

16. బాలక్రీడావిశేషము;

ఫాలభాగంబునను గ్రాల బాలుఁడపుడు
శంబరారాతియభియాతిచందమయ్యె; 6

మ. వనితానేత్రచకోరచంద్రిక, తనుస్వచ్ఛందకాంతిచ్ఛటా
ఖని, యుత్సాహకళాఖరూరి, మతిరేఖామాత్రసంసిద్ధి, భో
గనివాసంబు, లతాంతసాయకభుజాగర్వావలంబంబు, యా
వన మమ్మానవనాథపుత్రునకు మవ్వంబొప్ప నేతెంచినన్ 7

సీ. ధర నొక్కమేఁ దాల్పఁ దరముకాదనిభోగి
వరుఁడు దాల్చినతనుద్వయమనంగ
హృదయగేహముఁ బాసి యీశుఁడేగకయుండ
నలవరించినబోరుఁదలుపనంగ
సముదీర్ణ లావణ్యజలధిలోఁ జూపట్టు
లాలితశ్రీ వాలలత యనంగ
నిందిర విహరింప నెడముగా నజుఁడు గా
వించిన క్రొందమ్మిపిరులనంగ

గీ. నిడుదబాహుయుగంబును, వెడదయురమున్,
గొమరుమీసలు, దీర్ఘనేత్రములు మెఱయ,
మానినీజనమానసమానహరణ
చతురతరమూర్తి, యారాజసుతుఁడు మెఱసె. 8

ఉ. ఏయు నిశాతబాణముల హేళిఁ బదింబది సూక్ష్మలక్ష్యముల్;
త్రోయు నుతప్రభూతమునఁ దుంగధరాధరశృంగసంఘముల్;
ప్రేయు భుజాకృపాణి నవలీల నయోమయపిండఖండముల్;
ప్రాయము పెక్కువన్, ధరణిపాలతనూజుఁడు సత్త్వయుక్తుఁడై. 9

గీ. ఇత్తె అంగున యౌవనాయత్తుఁడగుచుఁ
దండ్రియానతి నొక్కింతతప్పవెఱచి
యౌవరాజ్యాభిషిక్తుఁడై యతిశయిల్లె
నఖలవిద్యానిరూఢిఁ బెంపంది యతఁడు 10

ఉ. రామునికంచె, నప్పరశురామునికంచె, ధనుర్విశేషవి
ద్యామహనీయుఁడై మెఱసి, యాతఁడు చేతులతీఁటవో సము
ద్దామవిరోధిబాహుజవితానము నుక్కడఁగించి, వీరల
ష్మీమదిరాక్షికిన్ వలపుగీల్కొలిపెన్ విషమాస్త్రకేళికిన్. 11

సీ. కలహభోజనమునిగ్రామణి యాకంట
నానాఁట నిటమీఁద నవయకున్నె?
దళితారిరక్తాపగలు నిండిపాఱుమి
వారిధు లిటమీఁద వడియకున్నె?
నిజమండలోచ్ఛేదనిశ్వేదములు మాని
సతినాపుఁడిటమీఁద జెలఁగకున్నె?
రంభానిరంతరరతికేళిఁ బౌలస్త్య
నందనుండిటమీఁద బొందకున్నె?

గీ. యనఘదర్పితపరిపంథిమనుజపతుల
బీరములు మాన్పి తనపాదపీఠిఁ జేరి
కప్పములువెట్టి కొలువ నిష్కంటకముగ
ధాత్రిపాలించె భువనైకజైత్రుఁడగుచు. 12

వ. ఇవ్విధంబునఁ బ్రజాపాలనంబు చేయుచుండునంత నొక్కనాఁడు హేమ
ధన్వమహీపాలుండు పేరోలగంబుండుసమయంబున. 13

చ. కనుఁగవ నిప్పుకల్ చెదరఁగా నదరుల్ వెదజల్లుకెంజడల్
పెనఁగొన నతుహారములు బిట్టుగ నిట్టటులూఁగ నెంతయుఁ
గినుక వహించి యొక్కమునికేసరి గొబ్బునఁ జేరవచ్చె న
జ్జనపతియుఁ సభాసదులు సాధ్వసమంది వడంకునట్లుగఁ. 14

గీ. అమ్మహామౌనివచ్చినయాగ్రహంబు
డెందమవియింప గద్దియడిగ్గి మ్రొక్కి
వినయవినమితుఁడై యున్న విభునిజూచి
లెక్కసేయక పలికె నమ్మక్కయనఁగ. 15

క. "కాచము రత్నము సరిగాఁ
జూచుమహామహులతపము చూఱలఁ బో నీ
వేచింతయు మదిఁబెట్టవు
రాచటికంబింతచెఱుతురా! నరనాథా! 16

ఉ. ముంపిరి రాజ్యగర్వమున ముందరగానవుగాక, ధాత్రిఁ బా
లింపరొ! తొంటిరాజులు దిలీపముఖుల్, మునికోటికూఁత లా
లింపరొ! నొంపరో! మదవిలీఢకఠోరనిశాటఝూటముల్
నింపరొ! దిక్కటాహముల నిర్మలకీర్తిసుధాంశుచంద్రికల్. 17

క. ఘాతుకదై తేయకశా
ఘాతములఁ! మౌనివరులకాయములఁ! యీ
పాతకము కలిగె ధాత్రికి
నీతరమున; నిట్లుచెల్లునే? మము వదల 18

ఉ. పుండ్రకనామధేయమున భూరిభుజాబలశాలియైన మీ
తండ్రి, కవింజరప్రభృతితాపసముఖ్యులయజ్ఞవేళ పె
క్కండ్రనిశాటులం దటిమి, కౌశికదైత్యుని నుక్కడంచె, నా
తీండ్ర యొకించుకేనివలదే! కలదే! మటి దిక్కుధాత్రికిన్? 19

సీ. పరమండలోద్భేదపదములాలోకించి,
మంత్రరక్షణకళామహిమఁ దాల్చి
ద్వీపాంతరంబుల తెఱఁగు లాకర్ణించి.
గడినున్నమన్నీల క్రమమెఱింగి
దుర్గాధిపతులసుద్దులు విచారముచేసి,
బలముల నప్పటప్పటికిఁ జూచి
నిజరాజధానిలోనివిశేషముల్గని,
మంత్రిసామంతుల మతములరసి

గీ. పేదసాదలవిన్నపంబాదరించి
వ్రతులమైనట్టిమముబోటివారి నరసి

రాజ్యమేలినఁదగుఁగాక, ప్రాజ్యవైభ
వంబు గలదనిసుఖియించువాఁడు, నృపుఁడె! 20

సీ. నెమ్మేనితిమిరంబు, నేత్రగోళంబుల
17పర, కర్ణపుటముల ప్రత్తి, నోరి
వాకట్టుమందు, గర్వలతాలవాలంబు,
వినయకృత్యంబుల వేరువిత్తు,
కరుఁకారసంబు తెక్కలికాఁడు, మదిచొక్కు,
పాతకంబులపాలిపట్టుగొమ్మ,
మొగమోటకుడుగనిపగ, రాజసంబుల
యిక్కువ, గురుసేవకెదురుచుక్క,

గీ. పరుషవర్తనకునికి, లోభంబుఁజెంకి,
బాంధవస్నేహసిందూరపాలకంబు
కలశపాథోధిపుత్రికేఁగంటిచూడ్కి
గాని, రాజులనేరమికాదుసువ్వె!" 21

క. అన విని,శివశివయని య
జ్ఞనపతి వెఱఁగంది, యపుడు సవినయముగ న
మ్మునివరువిహితాసనమున
నునిచి,భయంబొదవఁగా మృదూక్తులఁ బలికెన్ 22

క. "వెఱపొకయింతయులేకీ
తెఱఁగున మిమునెవ్వఁడింత తెగిచేసెనొకో
యెటిఁగెటిఁగియుండి యకటా!
కొఱవిం దలఁగోఁకుకొనుటకుం దలపెట్టెన్. 23

గీ. వికటదైత్యులు, నాపేరువిన్నయంత
జలదరించుచు, వలయాద్రిచఱులఁగాని

---

17 పొర;

యెందుఁ దలచూప వెఱతు, రిం కేమి చెప్ప
నింత కాలంబునకు నొకవింతగంటి. 24

క. కినుక మెయినిపుడు, మిమ్మిం
గనుగానకలంచినట్టి గర్వాంధునిఁ దు
త్తునియలు గావించెద నే
ననఘా! వినిపింపు" మనిన, నతఁడిట్లనియెన్. 25

ఉ. "ఏమనిచెప్పువాఁడ ధరణీశ్వర! యేవరతంతుసంయమి
గ్రామణిశిష్యుఁడన్, జటిలకౌశికుఁడన్, బహువేదశాస్త్రవి
ద్యామహనీయుఁడన్, బదరికాశ్రమవాసుఁడఁ, బుత్రికామణిక
గోమలపాణి భానుమతిఁ గోల్పడి వచ్చినవాఁడ నక్కటా! 26

ఉ. నీకరుణావిశేషమున నెమ్మది నేమికొఅంతలేక, య
స్తోకతపోవిధానములు చూఅలుపట్టి, సమస్తతాపసా
నీకము నేఁటిదాఁక నతినిశ్చలతఁ వసియించె, నిప్పుడ
స్వీకృతనిత్యకర్మమయి చిక్కెఁ, విశంకటదైన్యబాధలన్. 27

సీ. వినవయ్యధరణీశ! విరివిఁ దై కవ్వంపుఁ
గొండచేరువ, నొక్కకోనగలదు
బెడఁగైనయకోకననడుచక్కి, మిక్కిలి
భీకరంబగువొక్కబిలము గలదు
తలఁకింతయునులేక తద్బిలద్వారంబు
సరణిఁబో, నొకర కసరసిగలదు
ఘోరతరంబైన యారక్తసరసి వెం
బడిఁబోవ, నటనొక్కబయలుగలదు.

గీ. పరభయంకర మందొక్క పురము గలదు
తత్పురంబుననుండి సంతతమువచ్చి
యాత్మతరుణికుడిగము చేయంగవలసి
పొంచి సవరని పాపలఁ గొంచుపోవు 28

శా. కాళీదత్తకఠోరలోహమయ [18]కంఖాణంబుపై నెక్కి, దం
భోళిక్రూరకరాసిఁ ద్రిప్పుచు, గళోద్భూతచ్ఛటాకారముల్
గ్రాలఁ గోత్రధరాధరేంద్రములు ద్రిల్లఁ, లీలమై వేడెముల్
దోలుఁ ధేయని, యతుకిన్నరపురస్తోమంబు లూటాడఁగఁ. 29

సీ. ఒకవేళ సింహమై యుఱుకుచు బెదరించు,
నొకవేళహరిణమై యొద్ద నిలుచు
నొకవేళ భూజముల్ పెకలించు ఘోణియై,
యొకవేళ శలభమై యుద్భవిల్లు
నొకవేళ మౌనియై యొయ్యనొయ్యనవచ్చు,
నొకవేళ నగ్నియై యుఱుకవెలుఁగు
నొకవేళ మేఘమై యుఱుముచు నేతెంచు,
నొకవేళ శైలమై యుండు నడుమ

గీ. నద్దురాత్ముని మాయలేమనఁగఁ గలదు?
జపతపోనిష్ఠలేమియు జరగనీక
బదరికాశ్రమసీమతాపసుల నెల్ల
వలఁచియేచుచు, నొక్కనాఁడదను వేచి. 30

క. నాచిన్నిముద్దుకూఁతురు
నా చక్కనితల్లి, విధి నడయాడఁగ న
న్నీచు కొనిపోయె, సాళ్వము
రాచిలుకం గొంచుపోవుక్రమమునఁ దండ్రీ! 31

క. [19]ఆసవ యొయ్యన నెటిఁగి, మ
హాసురవెనువెంటఁబోవఁ నదలించి గత
క్లాసుఁడయి చేతికశ గొని
క్లేసెన్నను నిట్లు రోషవివశుండగుచున్ 32

---

18 గుఱ్ఱము; 19 జాడ;

క. ఏడవయేటిది, యెవ్వరు
వేడుకఁగదలించిరేని వెక్కుచు నేడ్చ
జూడ భయంకరయగు తన
చేడియకుడిగంబు లెట్లు చేయు నృపాలా! 33

క. అత్తదయామతిఁ దనకడ
నత్తమిలక నిద్రవోవ దహరహమందుఁ
బొత్తునఁ గుడవక తాఁగడి
యెత్తదు, తజ్జనని, యింతకేమయ్యెనొకో! 34

సీ, కడుపార దొండపండిడి ముద్దుగఱపిన
రాచిల్కకొదమలఁ జూచిచూచి,
పాదులలో నిండఁ బాల్పోసి పెంచిన
చూతపోతంబులఁ జూచిచూచి
తోడికన్నెలుఁ దానుఁ గూడియాడి చరించు
సురపొన్ననీడలఁ జూచిచూచి
బృందావనంబులు పెంచి తిన్నెలమీఁద
సూటిఁబెట్టినభ్రుగ్గు చూచిచూచి

గీ. సంతసంబున దేవపూజలు ఘటించి
పారికాంక్షుల సేవకై పరమనియతి
లీల నడయాడుచున్న బాలికలఁ జూచి
హృదయవీధిక నెట్లు భరించువాఁడ 35

ఉ. ఇంకిట మాటలేమిటికి నింతకు నాతనయాలలామ, యే
ణాంకనిభాస్య, యెందుఁబడి యాఅడిఁబొందెనో! యెంతగుందెనో
శంకరసత్కృపారసవశంబునఁ గాంచినయట్టియీనిరా
తంకునిఁ బంపి, నామనసుతల్లడ మార్పఁగదే నృపాగ్రణీ!" 36

వ. అని యిట్లుపలుకుచున్నమునిపలుకులకులికి నృపాలుండాత్మగతంబున 37

ఉ. కానకకన్నవీని నెటుగాఁ గుటిలాసురకోటిమీఁదికిఁ
గాననసీమకంపు, దటుగాక దురంతవిషాదవేదనా
ధీనత యీమహాత్మునకుఁ దీర్పక యేగతి నుండఁగాఁదగుఁ? 38
దీనికి నెద్ది కార్యమని, నివ్వెఱఁగంద నతండు క్రమ్మఱన్.

ఉ. మత్తవిరోధివీరగుణమర్దనశాలి, కపర్దిసత్కృపా
దత్తఁ, డనూనధైర్యనిధి తావకపుత్రుఁడితండు, నేఁడు చే
నెత్తురుగాకయుండ నతినిష్ఠురశాతకృపాణధారచేఁ
దుత్తుమురాడి వచ్చు నలదుర్మదు,నొండు దలంపకుండుమీ! 39

క, కావున నీరాజన్యుని
నావెనుకం బనుపు మనుఁడు, నరపతి ధరణీ
దేవునియప్పని వేగమ
కావింపఁగవలసి సుతునిఁ గనుఁగొని పలికెన్ 40

మ. "బలియుర్ మాయల ఘోరరాక్షసవరుల్; బాలుండవీవెన్నఁడున్
గలనఁ దైత్యులతోడఁ బోర;వగజాకాంతుండు నీ పాలికిం
గలఁ;డచ్చండవిశంకటాసురుని వే ఖండించి మాదీవనన్
దలపూవాడక పోయి రమ్మిపుడు పుత్రా!వీరవంశాగ్రణీ!" 41

చ. అనిన మహాప్రసాదమని యాత్మఁజెలంగి, కుమారవర్యుఁడ
జ్జనపతి పంపునఁ సకలసైన్యసమేతముగా హుటాహుటిఁ
మునిపతి చూపుచొప్పున సముద్ధతిమైఁ జని, కాంచె, ధాటికా
ఘనతరధూళిసంజనితకందరజాలము మంధశైలమున్. 42

క. కనుఁగొని యజ్జననాథుఁడు
"మునినాయక! చూడు దూరమునఁ గనుపట్టెఁ
వినువీధి బిట్టురాయుచు
ననఘా! యిది యేనగేంద్ర" మనసతఁడనియెన్. 43

ఉ. "అల్లదె కంటివే నృపకులాగ్రణి! మంథమహీధరంబు రా
గిల్లెఁ బ్రఫుల్లకింశుకవికీర్ణరుచిచ్ఛవి పిక్కటిల్ల, నీ

యుల్ల సితప్రతాపదహనోగ్రశిఖావళి. తాను, మున్న. య
బ్బల్లి దుఁడైన రక్కసునిపై నెలగోలున[20] వచ్చెనో యనన్, 44

ఉ. విందునుబోలె నోవిమతవీరభయంకర! రాజలోకసం
క్రందన! నీవు రా, నెదురురాఁ జనుదెంచె నిలింపకామినీ
బృందలతాంతకాంతకబరీభరసౌరభసారసన్నిళ
న్మందరకందరాసవిధమంథరబంధురగంధవాహముల్. 45

క. ఇందుమణిమందిరాంగణ
మందారమరందమత్తమధుకరనినదా
నందమునఁ బొంది, నగరా
ణ్ణందనయుం దానుఁ, బ్రమథనాథుఁడు మెలఁగున్. 46

సీ. వామదేవునిమౌళి వాడనిక్రొవ్విరిఁ
బూజగావించినపుణ్యుఁడితఁడు
సకలామరశ్రేణి సంప్రీతిఁ బొందంగ
దానమిచ్చినమహోధర్మ యితఁడు
తులసిఁ గల్పించి మర్త్యులఁ భావనంబుగఁ
జేసినయుపకారజీవియితఁడు
(దేవర్షులకుఁ గామధేనువుఁ గలిగించి
తలఁపులీడేర్చిన ధన్యుఁడితఁడు)

గీ. పాఁపతరిద్రాటఁద్రచ్చు నిర్బంధమునకు
నోర్చి, త్రిప్పట నొందినయుత్తముండు
ఇతఁడు సర్వప్రదానైక హేతువనుట
గలశవార్థికిఁ గల్పనాగౌరవంబు 47

చ. అని కొనియాడి, యామని, విహారమనోహరమైన యీనగేం
ద్రునికడ నేఁడునిల్త,మతిదూరముగాఁ జనుదెంచి సేన డ

---

20 ముందునడచుట;

స్సినయది; దై త్యుఁ జెంకియును జేరువ యిచ్చటి, కర్కమండలం
బును దనుజప్రతాపగతిఁ బొల్పరి, వారిధిఁ గ్రుంకఁబాఁ బెడున్" 48

వ. అనిపలుకునమ్మునిపలుకులు విని యప్పుడమిఱేఁడు పడవాళ్ళం బిలిచి
సేనల విడియ నియోగించె నప్పుడు. 49

సీ. గగనపథోల్లేఖగంధసింధురఘటాఘంటాఘణాత్కారకఠినరవము
తపనాశ్వసుఖకరధ్వజపటపల్లవస్థగితరథావక్రచక్రరవము
పవనపాణింధమప్రథితవేగవ్యగ్రసైంధవహేషాప్రచండరవము
కటితటాస్ఫాలనోద్భటవీరభటఖేటకవ్రాతసంభూతగాఢరవము

గీ. నెఱసి కకుబంతసీమలు నిండనపుడు
చెదరిపాఁ బెడుమృగములు,నదరి చదల
కుఱుకుసింగంపుఁగొదములు, వెఱచిపఱచు
పక్షిజాతంబునై ,దైత్యభయదమయ్యె. 50

చ. బెరసిన, యమ్మహారవము వెల్లున కుల్లము దల్లడిల్లఁ ద
త్పరిసరవర్తులైన వనపాలకదానవు,లావిశంకటా
సురపతియున్నతద్బిలము సొచ్చి,రయంబునఁ జేరఁబోయి, "యో
గురుభుజశాలి! యోదనుజకుంజర! నేఁడొకక్రొత్తవింటివే 51

ఉ. చివ్వకు నిన్ను మార్కొనఁగ జిష్ణునకైనఁ దరంబుగాదు,వాఁ
డెవ్వఁడొకాని మమ్మునొకయించుకయేనిగణింప, కెంతయుం
గ్రొవ్వునఁ గన్నుగానక, యకుంఠితదోర్బల ముల్ల సిల్లఁగాఁ
గవ్వపుఁగొండదండ,మనకారడవిన్ విడియించె సేనలన్:" 52

వ. అనినవిని యద్దనుజుండు, రౌద్రోద్రేకఘూర్ణమానమానసుండును, వికట
ఘటితభ్రుకుటినటనభయదఫాలభాగుండును, నమద్రరాగచ్ఛురితదుర్నిరీ
క్ష్యుండును,నగుచునిట్లనియె. 53

శా. ఓరోరీ!కలగంటివో. భ్రమసితో, యుగ్రాహవాటోపదు
ర్వారప్రక్రమమామకీనభుజగర్వంబెన్నరో కాక,నా

పేరెవ్వారు నెఱుంగరో, యకట! నిర్భీతిన్ నరుండెవ్వఁడే
జేరన్వచ్చునె నన్ను, బెబ్బులిపయిన్ జీంబోతు లంఘించునే? 54

ఉ. మంచిది, యందుకేమి? యని మంత్రులమోములు చూచి నవ్వి న
క్తంచరభర్త? "యెల్లి మనదానవకోటికి భుక్తిగాఁగ మ
ట్టించెద వానిసేనలఁ గడిందిమగంటిమిఁ గాళికావరో
దంచితలోహసైంధవఖురాగ్రములఁ లయకాలుకైవడిన్" 55

వ. అనిన విని సచివనికరంబిట్లనియె. 56

సీ. "కాకోదరస్వామి కంఠనాళంబులు
పుడుకుదుమే! యొక్కపూఁటలోన
సుత్రాముఁబట్టి యీడ్చుకవచ్చియిటవ్రేలఁ
గట్టింతుమే! యొక్కగడియలోనఁ
గులమహీధ్రముల నుగ్గులుగాఁగఁ బిడికిళ్ళఁ
బొడుతుమే! యొక్కింత తడవులోనఁ
గూర్మాధిపునివెన్ను గులగులల్గా బిట్టు
మట్టుదుమే! మాటమాత్రలోన

గీ. ముజ్జగంబులు నొక్కట మొనసెనేని
మీటి నీదాఁక రానిత్తుమే నిశాచ
రేంద్ర! నీసత్వమొగిని నీవెఱుఁగవెందు
నిన్ను మార్కొని మర్త్యులే నిలుచువారు?" 57

క. అటుపలుకుమంత్రుల విశం
కటదనుజాధముఁడు చూచి, "ఘనులార! మహో
ద్భటపరభటకోట్లన్ క్రమిం
గుటయుం. ద్రుంచుటయు, నేఁడు క్రొత్తలె మీకున్? 58

సీ. కాల్వుర లెక్కకగ్గలముగాఁ గొనియేగి,
దిగ్వాస్యుఁ డెలగోలు దివియువాఁడు

చటుల ప్రభంజనజవతురంగంబులఁ,
బ్రేతజిపభ్వండేర్పరించువాఁడు
కదిసి దిట్టంబుగా గంధసింధురఘటల్,
భీముకేతుఁడు నడపించువాఁడు
బిరుదధ్వజాంకితభీకరరథపంక్తి,
ఘోరచంష్ట్రిఁడు పురికొల్పువాఁడు

గీ. కపిలధూమ్రాతఘర్మర కామరూప
కుటిలబాహులు ముందరఁ గొలుచువారు
గాఁగ మిన్నును నేలయుఁ గ్రక్కతిఁగ
గాటమై యెల్లి వానిపైఁ గదలవలయు 59

క. అని నిశ్చయించి మంత్రుల
ననిచి వడిన్ లేచి, కటములదరఁగ, నూర్పుల్
పెనఁగొన, నిజసౌధమునకుఁ
జనియె నతండచట న స్తసమయం బగుటన్ 60

✓క. మెల్లన మెల్లన చీఁకటి
పిల్లలు చనుదెంచెఁ,గొలుత బెదరి దిశలకున్
జెల్లాచెదరయి పోయిన
భల్లూకచయంబు, వచ్చుపగిది.ఘటింపన్ 61

క, చరమగిరిసాంధ్యరాగ
స్ఫురితచ్ఛవిచూడఁ జూడఁ బొలుపేదె.నిశా
చరనాథరాజ్యలక్ష్మి
గురుకుచపరిలి ప్తమయిన కుంకుమభంగిన్ 62

మ. జ్వలనజ్వాలికలాత్మసన్నిహితశశ్వత్కాంతిసంరక్తకై
జలదుర్గస్థలి నిల్పి బల్విడిఁ దమస్సందోహముల్ వచ్చెనా
దళదాకీర్ణపరాగహల్లకలతాంత్రశ్రేణికాసీమలన్
బొలయున్ ఝుంకృతి సింహనాదనిచరత్పుష్పంధయవ్రాతముల్ 63

గీ. అమ్మహాదైత్య గెలుచుటకరుగుదెంచు
వీరుఁడెవ్వాఁడొ యని చూచువేడ్కఁ బెక్కు
గన్నులొక్కటఁ దాల్చెనో గగనలక్ష్మి
యనఁగ నల్గడఁ దారక లతిశయిల్లె 64

గీ. అపుడు సాయంతనార్హ్యకృత్యములు నెఱపి
యేకతంబున్న ధాత్రీతలేంద్రుకడకు
నమ్మహామౌని యేతెంచి "యవనినాథ!
దనుజమాయల కొకవేరెయనువు వినుము 65

క. మాయాభేదిని యన భూ
నాయక!యొకవిద్యగలదు నాయెడ,వివిధో
పాయవిధానవిధి న్నేఁ
జేయుదు నుపదేశ మిష్టసిద్ధి ఘటింపన్" 66

గీ. అని సలక్షణభంగి నమ్మునివరేణ్యుఁ
డమ్మహావిద్య నుపదేశమాచరింప
నియతిఁ గైకొని కౌతుకోన్నిద్రుఁడగుచు
నవనినాథుఁడు సుఖసుప్తుఁడయ్యె నంత 67.

సీ. తొలఁగు నీరీతి దైత్యులమాయలనిచూపు
విధమునఁ జీకటి విచ్చిపోయె
జరగు నీరీతి నిశాటఫాలాక్షురపంక్తి
నాఁ దారకాపటలి విరిసెఁ
దలఁకు నీగతి యాతుధానులప్రాణంబు
లనుజాడఁ బొలసె మందానిలంబు
దరికొను నిబ్భంగి దైత్యులహృదయంబు
లనుమాడ్కి నరోకపలాలి మండె

గీ. దనుజశుద్ధాంతకాంతావితానవక్త్ర
కాంతి యీపోల్కిఁ బొలియునాఁ గమలవైరి

ద్వితీయాశ్వాసము

తనకళాస్ఫూర్తి యంతకంతకుఁ దొలంగ
వరుణదిగ్వీధికడఁ చేరి వాడఁబాఱె; 68

గీ సవిధకీర్ణపరాగాగ్ని సాక్షిగాఁగఁ
దమ్మివిందు కరగ్రహణమ్మొనర్పఁ
బొలుచుపద్మినికిని నల్లపూసదండ
గట్టినాఁడన నెలదేఁటిగములు పొదలె; 69

శా. ఆరీతిం దపనోదయంబగుడుఁ గాల్యప్రక్రియల్దీర్చి మ
త్తారాతిద్విపయూథకేసరి యతండాప్తప్రధానావళిన్
వే రావించి బలంబులేర్పఱుప వేర్వేరన్ని యోగించి య
ప్వీరక్రూరనిశాటకోటి తెరలన్ ప్రేయించె నిస్సాణముల్. 70

ఉ. పెల్లగునమ్మహారవము పేర్చి సరోజభవాండభాండముల్
చిల్లులువోఁ ప్రచండగతిసేన ధరాస్థలియూనెనో యనన్
వెల్లిగొనంగ నేర్పఱిచి నిర్భయతన్నడపించె నంత ను
ద్వల్లయకాలకాలపదృశార్భటిఁ, బూర్వసుపర్వసైన్యముల్ 71

క. తొల! తొలఁగు! తొలఁగు: మనుచున్
నిలు!నిలు!నిలుమనుచుఁ గదిసి నిజసైనికులన్
బిలు; పిలువు; పిలువు; మనుచున్
బలువిడిఁ జనుదెంచె లోకభయదంబగుచున్. 72

మ. నలుదిక్కుల్గ బళించునయ్యుభయసైన్య వ్యగ్రగర్జార్భటుల్
గలయంబర్వఁ, బునఃపయోధిమథనోత్కంఠన్నిలింపాసురా
వలి బల్మిం బెకలింప వచ్చెననుచున్, వైశాఖశైలంబు బె
గ్గిలి కూపెట్టె ననంగఁ, జొప్పడు గుహాగేహప్రతిధ్వానముల్. 73

వ. అప్పుడయ్యిరువాఁగు నొండొరులం దలకడచి పెలుచం దలపడినయెడఁ
బొడమి దుమ్మ్రిక్కుమ్మిక్కొని సంజకెంజాయయనంజాలి మెఱయ,
ఘాతుకదై తేయునికాయకాయచ్ఛాయలు కొదమచీఁకటికోమలనం
బొలయఁ బరస్పరఘటితపరశుపట్టిసముసలపరిఘావిస్ఫులింగంబులు గగ

నాంగణంబునం గనుపట్టునుడుగణంబులనం గడలుకొన, భయంకర విశంకటదనుజ ప్రతాపతపనుండు గ్రుంకినఁ దోఁచుసాయంకాలంబు ననుకరించెఁ; బటుపటహభేరీఢక్కాఢమఢమధ్వానంబులవలన, మదకరటిపటలచటులఘీంకారంబులవలన, నఖర్వపవనజవసత్వనిర్వాపణధూర్వహమహిత మహోవాహవ్యూహదోహలహేషానినాదంబులవలన, వికటదితిజవదనకుహరముహుర్ముహురుదితబహుళకహకహారవంబులవలనం, గలనువిలయసమయసముదితసముజ్జృంభితంబగునంభోధినింబోలె;నంతకంతకుంబంతంబులు పలుకుదనుజులు మనుజులం జుట్టుముట్టి బలిమినలమియలిగి యలుగులతోడం గూడ్రమింగినఁ గ్రుంకక తత్తన్మత్తరఘోషంబు లముద్రకౌఘేయకముఖంబుల గ్రుచ్చి, పెచ్చినమచ్చరంబునఁబెచ్చుపెరిఁగి సమున్నిద్రులగుచు, నగుచు సమున్నతస్తంభంబులు వ్రక్కలించుకొని యుక్కున వెడలునృసింహమూర్తులంబోలి యేతెంచుదుర్వారవీరవర్గంబులును, దితిసుతులకాయంబు లతినిశితశరపరంపరలఁజొన్పి చించి చీకాకుచేసి డాసి పాశంబులం దునిమినఁ గనలి నయనంబులనవలంబు గ్రక్కుచు గ్రక్కున ముక్కుఁజెమరలదర నదరి వడింజనుదేరనేపున మూఁపులెక్కింపరానితెగువం దిగిచి చేకత్తులఁ గుత్తుకలు తటిగితరగని బిలంబుల నొఱఁగఁద్రోచి చెంగున నేనుంగులమీఁదికి లంఘించునకించిదంచితపరాక్రమాన్వితులగు మావంతులును నగుచుం, బోరుఘోరంబయ్యెనయ్యవసరంబున. 74

సీ. ఉప్పరంబెగసి వే కుప్పించిరథరథ్య
రథికులఁ దుమురుగా రాచి వైచు
నుగవడిఁ బఱతెంచి యిరుపక్కయలు దాఁకి
గంధసింధురకోటిఁ గనుపు కొట్టుఁ
జెవులు రిక్కించి చూచి మునిగాల్వడినెత్తి
కొట్టుఁ దేజులఁజాపకట్టువడఁగ
వెనుకొనిరా మద్దవిడిఁ జివుక్కునఁ
దన్ను దర్పితభటకోటితలలు డుల్లఁ

గీ. బ్రళయధారాధరస్ఫీతభయదనినద
కఠిన హేషలు దిక్కులఁ గ్రమ్మికొనఁగఁ
గలఁచి నృపసైన్యమెల్లఁ జీకాకుపడఁగ
జగతి కంపింప నాలోహసైంధవంబు. 75

స్రగ్ధర:

వ్రచ్చున్ మత్తేభరాజిన్ బ్రకుపితమదహార్యతుమై ఘోరభంగిన్
గ్రొచ్చున్ రథ్యవ్రజంబున్ ఘటఘటరభటిన్ ఘోణిదై పైపయిం; గా
ర్చిచ్చై యేతెంచి యేర్చున్ జిటజిటమనుచున్ సేనలం గానమాడిక్కన్;
వచ్చుం గార్కొంచు గాఢధ్వని మొగులయి తా వాన పెన్వెల్లినిండన్,

మ. అపుడమ్మానవనాథపుత్రుఁడు, తదీయవ్యగ్రరౌద్రాతిరే
కపరాభూతములైనసైన్యములఁ జక్కంజూచి, "యీవాజి యే
చి పటాపంచగఁ జేసి సైన్యముల గాసింబెట్టెడున్, దీనినా
దువిటుక్రూరశరాహతిం దుమురొనర్తున్ దానవుల్బెగ్గిలన్" 77

మ. అని యూహించి తదీయసైంధవముపై నాగ్నేయబాణంబు వై
చినఁ, దద్దేహము నీరుగాఁ గరఁచుటన్ జింతాకులస్వాంతుఁడై
దనుజుం డీతఁడ జేయుఁడంచు నిజదోర్దర్పంబు చాలించి, హె
చ్చినభీతిం బరువెత్తి తద్బలము చొచ్చెన్ దివ్యులుప్పొంగఁగన్ 78

ఉ. చొచ్చినఁ బోకుపోకుమనుచున్ నృపకేసరి తేరుడిగ్గి "నీ
వెచ్చటికేగినన్ విడుతునే! పటుబాణపరంపరాహతిన్
బచ్చడిచేయువాఁడ"నని ఘాలనటద్భ్రికుటీకరాళుఁడై
యిచ్చ నొకించుకేనిఁ జలియింపక తద్బలపీథిఁ దూఱఁగన్ 79

శా. ఆలోమాయ ఘటించి యాదితిసుతుండాభీలకాలానల
జ్వాలోదగ్రవిషంబు గ్రక్కుచు ఫణవ్యాకీర్ణరత్నప్రభల్
క్రాలం, గ్రూరభుజంగమై యరుగుదేరంజూచి, యమ్మాయ పే
ర్చిలంజేసె, మునీంద్రసూచితమహావిద్యాప్రభావంబునన్. 80

ఉ. సాహసికాగ్రగామి నృపసత్తముఁ డట్లు తదీయఘోరమా
యాహమికల్ హరింపుచు నిరంకుశవిక్రమకేళి చూప, ను
త్సాహము దక్కి యాత్మపురి చక్కటి కేగఁగ నొక్కకాళికా
గేహము చొచ్చి, యద్దనుజకీటము పాటిలుభీతిపెంపునన్. 81

ఉ. "కావుము కావు మోగిరిశకామిని! యోజగదేకమాత! నీ
లావున నింతకాలము హళాహళి ప్రేయుదు వైరికోటి, నేఁ
డీవనసీమచొచ్చినను నించుకయేని గణింపకెవ్వఁడో
చేవ నెదిర్చి తుత్తుమురుచేసె, మదీయనిశాటసైన్యమున్ 82

ఉ, అంతటఁ బోక తావకవరాగతలోహతురంగమంబు నిం
తింతలుచేసివైచి తనయేడ్తెఱ చూపిన, నిల్వలేక వి
భ్రాంతి వహించి నీచరణపద్మముచేరితి, వాఁడె వచ్చెఁ గా
లాంతకుభంగి, నాకు నభయంబు దగం గృపచేయు శాంభవీ!" 83

క. అని వాఁడు మఱువు సొచ్చినఁ
గనికర మొదవంగ భద్రకాళీశ్వరి "యో
రినిశాట! యోడకోడకు"
మని యూఱడిలంగఁ బలుకు నత్తటిలోనన్. 84

ఉ. వాలినబాహుగర్వమున వాని పిఱుందన పోయి, యమ్మహీ
పాలకనందనుండు గుడిపజ్జకునై చని "యోరి! నిన్ను మ
ద్బాలభుజంగతీవ్రతరఖడ్గముచే బలియిత్తు నిమ్మహా
కాళి కురోజకుంభపరికల్పితరక్తకపాలపాళికిన్." 85

వ. అనుచు నవ్వీరకంఠీరవంబు చనుదెంచిన. 86

స్రగ్ధర. కొప్పుపైనొప్పెడుకొదమచంద్రునితోడఁ,
గస్తూరికాతిలకంబుతోడ
సీమంతవిరచితసిందూరరుచితోడఁ,
గ్రొత్తముత్తియపుఁజేర్చుకతోడఁ

దళతళమనుదంతతాటంకములతోడ,
రమణీయనాగహారములతోడ
గల్లుగల్లనురత్నకంకణంబులతోడఁ,
జిలుఁగైనచెంగావివలువతోడ

గీ. ముద్దుమోమున లేనవ్వు మొలకతోడఁ
జల్లచూపులఁ గరుణారసంబుతోడ
శాంతరూపంబు గైకొన్నశంభురాణి
యమ్మహోకాళి ప్రత్యక్షమయ్యె నపుడు 37.

గీ. అట్లు సాక్షాత్కరించినయఖిలజననిఁ
గాంచి విస్మయసమ్మదాక్రాంతుఁడగుచు
మనుజనాథుండు సాష్టాంగవినతిఁజేసి
లేచి కరములు మౌళిఁ గీలించి నిలిపి 38

దండకము

"జయజయ!జగదీశ్వరీ!సంతతానశ్వరీ విశ్వవైశ్వర్యసంకల్పనాకల్పవల్లీ!కృపా
పుల్లమల్లీమతల్లీ! కృతోల్లాసయోగీశహృచ్చంచరీకా! విపంచీనినాదాను
మోదా! పదారాధనోద్భూతకౌతూహలాయత్తజంభాసురారాతిశాతోదరీ
ముఖ్యలేఖాంగనామండలా! పుష్పవత్కుండలా! కుండలిగ్రామణీకంఠహార
ప్రియంభావుకా!భావుకశ్రేణికాభావుకాపాదనాయత్తచిత్తా!మనోదృగ్విధా
జ్ఞాతవృత్తా! భవానీ! భవానీతఖేదద్రుమూలచ్ఛటాచ్ఛేదినీ! నిత్యసమ్మోదినీ!
నిగమవినుతశంభుకళ్యాణవేళాబలాల్లబ్ధశోణాతుతభ్రాంతి కృత్ఫాలనేత్రా!
సదాసచ్చరిత్రా! భవారాతికిం భీతికల్పించుననాతియున్ నీవ కావే!
తమాలప్రభానీలవై, శోణమాణిక్యభాస్వత్కటీచేలవై, నేత్రవద్భాలవై,
యీశునిల్లాలవై యున్న యీగట్టురాచూలివి న్నీవ కావే,సుధాహారవిభ్రాణ
నోదారదర్వీకరావిర్భవద్రోహ!ముద్రాసమున్నిద్రశోభాకరా! కిన్కచేఁ దాఁకి
యుచ్చండదోర్దండపాండిత్యముల్ చూపి మొండొడ్డినన్ జండముండామరా
రాతుల్ వాతులన్నెత్తురుల్ గ్రక్కవే త్రొక్కి ఖండించి తన్మస్తముల్

హస్తపద్మంబులం బూనవే, వేనవే ల్దానవుల్తోడురాఁ బోరులం బోరుతత్సైరి
భాకారఘోరాసురుంబట్టి పెన్దిట్టవై మట్టి లోకప్రసిద్ధంబుగా వాని
మూర్ధంబు నీపాదపీఠంబుగానున్పవే, నొంపవే బల్విడిం గట్టి శంభు
న్నిశుంభుం గరాంభోజశూలంబునన్, గ్రోలవే రక్తబీజామరద్వేషి క్రొన్నెత్తు
రువ్వెత్తుగా, దుగ్గనింద్రుంచి దుర్గాభిధానంబునుం జెందవే, పొందవే
లోకముల్ శాకసంపత్తిమైఁ బ్రోచి శాకంభరీనామవిఖ్యాతి, నోయమ్మ!
యీ వేదముల్ వాదముల్సేయ నీవేదముల్గానకిచ్చోట నీపాదముల్గంటి,
నేమంటి, నావంటి పుణ్యుండు లేఁడెచ్చటన్. 89

శా. తల్లీ! శాంభవి! లోకపావని! సముద్యద్భక్తితో నెవ్వఁడేన్
హల్లేఖన్ భవదీయమంత్రకలనాహీనస్థితింగాంచు వా
నిల్లాలై విహరించుఁ బంకజపుటీహేలాగతుల్మాని సం
పల్లీలావతి, వానిభాగ్యము నిలింపస్వామికిన్ గల్గునే!" 90

మ. అని యమ్మానవనాథవర్యుఁడు తదీయాంఘ్రిద్వయిం గ్రమ్మఱన్
వినుతుల్ సేయ, భవాని సత్కృప మది న్నిండార "నోరాజనం
దన! నీచండభుజాపరాక్రమకళాధైర్యంబులేమెచ్చితిన్
గొనుమేనిచ్చెద నొక్కదివ్యమణి నీకున్ వేడ్క సంధిల్లఁగన్. 91

గీ. ఇమ్మహామణి తావకాభీప్సితముల
వలయువేళల సముకూర్చు వసుమతీశ!
యసురవర్ణిత మిది"యని యభవురాణి
యవనినాథునకొసఁగి యత్యాదరమున. 92

క. "జననాథ! నాకుఁగా ని
ద్దనుజుని మన్నింపు; మిపుడు తాపసపుత్రిన్
గొనివచ్చు నొక్కయోగిని"
యనిపల్క యదృశ్యమయ్యె నంతటిలోనన్. 93

సీ. అలికంబుపై రక్తతిలకంబు, తెలిగన్నుఁ
గవయందుఁగాటుక, కర్ణపాశ

ములఁ బటికంపుఁగుండలములు, గళమున
సంకుఁబూసలకంఠసరులు, గుబ్బ
చనుదోయి వన్నెకుచ్చులిగింత, దాపలి
కరమునందు విభూతికడుపాల,
పాణిపద్మంబున మాణిక్యమయవీణ,
పదయుగంబునఁ బైఁడిపాదుకలును

గీ. నుదరబంధంబు, లాతంబు, యోగపట్టె,
సింగినాదంబు, బెత్తంబు, చెన్ను మెఱయ
నుట్టిపడ్డట్టు యోగిని యోర్తు వచ్చి
లీల నారాజశేఖరుఁ బ్రోల నిలిచి; 94

ఉ. "రమ్మునృపాల! నీదగుపరాక్రమకేళికిఁ జాలమెచ్చి మా
యమ్మ భవాని సంయమికులాగ్రణి కూరిమిబిడ్డ నిచ్చిరా
పొమ్మన వచ్చితిన్, శిఖరిపుత్రికసేవకురాల, నాదుగే
హమ్మున నున్నయప్పడుచు నప్పనచేసెద" నంచుఁ బల్కినన్. 95

క. మనమునఁ బ్రియపడి, యయ్యో
గిని పిఱుఁదం బోయి, సరసకిసలయరేఖా
జనకరుచిపుంజమంజుల
కనకమయంబైన యొక యగారముఁ గనియెన్ 96

క. కని చేరఁబోయి యోగిని
పనుపున నొకరత్నవేదిపైనుండి ఫలా
వనిజాతజాతగిరిజా
ప్రణుతిపరోదగ్రపతగభాషలువినుచున్. 97

క. అచ్చట సేదలుదీఱి వి
యచ్చరవిభునకొసఁగె నపుడాతిథ్యముల
త్యుచ్చయకౌతుకమున నట
సచ్చేరువుగ వచ్చి నిలిచె నమ్మునిసుతయున్. 98

క. చక్కనియాబాలామణి
నక్కునఁ గీలొక్కలిపి "దీని నవనీశ్వర! పే
రుక్కున విశంకటుం డీ
చక్కటిఁ గొనిపోవఁ జూచి సదయహృదయనై. 99

గీ. ఓడకోడకుమనుచు నేఁగూడఁ బోయి
వాని నదలించి, యీమౌనివరునికూర్మి
తనయఁ దోడ్కొనివచ్చి మత్సదనసీమ
ననిచితిని, బాలఁగొనిపొమ్ము మునికినిమ్ము." 100

క. అని పలికి "రాజశేఖర!
మనుజేశ్వర! నేఁడు నాదుమందిరమునకున్
జనుదెంచితి గావున నే
ననఘం బగునీశుకంబు నర్పింతుఁదగన్. 101

శా. తూచాతప్పకయుండ నాగమకథాస్తోమంబులం జెప్పు, వా
చాచాతుర్యము గానరా గతభవిష్యద్వర్తమానార్థముల్
సూచించుఁ, సుదిమెచ్చ నీకుబుసుపుచ్చుఁ నెచ్చెలింబోలి, యీ
రాచిల్కం గయికొమ్ము పార్థివకుమారా!" యంచు వర్ణించుచుఁ. 102

క. శీతమయూఖకళాధర
శాతోదరి పంచినట్టి శాంభవి యొసఁగెన్
భూతలనాథకుమారుని
చేతికిఁ గరుణారసంబు చిలుకం, జిలుకన్. 103

సీ. ఇచ్చిన కీరంబు ఋషిపుత్రియునుదాను
వరయోగినీకాంత తెరువుచూప
బలమువెల్వడి మౌనితిలకంబుఁ గనుఁగొని
సాష్టాంగవినతుల నాచరింప
నాశీర్వచఃప్రౌఢి నతఁడు సంభావించి
యానందబాష్పంబు లావహిల్లఁ

దనయాలలామనక్కునఁ జేర్చి వాత్సల్య
వనధి నోలాడి "యోమనుజనాథ!

గీ. యాత్మపురమునకీసేన ననిచి బదరి
కాశ్రమంబున కేతెంచి యచటిమౌని
పతులఁ గనుగొని దీవనల్ పడసివత్తు
గాక" యనవుడు సంభృతోత్కంఠుఁడగుచు. 104

క. జనకునకును జయలేఖల
ననిచి, పురంబునకు సై నికావళిఁబోవన్
బనిచి, తపస్వియుఁ దానును
మనుజేంద్రుఁడు బదరికాశ్రమంబున కరిగెన్ 105

మ. అతఁడచ్చోటికిఁ బోయి కన్గొనియె భూజానేకశాఖాశిఖా
న్వితయౌ మౌనికరస్థముక్తితరుణీవేణీకలాపాకృతిన్
సతతావర్తితసప్తతంతుహుతభుక్సందోహనీరంధ్రని
ర్గతధూమోద్భటహృద్యగంధములు దిగ్భాగంబులం గ్రమ్మఁగన్. 106

సీ. హోమధేనువ్రాత మొయ్యనట్లు చాపఁ
గొనగోళ్ళుదువ్వెడుక్రోలుపులులఁ
జిగురుదర్భలు గిల్లి మృగపోతములకర్థి
నందంద యిచ్చుపంచాననముల
రాచిల్కబోదలఁ బ్రోచి ఱెక్కలనీడఁ
జల్లఁగాఁ బొదివెడుసాళువముల
బర్హాణనిలయంపుఁబన్నగార్భకముల
కుగ్గలువెట్టుమయూరములను

గీ. దొండములుమ్మించి కలఁగకయుండఁ దీర్ద
వారి దరినుండి క్రోలెడు వారణములఁ
జూచి యచ్చెరువంది యస్తోకమౌని
వరతపశ్శక్తి మెచ్చుచు వచ్చునపుడు. 107

గీ. మునులవెంబడి నవ్వార్తవిని చెలంగి
భానుమతితల్లి, యెదురుగాఁ బాఱుతెంచి
కన్నుఁగొనలను హర్షాంబుకణము లొలికి
జాలుకొనఁజేఁయఁ బాలిండ్లఁబాలు దొలఁక. 103

ఉ. ఎత్తి కవుంగిలించి యొకయించుక సేపతిగాఢకౌతుకా
యత్తతఁ దన్నుఁ దామఱచి, యంగలతన్ బులకాంకురాళి పె
ల్లొత్తఁగ, మాటిమాటికిఁ బయోధరపాళిక నప్పళింపుచున్
దత్తరుణీలలామ, నిజనందనమై నిమిరెం గరంబునన్ 109

గీ. అట్లు సమ్మదవిస్మయాయత్తయగుచు
మనుజనాథుని దీవించి, మగనిఁ జూచి
"యీశుభాకార, యీబాల, యీసుశీల,
మగుడ జన్మించి నట్లయ్యె మనకు నేఁడు." 110

వ. అనుచు నప్పరమసాధ్వీపలుకునప్పుడు మునిపత్నులు దమలోన. 111

సీ. కనకావనీధర కార్ముకవరలబ్ధుఁ
డను పెంపుగాంచినయతఁడితండు
మునితపష్షష్ఠాంశమునకుఁ బాత్రుఁడునాఁగ
నవనియంతయు నేలునతఁడితండు
అఖలకంటకుఁడైన యలవిశంకటదైత్యు
నదటు పోకార్చినయతఁడితండు
పులినోరికండయైపోయినమనభాను
మతిఁ గ్రమ్మఱించినయతఁడితండు

గీ. చూడరమ్మ! మనోహరశుభచరిత్రు
భువననయనచకోరికాపూర్ణచంద్రు
సజ్జనావనదాక్షిణ్యజన్మభూమి
యనుచుఁ బొగడుచు దీవింప నాదరమున 112

గీ. వచ్చి యచ్చటిమునులకు వందనంబు
లాచరించి, నృపాలకుండాతిథేయ
సత్కృతులు గాంచి, యారాత్రి జరిపి కాల్య
కృత్యములు దీర్చి, మఱునాఁడు ప్రియముదొలుఁక 103

ఉ. మందరగోత్రధీరుఁ, డసమానయశోనిధి, రాజలోకసం
క్రందనుఁ, డమ్మహామునినికాయము వీడ్కొని వచ్చి త్రోవ మ
ధ్యందినవేళ యైన నతిదాహముచే రథరథ్యపంక్తి దూ
లం చనసారథింగని "జలంధర! శార్ఙ్గకళాధురంధరా! 114

ఉ. వచ్చె ననేకదూరము జవంబునఁ దేజులు, చాలడస్సె, నీ
విచ్చటికాననాంతరమహీస్థలి యారసి నీరుచూపి లేఁ
బచ్చికమేపు, మిక్కనకపంజరకీరము నిప్డు మిక్కిలి
న్నొచ్చిన, దీపథశ్రమము నూత్నఫలావళిఁ దీర్పఁగాఁ దగున్. 115

గీ. మరునిబాహుప్రతాప విస్ఫురణఁ గెరలి
హరుని గెలిచెదనని పోవుకరణి విహర
మాణవిహగగరుజ్జాతమారుతముల
మింటికెగయుపరాగంబుఁ గంటె యెదుట. 116

ఉ. చూచితివే! యినప్రభలుసోఁకనిమంజునికుంజపుంజముల్
చూచితివే! ఫలావళులజొంపము లైనరసాలసాలముల్
చూచితివే! విధూతఫలశుద్ధవితర్దిక, లల్లపుష్పనా
రాచవిహారసౌధమనఁగాఁదగుకాననమింతయొప్పునే! 117

క. తరుణపవమానమదకే
సరిపోతము, విటపికుంజసామజకుంభాం
తరములు గ్రొవ్వినఁ, దొరఁగెడు
గురుమౌక్తికభాతి, రాలెఁ గ్రొవ్వీరులవిగో!" 118

వ. అని వర్ణింపుచు.

లయగ్రాహి

భూరిసహకారఫలసారములు గ్రొచ్చి కడుపారఁదిని యాముకొని
మారుని హయంబుల్
సారెఁ బథికులెచ్చరఁ గేరుచు దిశల్గ లయఁ బేరెములు వాఱుచు
నుదారగతినాడన్
సారసమరందరసపూరములు గ్రోలి, ప్రతివార మలివార
మనివారణ నటింపన్
భూరమణశేఖరకుమారుఁ డనురాగమునఁ దేరుడిగి, యవ్వనము
చేరఁజనిక్రకేవన్. 120

క. వలమానమత్తమధుకర
కలహంసక్రౌంచబకనికాయగరుత్మ
త్కులకలకలరవములఁ గొల
కొలమనియెడునొక్కనిండుకొలఁకుం గనియెన్. 121

గీ. కాంచి యవగాహనము చేసి, కనకపంజ
రాంతకీరంబుఁ దివిచి నీరార్చితెచ్చి
చాలడస్సితిగా పథశ్రాంతి ననుచు
నృపతికరమున నెమ్మేను నిమిరినిమిరి. 122

క. ఱెక్కలతడివో నార్చుచు
నక్కునఁ గీలొక్కలిపి ముద్దులాడుచు, మదిపెం
పెక్కినవేడుక నందలి
చక్కనిహిమవారి చల్లి చల్లనినీడన్ 123

క. విప్పుగలవిధుశిలాస్థలిఁ
జిప్పిలి మకరందరసము చిలికెడు పువ్వుం
జప్పరముక్రిందవై చిన
కప్పురపుండిన్నెపై, సుఖస్థితుఁడగుచున్. 124

క. భూదయితుఁడప్పుడశనా[21]
యాదశ, జగదేకమాత, యభవునియిల్లా

---

21 ఆకలి.

లాదిమయోగిని, యొసఁగిన
యాదివ్యమణిందలంచునంతటిలోనన్. 125

సీ. కలికిబేడిసకూటువలఁదోలుజిగిగల
కన్నుంగవలఁ గాటుకలు ధరించి
కొదమతుమ్మెదయొప్పునదలింపఁగలకప్పు
గులుకుపెన్నెఱికొప్పులలవరించి

జక్కవకవఁ గేరఁజాలినకుచకోర
కముల ముక్తాహారసమితిఁ దాల్చి
క్రొమ్మించుపస గ్రమ్మికొనఁ గెలంకులఁ జిమ్మి
పసనిరత్నపుసొమ్ము పరిఢవించి

గీ. యరుణకంజాతకర్ణి కాంతరము వెడలి
వచ్చుతుమ్మెదలేమలవడువు దోఁప
మానినీమణియుగ్మ మమ్మణి జనించి
నృపతి వెఱఁగంద ముందట నిలిచె మఱియు. 126

మ. కలమాన్నంబు, ఘృతంబుఁ, శాయసము, శాక!వ్రాతముల్, పిండివం
టలు, పా,ల్దేనియ, జున్ను, వెన్న, యిడి,యూనా,లుక్కిరల్,చక్కిరల్,
ఫలముల్, పానకముల్, రసాయనములం, బళ్లూ,రుఁబిండ్లూ.రుఁగా
యలు, బజ్జల్, దధిపిండఖండములు, నందావిర్భవించెందగన్. 127

క. అంతటఁ బసిండియటికల
దొంతులు గావించి "యోవధూమకరాంకా!
సంతతవితరణరేఖా
చింతామణి! యింతతడవు సేయుదె"యనుచున్. 128

క. హల్లకగంధులు మృదుకర
పల్లవముల వెలచి పసిఁడిపళ్ళెరముల ను
ద్యల్లీలఁ బెట్టిరి మహీ
వల్లభునకుఁ జిలుకరాచవారికి నచటన్. 129

ఉ. సంచితబాహుమూలరుచిసంపద పొంపిరివోఁ గెలంకులన్
గుంచె యొకర్తు వై వ,నొకకోమలపల్లవపాణి శీల వ
డ్డించె నృవాలమౌళికిఁ గటీతటహాటక మేఖలాసమ
భ్యంచితకింకిణీరవము నందియత్రోఁతలు సందడింపఁగన్ 130

గీ. తనదు మధురాధరముఁ బోలఁదలఁచు ననుచు
సరసకదళీఫలంబులచర్మమెత్తు
నోజ వాలారునఖముల నొలిచి యొలిచి
రాజకీరంబునకుఁ బెట్టె రాజవదన 131

గీ. రసరసొన్నము లీరితి రత్నపుత్రి
యర్పణముచేయ వేడుక నారగించి
రాజు, రాజీయరాజకీరమును దృష్టిఁ
బొంది వసియింప, నంత నద్భుతముతోఁప 132

గీ, సతులు భాండాదివస్తు సంతతులు మగుడఁ
దాల్ప లోఁగొని కాళికాదత్తదివ్య
రత్న మేపారె, నారాజరత్న మెదుట
విశ్వరూపంబుఁ జూపినవిష్ణుఁడనఁగ 133

క. అమ్మణి ప్రభావమునకున్
సమ్మదమును బొంది రాజచంద్రుఁడు మౌళిం
గ్రమ్మఱఁ దాల్చి విభాకర
సమ్మిళితప్రథమశైలసమత వహించెన్ 134

గీ. అపుడు కీరకులస్వామి ననుచరించి
"వితతఫలములచవులు చూచితివె? తనియు
సకలభాషావిశేషవిజ్ఞానచతుర!
యింతయొప్పిదమయ్యెనే యీదినంబు? 135

శా. కాళీదైవతదత్తరత్నమహిమల్ గంటే, వధూరూపరే
ఖాలాలిత్యము చెప్పఁగ్రొత్త,బహుశాకద్రవ్యసంభారధా

రాళస్వచ్ఛసుధారసోన్నతి యనిర్వాచ్యంబు, కస్తూరికా
కాలాగుర్వనులేపసౌరభము లాఘ్రాణింప నింతొప్పనే? 136

క. మతిఁ దలఁపఁ జోద్యమిది యో
పతగకులోత్తంస!" యనుచుఁ బలికినఁ బ్రీతిఁ
జతురాగమార్థసంగ్రహ
చతురుఁడు శుకలోకపాకశాసనుఁడనియెఁ 137

శా. "ఓరామామకరాంక! యోరిపుజయోద్యోగాతినిశ్శంక! నీ
యారూఢోన్నతి నీకుఁ గానఁబడదాహా! రాజమాత్రుండవే!
మారారాతివరప్రసాదగుణసంపన్నుండ; వట్లౌటచే
గారాబున్నతునట్లు ప్రోవఁదగవే! కాళీమహాదేవికిన్? 138

చ. అనఘచరిత్ర! యీమణి యవర్ష్య, మొకానొకనాఁడు పార్వతీ
వనరుహపత్రనేత్ర నెఱవాదితనంబున జూదమాడి గె
ల్చిన, మదిఁ గౌతుకంబొదవ శీతమయూఖకళావతంసుఁడ
వ్వనితకు నిచ్చె, నీకు నతివత్సలతన్ గృపసేసెఁ గాళియున్ 139

క. జననాథచంద్ర! యీమణి
యనిమిషలోకైకవంద్య మనఘము, మును నీ
వొనరించిన సుకృతఫలం
బునఁ గలిగెంగాక, కలదె! పురుహూతునకున్." 140

క. అని పలుకుచిలుకపలుకుల
కనురాగరసాబ్ధి వోలలాడుచుఁ గేళీ
వని నిట్లు ప్రొద్దుపుచ్చెన్
జనపతి యయ్యెడ వసంతసమయం బగుటన్. 141

ఉ. చిత్తజమూర్తి భవ్యగుణసింధువు సింధుఁడనంగనొప్పుభూ
భృత్తిలకంబుపుత్రిక శరీరకళావిభవాభిభూతవి
ద్యుత్తతియైనకాంతినుతి, యుత్సవనీయవనీవిహారసౌ
ఖ్యోత్తమతిన్ సభీజనసహస్రముగొల్వఁగ వచ్చి యచ్చటన్. 142

సీ. ఈవల్లి బెల్లియై యీవల్లి పూఁబోఁడి
కీవల్లి విరు లెలయించుఁదరుణి!
లేమావిచిగురాకులేమావి వేయింక
లేమా! విజృంభింపలేరు నీకుఁ
గురువిందమొలనూలు గురువిందలవె చూడు
గురువిందగతి నొప్పుఁ గోయవలయు
వట్టివేరునకుఁ గేల్వట్టవే రుచిరాంగి!
వట్టి వేరుగఁ జేయవలదు నన్ను

గీ॥ నన్ను నెవ్వతెకందుకో నలవిగాదు
గా దురాశలెకాని యక్కాంచనాలి
నాలితనములు మానవే నాతి! యేల
యేలవాడుదు చూడుమా!యేలలీల. 143

చ. కిసలయపాణిలేతనునుగెంజిరాకుమెఱుంగుమోవికిన్
గిసరుదొలంగిపోవలసి కేళివనాంతరలక్ష్మి బోటియై
మసిఁ జిటిబొట్టుపెట్టె ననుమాడ్కిఁ, దదాననవాససంపదన్
భసలకిశోరకంబు గనుపట్టెడు నల్ల దె!పల్లవాధరా! 144

గీ. అబల!చూడు!శివద్రోహి యనుచుఁగెరలి
యతనికంకణశేషాహి యావహించి
నాలుకలుగ్రోయుపగిది వనాలిచలిత
లాలితై లాలతాగ్రపల్లవములమరె; 145

చ. కలితకపోలకాంతికళికల్ దళుకొత్త నొకర్తు తీఁగెయు
య్యాల వడి నామువేళఁ, జరణాంబుజ నిర్మితలాక్ష సోఁకిత
త్తలమహిజాతపల్లవవితానము మించె, మదీయసామ్యమున్
దలఁపకుమంచుఁ, దత్పదముతన్నినసెత్తురు గ్రగ్గునోయనఁ 146

చ. తెఱవయొకర్తు తోడిసఖతేటకనుంగవచూపుడాలు గ్రి
క్కిఱిసినఁ గ్రొవ్విరిం దొలుత నించినవేడుకఁగోసి, తాన, క్ర

మ్మఱనొకసంచరద్భ్రమరమంజరి నల్లనఁజూచి కోయఁ, గే
ల్గఱచిన మిట్టిపడ్డఁ, జెలికత్తెలు నవ్విరి చిన్నవోవఁగన్. 147

ఉ. ప్రొడయొకర్తు పువ్వుఁబొదఁ జొచ్చి సుధారసముప్పతిల్ల మా
టాడినఁ, దోడనాడుశుకమంచుఁ దటుక్కునఁ జేతఁబట్టి ము
ద్దాడుచు నున్న, దల్ల దె! నిజాధరబింబమునే తదాస్యమున్
జూడుఁడు వానిఁ దేర్పుఁడని చూపుచు నుండు తెఱంగు దోఁపఁగన్ 148

ర గ డ

పట్టుపట్టుమని పడఁతుకచెంగున । నెట్టుదాఁటునే యిది పెలుచంగన
నలిపివైవకే నవకలికావలి । యలినీలాలక!యదిమాకావలి
పొదఁ బికమున్నదివోమున్నాడకు । నది బెదరించిన నటునన్నాడకు
పొగడఁ బ్రాఁతియే పోనేలే!వడి । నిగురుఁబోఁడికా నెంతయు లేవడి
చిలుకుఁదేనియలఁ జీరకునేలకు । నలవిగాదది దురాశల నేలకు
మలరుదండకై హారమునమ్మకు । కలికియీడు సూ!కల్లరి నమ్మకు
అందనివిరులకు నాఱడిఁబాఱకు । విందురమ్మనిన వీడంబాఱకు
పఱపగుమొగ్గలఁ బదములకూనకు । మెఱుపగుదండకె యీలతకూనకు
ఎలమొగ్గలకై యెక్కకుతీవల । చెలి!యున్నది విరిచేమంతీవల
నింతివల్లికై యింతటిమానిసి । యింతచేసెఁబో నిత్తఱి మానిసి
పువ్వులగొలగొని పొలఁతుక చివ్వకు । మెవ్వరేగిరే యిప్పుడుచివ్వకు
తప్పదు మొదలనె తగవనువారము । చెప్పిన నిదిగో!చెలి!పగవారము
బాలచేత నీఫలములురాలవు । కూలఁగఁ ద్రోచుట కొఱకైరాలవు
తలిరుబోఁడి!నీతలఁపునఁ గన్నెర । వలదు తేనెలకు వంచకు గన్నెర
సాదులేమతో జవ్వనివావిరి । వాదులేల?యీవనిఁ గఱవా?విరి
పొలయవేసితే పువ్వులవాటులు । నెలఁత!మెచ్చితవి నీకలవాటులు
గేలిచేసె నీగేదఁగిక్రొవ్విరి । బాల!చిరకాపడఁతులక్రొవ్విరి
యిగురుబంతికై యీనవలా కట । జగడమాడెనేసతిమేలాకట
తేటిదాఁటుజిగితేరెడువేనలి । యేటికి ముడిచెదవే యిట వేనలి

విరులుచాలునా! వేసరనేటికి, మరలి రారుగా మగువలునేటికి
నని తమతమలో నతివలు గెరలుచునుబలుకులచే నున్నతిఁగెరలుఁచు

క. చెలులార!చూడుఁడిదిగో!
జలకేళికి మనలఁ గూర్చి సరసులు పనుపఁ
చలిగాలి, కాముకాలరి.
కలితాంభోజాతపత్రికలుగొనివచ్చెన్. 150

క. రారండు!రండు!సలిలవి
హారమునకుఁ బోద''మని లతాంగులు మిహికా
సారమునెనసెడుమిహి, కా
సారముఁ జేరంగఁ జనిరి సారస్యమునఁ. 151

సీ. వనజవాసకుఁ దండ్రి పనిచినముత్యంపు
సరముచాడ్పున నంచచాలు మెఱయ
జలదేవతాపుత్రికలుదాల్ప నిచ్చిన
గిలుకలక్రియఁ జెందొవలు దనరఁగఁ
గాసారపతిభుజాంగదవ్రజదీప్తుల
సరణి నూర్మ్మల బేడిసలు నటింప
సమధికసౌరభ్యసంపదఁ గాపాడు
నారెకులనఁగ భృంగాళి దిరుగఁ

గీ. బత్రఫలపుష్పకిసలయభాగ్యరేఖ
నిండి పొంపిగివోవుచు నీడచూచు
పగిదిఁ దీరతరుశ్రేణి ప్రతిఫలింపఁ
బొలఁతుకలు చూచి తమలోనఁ బొగడిపొగడి. 152

క. ఎలదీవలపైఁ గలయం
బొలసిన చంద్రాతపంబుపోలిక జిలుఁగుఁ
వలువలుగట్టిరి,పట్టిరి
పొలఁతులు నెలవంకపసిఁడిబుట్టకొమ్మల్. 153

వ. అటులు జలకేళీసన్నాహంబునఁ గన్నియలు పోయి సరోవరావగాహంబు
గావించి. 154

ఉ చిల్లులచిల్కలంజిలికి చిల్కలకొల్కులు చల్లులాడ, సం
పల్లలితాంగిచూచి, కడుపై కొనువేడుక, వారిపూరముల్
చల్లఁ దదంగనాంగలతలన్ నినుపారననంగ, నప్పుడు
త్పుల్లపయోరుహాంతరమధూళిఁ జివుక్కునఁ జిమ్మెఁ దెమ్మెరల్. 155

క. లలనాసౌభాగ్యము గని
జలదేవత లళినినాదసన్నుతులెసఁగన్
దలలూఁచినగతిఁ, బంకజ
ములు యాతాయాతహతముల నటియించెన్. 156

గీ. పదువురొక్కటిపై యొక్కపడఁతిఁ దఱుమ
నిలువుటీఁతలఁబో, దానినీలవేణి
తోఁచె, హిమరోచి పెక్కుమూర్తులు ధరించి
రాఁ దలంకుచుఁ బాఱెడిరావళు వనఁగ. 157

క. పడఁతులకన్నులఁ గనుఁగొని
యడియాసలఁ బోవుఁదల్లులని శఫరంబుల్
నిడుదలో యటువలె నవి కడు
వెడఁదలో, జడమతుల కావివేకము గలదే! 158

క. ఎటిఁగింపకున్న సతులని
తెలియంగారాదు, నాచుఁదీఁగెలు జడలున్
జలరుహాములు మొగములు; నళి
కలభంబులుఁ జూపుచాలుఁ; గత్తరఁగలియన్. 159

మత్తకోకిల

ఓలవెట్టుచుఁ దోలిపెట్టుచు నొండొరుల్ గనుబ్రామి పూ
ఢూళిఁ గప్పుచుఁ, గేలుద్రిప్పుచు, దొడ్డక్రొవ్వినిబంతులన్

వాలి రువ్వుచు, లీల నవ్వుచు, వారివారికి వారిలోఁ
గేలిఁదేలుచుఁ, జాలఁబ్రేలుచుఁ గేకసల్ వడిఁగొట్టుచుఁ, 160

మ. తరుణీవక్త్రవిశేషసౌరభము లుద్యల్లీలతోఁ గ్రోలి వా
నిరుచింబోలమి రోఁతపుట్టి యట వాంతిం జేసెనాఁ జూచితే
చరదిందిందిర, మర్త్యమాంశుపటలీసంతప్తపం కేరుహాం
తరసంజాతమధూళి, ముక్కుచురుకన్నఁ వెళ్ళఁ గ్రాసెం జెలీ! 161

ఉ. చంచలనేత్ర!యీకలికిజాడలు ప్రోడలయందుఁ గాన మొ;
క్కించుక గానలేక మొగమెత్తి కనుంగవ నవ్వుదేర రో
మాంచసమంచితాంగయయి యల్ల దె కన్గొనఁజాలదొక్కరా
యంచ యహో!వెసందనకులాంగన చెంగట రెక్కలార్వఁగఁ." 162

గీ. అని వినోదంబులాడుచు నబ్జముఖులు
గరఁగిపోయిన పూఁతలఁ, గన్నుఁగొనల
బెరయుకెంపులఁ, దత్సరోవరసమగ్ర
రతివిహారవిరామసంగతుల మెఱసి. 163

ఉ. గట్టునకేగుదెంచి తొలుకారుమెఱంగులఁ బోలునంగనల్
గట్టిరి చంద్రకావుశెసఁగన్ దనువల్లులిగిర్చెనోయనఁ
బెట్టిరి రత్నహారములు, పేశలకాంతిగుళుచ్ఛవైఖరిఁ;
బట్టిరి కేలిపద్మములు, పంకజసద్మకు నీడుజోడనన్. 164

క. జలదుర్గస్థలి హరిమ
థ్యలుగొని తమయంగబలము నంమంచిరనఁ
కలఁకం దొఱంగి యెప్పటి
వలెఁ, జక్రసరోజశఫరపంక్తులు వెలసెన్. 165

క. అలకాళి ముఖాబ్జప్రతి
ఫలనావరణాదికాంతిపటలంబులు. ద
ల్లలనాసంగతిఁ బాయక
కొలఁకులు వెనువంటవచ్చుకొమరు ఘటించెన్. 166

క. కంజముఖులపుడు వనమద
కుంజరములనంగ నెఱసి కొలకొలరాఁ, ద
న్మంజీరపుంజమంజుల
సంజాతరవంబు చెవులచవులు ఘటింపఁ. 167

క. చూత;నుదియేమిక్రొత్తయొ
కో!తామిట యువతిసమితికోలాహలముల్
తోతెంచె నంచు, భూపతి
చూతలతాగృహము వెడలి చూడంజూడన్. 168

సీ. అడుగుఁదామరదోయిఁ దొడివినబంగారు
రవలపావలముద్దురవము గులుకఁ
గొనఁబుగా నెఱికిఁగట్టిన క్రొత్తచెంగావి
చేలపయ్యెదకొంగు తూలియాడ
నతనుగద్దియయుద్ది యనఁ గాంచు పిఱుఁదుచెం
గటఁ గాంచికాదామకంబు మెఱయ
గలికిజక్కవపిట్టకవ బిట్టువాలించు
గురుకుచంబుల సరుల్ గునిసియాడ

గీ॥ దంతకురువిందకాంతిబిత్తరము చిమ్మ
సరససల్లాపగోష్ఠి నచ్చపలనయన
యల్లనల్లన రాఁజూచె నవనివిభుఁడు
వేడ్కమున్నీరుపెల్లుబ్బి వెల్లిగొనఁగ 169

శా. ఆపుంస్కోకిలవాణి, యాజలధికన్యారత్నసౌందర్యరే
ఖాపాణింధమమూర్తి యాత్రిజగతీకాంతావతంసంబు కే
లీపద్మాకరవాంచ దీఱిదనఁగాలీలావతిన్ నిద్దపున్
జూపుక గెల్వ వసంతమాడె మహిభృచ్ఛూడావతంసంబుపైఁ. 170

ఉ. మచ్చరికించి మారుఁడు కుమారునిబాణవిశేషవిద్యలన్
మెచ్చక, బాహుగర్వమున మించి, సమంచితచాతురీగతిన్

గుచ్చుకపాఱనేసెఁ బువుగోలఁ గుభృత్తిలకంబు, నట్టెచం
చచ్చపలాంగి నొక్కమొగి, శంబరవైరి నుతింపఁజెల్లదే. 171

ఉ. అక్కలకంఠినప్పుడు వయస్యలు గన్గొని "యెంతవెట్టివే!
యక్కట! నీవొకానొకధరాధిపనందనుఁగాఁ దలంచి వెం
పెక్కినకూర్మిఁ జూడకొరుఁడెవ్వఁడు నేఁడిట కేలవచ్చు, వ
మ్మక్క!వనీవిహారమున కైచను దెంచినపంచబాణుఁడే." 172

క. అనిపలికి చెలువచూపొక
యనువున మరలించి మగిడిరప్పుడు విభుఁడుఁ
మనమునఁ బెనఁగొనుమమతన్
జనియెను, శుకమున్నపువ్వుఁజప్పరమునకున్. 173

శా. "ఆహా!నేఁడొకక్రొత్త వించె శుకలోకాధ్యక్ష!యే నీలతా
గేహం బింతకుమున్నుగా వెడలి వీక్షింపన్, మనోజాశుగ
వ్యూహప్రక్రియఁ జూపుచాలడర, విద్యుద్వల్లరీపం క్తితో
బాహాబాహిఁ బెనంగుమేనిజిగిజొంపం బింపుగల్పింపఁగన్. 174

ఉ. పుత్తడిబొమ్మయో, చిలుకబోదయొ! కెంజిగురాకుగుత్తియో!
ముత్తెపుఁగోవయో! మదనమోహనబాణమొ నా, వనీవిహా
రాత్తమతిఁ సభీజనసహస్రము గొల్వగ వచ్చిపోయె నేఁ
డిత్తఱి నొక్కఁబిత్తరి, యహీనవచోరచనావిశారదా! 175

ఉ. ప్రస్ననిపాదముల్, చిలుకవాకినఁగందెపుమేనుదీఁగెయున్
వెన్నెలవాఱునెమ్మొగము, నిద్దపుముద్దుమెఱుంగుఁజెక్కులున్
గ్రొన్నెలవంటినెన్నుదురుఁ, గోమలబాహుమృణాలయుగ్మమున్
గన్నులఁగట్టినట్లు పొడగానఁగ నయ్యెడు నాకు నెచ్చెలీ! 176

గీ. అల్లనల్లన సతి నడయాడెనేని
గలికిపలుకుల వాల్గంటి పలికెనేని
యంచలంచలవచ్చు రాయంచకదుపు
కూడనేతెంచుఁ, గీరంపుఁగొదమపదుపు 177

శా. కేలందామరక్రొవ్విరిన్ బిరబిరన్ గేలీగతిం ద్రిప్పుచున్
వాలారుంగొనగోళ్ల ఘర్మకణికాక్రాతంబు పో మీటుచున్
గ్రాలుంగన్నుల ముద్దులేనగ విగుర్పన్, ఱెప్పలల్లార్ప క
వ్వాలుంగంటి, ననుంగనుంగొనినభావం బెన్నఁడుం బాయునే? 178

క. ఆమగువ మోముతోడను
నేమిటనో పెచ్చిరిల్లి హిమకరుఁడొకనాఁ
డేమో పోలునఁట! యిఁకం
దామరతాఁబోలుదునన దైవము సగదే! 179

గీ. సవిధతరుజాలపుష్పగుచ్ఛములఁ జూచి
యువిదచనుదోయిరోసి పైనుమిసెఁనన్నఁగ
ధగధగాయితనిర్మలతారహార
వల్లికాకాంతిపుంజంబు పెల్లు డాసె. 180

క. నునుగాలి సోఁకినంతనె
తునిఁగెడునెన్నడుముచేసి, తోరపుఁజన్నుల్
వనజభవుఁ డిట్లు సేయునె!
కనికర మొకయింతయేనిఁ గలుగదు సుమ్మీ! 181

క. పొలసినయంతటిలో నా
తలఁపుంబ్రాఁదేనె యాసుదతి చెలిమాపన్
వలికరువలికొనిపోయెను
నెలకొనుతమకమున, నెట్లునిలుతుం జెపుమా! 182

క. శుకకులపంకజసంభవ!
సకలపురాణేతిహాసచాతుర్యకళా
ప్రకటనకుతుకాపాదివి,
త్రికాలవేదివి, భవన్మతికి నెనగలదే. 183

క. వలరాయనిదేవియొకో!
పలుకుందొయ్యలియొ! కాక బలరిపుసతియో!

జలకేళికిపుడు వచ్చిన
యలికుంతల తెఱఁగు చెప్పు"మని యడుగుటయున్. 184

శా. స్రష్టృత్యుల్బణబుద్ధివై భవ!సమస్తద్వీపవిన్యస్తరా
జ్యోష్టృప్రాపితభాగధేయ!ధనశౌర్యోదగ్ర!జన్యాగ్రసం
ద్రష్టృమోదపురస్సరత్కమలదు[22]గ్ధాపత్య!దైత్యద్విష
ద్ధృష్టస్థాపితవైరివీర!త్రిజగద్రాజద్యశోమండలా! 185

క. సాగరకన్యాచంక్రమ
ణాగతపాదారవింద!యాచకశుభదృ
గ్రాగసలక్షణలక్షిత!
భాగవతవిధేయ!దానపదరాధేయా! 186

సుగంధి

పారదప్రభావిభాసిభవ్యకీర్తి వాహినీ
పూర!దానధూతదివ్యభూజరత్న కామధు
గ్వార! యాఁటు వేలవంశ వార్ధి పూర్ణ చంద్రమా!
సారబుద్ధిజాలనీతశత్రుభూమిభృద్రమా! 187

గద్య

ఇది శ్రీమదఘోరశివాచార్యగురుకరుణావిశేషలబ్ధసారస్వత, మాదయామాత్యపుత్ర, మల్లయనామధేయ, ప్రణీతంబయిన రాజశేఖరచరిత్రంబనుమహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము.

22: కమలగేహాసత్య!

రాజశేఖర చరిత్రము

తృతీయాశ్వాసము

క. శ్రీచక్రచారుకుచయుగ
సూచకగాఢోపగూహసూచితపులక
ప్రాచుర్య!తత్త్వతత్పర?
యాచకసంస్తుత్య!మంత్రియప్పామాత్యా! 1

వ. అవధరింపుము 2

క. అన్నఁదదీయోక్తులకున్
మన్నన రాచిల్కవల్కె మహివతితోఁన
క్కన్నియతెఱఁగంతయు నే
విన్నప మొనరింతునే?వివేకనిధానా! 3

చ. అగునగునయ్య! యచ్చెలియ యట్టిద, యెంతనుతింప నంతకున్
దగుఁదగు, మర్త్యలోకవనితాజనతావినుతాంగి, యానన
ద్విగుణితచంద్రమండల, తదీయనిశాతకటాక్షపాతముల్
తగిలిన, మారుఁడెవ్వరి హళాహళి సేయఁడు వాఁడితూపులన్? 4

ఉ. ఆలతకూన. యాకలికి, యాయెలజవ్వని, యామిటారి, యా
లోలకురంగశాబకవిలోచన, యాకలకంఠకంఠి,యా
బాలరసాలమంజరి,నృపాలకవంశవతంస!రూపపా
చాల!వయోవిశేషగుణసంపద నీక తగుం దలంపఁగన్ 5

గీ. అవధరింపుము పంచబాణావతార!
తారతారకహారమందారకీర్తి
కీర్తిపాలకుడనుమహీభర్తయేలు
నరుణపురమనఁగానొక్కపురము వెలయు. 6

సీ. భువనత్రయభ్రాజిపురరాజి తలకట్టు,
కైటభారివధూటి యాటపట్టు
వేదాదివిద్యలు విశ్రమించినతావు,
విబుధకోటులపాలి వేల్పుటావు
పోటుగంటులు దూటిపోవుశూరుల యిక్క
మదవద్విరోధుల కెదురుచుక్క
నవనవాకృతినొప్పునవలాలగమి చెంకి,
వాసనాగరిమ జవ్వాదివంకి

గీ. పరిసరోద్యానవాటికాంతరసరన్మ
రందరసపూరసంతతమండితంబు
పరిఖ,యున్నతసౌభాగ్యభాగ్యమహిమ
బాలమున్నీటిచుట్టమప్పట్టణంబు

క. అందు ముకుందుఁడనంగ ము
కుందనిభుం డొక్కవిప్రకుంజరుఁడు గల్గం
డిందుకళామృతశీతల
సందీపితహృదయుఁ డతఁడు సౌజన్యనిధీ! 3

మ. అఖలామ్నాయములున్ బఠించి, బహుశాస్త్రాలోచనల్ చేసి, బు
ద్ధిఖలీనోన్నతిఁ జిత్తదుర్మదహయోద్రేకంబు వారించి. చి
త్సుఖకేళీపరతంత్రుఁడై, గుణగరిష్ఠుండై, సదాచారమా
ర్గఖరూరిశ్రముఁడై యశేషబుధలోకఖ్యాతిఁగాంచెన్మహిన్ 9

సీ. గ్రాసంబునకుఁ జాలఁగాఁ బండు సస్యముల్;
మొదవులు పరిహైయెదు పిదుకునింట;
విడిముడిదప్పుగాదడిగిన లేదుపొ;
మ్మనలేఁడు, సద్వ్యయ మాచరించుఁ
కలిమిని విజ్రువీఁగఁడు; లేమిఁ గుందఁడ్డు;
కలపాటిదినములు గడపిపుచ్చు;

దుర్ధానములుగొనుత్రోవను బోనొల్లఁ;
డాసపాతకుఁడుగాఁ; డీసులేఁదు;

గీ. మఱచితప్పియు నొరులకు మనసురాని
పరుషభాషణ లెంతైనఁ బలికియెఱుఁగఁ;
డఖిలజీవదయాపరుఁడై తనర్చుఁ;
బరమసాత్త్వికబుద్ధిఁ దద్బ్రాహ్మణుండు. 10

మ. సరసాహారములింటఁబెట్టి బహుశిష్యశ్రేణికిం దెల్పు శా
స్త్రరహస్యస్థితిఁ, జెప్పు నధ్యయనసంధ్యల్, హవ్యకవ్యంబులన్
సురకోటిం బితృకోటి నేమఱక ప్రోచున్, విప్రవర్గంబులో
సరిలేరెచ్చట నమ్మహాత్ముకునకున్ సౌజన్యభవ్యోన్నతిన్. 11

క. హింసదెసఁబోక, నరులప్ర
శంసకు మదిఁ దెరలిపడక, సజ్జనమకుటో
త్తంసుఁడన నతఁడు చేసెన్
సంసారము రీతిగాఁ ప్రజల్గొనియాడన్. 12

క. పొరుగింటివిప్రముఖ్యుం
డరుణుం డననొక్కఁడతనియట్లన విద్యా
పరిణతుఁడయ్యును జన్మాం
తరవాసనకతన, లేమిఁ దద్దయుఁ బొగులుఁ. 13

మ. కులనిర్మూలనకారణంబు, ప్రతిభాకుట్టాక, మున్ద్వేగకో
పలతాదోహద, మాజవంజవసుఖప్రత్యూహ, మాత్మవ్యథా
జ్వలనజ్వాలిక, కామినీనయనపీఱాపాతసంరోధి, ని
ష్కలఘుత్వాశ్రయభూమి, లేమి యది యూహా! యేమి గావింపదే? 14

గీ. పలుచగాఁ జూచు నెంతయు బంధుసమితి
పిలువఁ బిలువంగఁ బలుకరు బిడ్డలైన
రచ్చకెక్కుడుమాట, గారాపుసతియు
లెక్కసేయదు; లేమి తూలించెనేని. 15

గీ. కష్టదారిద్ర్యదోషంబుకతనఁ గాదె
ప్రాభవముదక్కి మును ఋతుపర్ణవిభుని
వంటవాఁడయి కొల్చెను వైరసేని
వాసి చెఱుపదె యెంతటివారినైన. 16

గీ. అట్లు దారిద్ర్యదోషసంప్రాప్తుఁడయ్యుఁ
జిత్తవిధి నొకింతయుఁ జింతలేక
నియమపరత నిజాచారనిరతుఁ డగుచు
నడవఁ, దత్కాంత మదినొక్కనాఁడు విసివి. 17

క. "పెనిమిటి యనఁగరాస్యుఁడు
ననభిజ్ఞుఁడు నైన దైవమా! యని మదిలో
వనరుచు లేమింబడఁదగు;
నినుఁ జెందియు నాకు నింత నెవ్వగ యగునే! 18

క. మండ జఠరాగ్నిఁ దనయులు,
చండత మంగలమువంటి సంసారము, నిం
కొండుగతి లేదు, దినదిన
గండం, బేరీతి నడపఁగాఁ దగు ననఘా! 19

సీ. చదివినారలు, పెక్కుసంధలఁ గించిత్తుఁ
దప్పకయుండ వేదత్రయంబు
పఠియించినారలు, ప్రతిభాసమున్నిద్ర
సౌష్ఠవంబున మూలశాస్త్రవితతి
శోధించినారలు, శుద్ధమతిస్ఫూర్తి
నఖిలపురాణేతిహాససమితి
చూచినారలు, బుధస్తోమంబు గొనియాడఁ
గావ్యనాటకముఖ్యగ్రంథసీమ

గీ. యేమి చెప్పెడుదాన మీరిడక లేవు
సకలవిద్యలు భూసురసమితికెల్ల;

నజునకెనవత్తు రన్నింట నకట!మీర
అలముకుందునికన్న నే వెలితి?చెపుఁడు; 20

క. అతనినడవడి చూడరు
గా! తామరతంపరగుచు గాదెలఁ గొలుచున్,
జేత విడిముడియు, బహుగో
త్రాతంబును గల్గి , రాజువడువున నుండున్. 21

క. పూచినతంగెడుగతి వి
ద్యాచతురుండతనిసోమిదమ్మ, పొరువునన్
వాచాలరత్నకంకణ
సూచితవిభవమున మెఱయఁ జూడంగలనే!" 22

వ. అనిన నతండిట్లనియె.

క. కులమునఁబడునో బహువి
ద్యలఁబడునో!బుద్ధిఁబడునొ!తరుణీ! యేలా
వలవనిదురాశ లెందుం
గలుగదుపో బ్రతుకు,పూర్వకర్మము దక్కన్. 24

క. ఏరికి బుద్ధి బలంబులు
కారణములుగావు సువ్వె!కలరే ధాత్రిన్
నేరిచి బ్రతికిన వారలు?
నేరక చెడ్డట్టి వారు? నీరజనేత్రా! 25

ఉ. సూదిపిఱిందిదారమయి చొచ్చినచోటులు, చొచ్చి యేరికిం
గాదనరాదు పూర్వకృతకర్మఫలం, బటుగాన నేల ని
ర్వేదనఁ బొందెదిప్పుడలివేణి! తపంబొనరించి యేను ల
క్ష్మీదయితప్రసాదమునఁ జెందెదఁ, దావకచింతితార్థముల్. 26

సీ. జగదభినిర్మాణచాతుర్యవిఖ్యాతి,
మెచ్చి ధాతకు నెవ్వరిచ్చినారు?

స్వర్లోకపాననసౌభాగ్యగరిమంబు,
మెచ్చియింద్రున కెవ్వరిచ్చినారు?
దృగ్విధాగోచరదివ్యతేజఃస్ఫూర్తి,
మెచ్చి భానునకెవ్వరిచ్చినారు?
సకలజుమాధృతిజుమసత్త్వసంపత్తి,
మెచ్చి శేషునకెవ్వరిచ్చినారు?

గీ. విష్ణుకరుణావిశేషంబు విశ్వమునకుఁ
గారణముగాక మఱి యేది కలదుదిక్కు?
కాన నఱలేనిభక్తి నోకంబుకంఠి!
మనలఁ గొల్చిన మనుపఁడే మదనగురుఁడు? 27

మ. తరుణీరత్నములేమి దొడ్డు? మదమాద్యద్దంతియూథంబులే
యరు? దత్యున్నతభోగభాగ్యవిభవవ్యాపార మేలెక్క? సా
గరసంవేల్లితవిశ్వభూభువనరక్షాశక్తి యేబ్రాఁతి? శ్రీ
హరిసేవాపరులైనపుణ్యులకుఁ గాంతా;యేల చింతిల్లఁగన్? 28

మహాస్రగ్ధర.

కొలుతుందేవాదిదేవుం గువలయసుషమాగుచ్ఛసచ్ఛాయకాయున్
గలశాంభోరాశికన్యాకచభరవిచరత్కమ్రహస్తారవిందున్
బలివిధ్వంసిం దపస్విప్రకరసుఖకరప్రౌఢకారుణ్యలోలున్
జలశాయిన్, జక్రపాణిం, జగదవనపరున్, జంభసంభేదివంద్యున్, 29

వ. అని వితర్కించి. 30

క. విమలాచారుం డవిరళ
శమయుతుఁడయి తపము సలుపఁ జనియెన్, లక్ష్మీ
రమణాధీనమనోగతి
యమరాడనుజన్మయైనయమునానదికిన్ 31

క. అన్నదిపావనగుణసం
పన్నత నుతియింపఁగలఁడె పన్నగపతియున్

మిన్నక యన్నది మునిఁగిన
యన్నరుఁ డమ్మరునితండ్రి, యనఁగఁగుఁ బెరిమన్. 32

మ. జటిసంఘాతసమీపసంఘటితరజ్యద్వ్యాలుకాలింగసం
స్ఫుటముల్, జన్మపరంపరాఘలతికామూలచ్ఛిదాపాదనో
ద్భటముల్, ముక్తివధూకుచాగ్రపటముల్, భాస్వత్తనూసంభవా
తటముఁల్; వానికడన్వసించునరుచెంతం జేర వేచింతలున్. 33

ఉ. దీపితభక్తి నన్నది నుతించుమహాత్ములఁ జూతురేని, మీ
కాపనిగాదు;దైత్యకులఘస్మరశాతకఠోరచక్రధా
రాపటుపాతవేగమున ద్రవ్యులగుం దలలంచు బుద్ధిగా,
నాపితృభర్త చెప్పునఁట!యాత్మభయంకరకింకరాళికిన్. 34

మ. మగఁడెవ్వారలఁ బ్రోచు వారు సతికిఁ మాన్యుల్ గదా యంచు లో
నగముల్ వారిధిమాడ్కిఁ దాఁచె ననఁగా,నైదాఘవేళాతప
ద్విగుణీభూతతనూవిదాహ మడఁపన్ వే వచ్చి తత్కాలముల్
డిగి లీల న్విహరించుఁ, దీరవనవాటిన్ దంతిసంతానముల్ 35

వ. అట్లు సకలగుణతరంగితయగునత్తరంగిణిం గనుంగొని, యవ్విప్రపుంగ
వుండు పులకితాంతరంగుండగుచునిట్లనియె. 36

క. "ముల్లోకముఁ బావనసం
పల్లీలల మనుచునట్టి మహిమలు గంగా
కల్లోలినికిం గలుగుట
తల్లీ!కాళింది!నీకతంబునఁ గాదే 37

శా. సారాచారు, లశేషభూభువనరక్షాదక్షు, లబ్జాననా
మారాకారు, లశేషభవ్యసుషమామార్తాండు, లర్థార్థిమం
దారుల్, తొంటిభవంబునఁ శమసముద్యచ్చిత్తులై వచ్చి నీ
వారిం గ్రుంకినవారివారలఁటకా!వార్ధిప్రియంభావుకా! 38

శా. రేపుల్దామరచూలిచందమున సంక్రీడించి, మధ్యాహ్నవే
ళాపూర్తిం గనకావనీధరధనుర్లాలిత్యములూహించి, తా

మాపుల్మాధవలీలలన్వెలయునమ్మార్తాండుఁ, డోయమ్మ! నిన్
న్నేపుణ్యంబునఁగాంచెనో! యతని పెంపింకేమనఁ బావనీ! 39

లయగ్రాహి.

చాలుకొని మించునెఱడాలుగలజాతిహరినీలములనేలుకొనఁజాలెడుభవత్క-
ల్లోలములు, భక్తజనలోలములు, పాపవనకీలములు, మోక్షపదమూల
ములు, తత్త
ద్బాలిశజనప్రకరఫాలతలపద్మజసమాలిఖితదుష్టలిపితూలపటలీవా
తూలములు, పుణ్యగుణశీలములు, సంస్తవనకేళిపరతంత్రములు,
లీల నుతియింపన్. 40

వ. ఇట్లు బహువిధంబుల నమ్మహానది నభినందించి కృతస్నానుండై, సమా
కుంచితపంచేంద్రియుండగుచుఁ, బంచాగ్నిమధ్యంబున నిలిచి, హరిని
గుఱించి తపంబాచరించుతఱి నొక్కనాఁడు. 41

సీ. పుష్పవతీనామపుటభేదనం బేలు
నందకాఖ్యానగంధర్వనృపతి
గారాపుఁగూఁతురు, కామునిరాచిల్క,
లతయనుపేరిబాలయు, మహేంద్ర
నగరాధినాయకుండగుచిత్రవాహనా
హ్వాయమునఁ బరఁగెడుయతుభర్త
కనుఁగుఁదనూభవ, కనకమంజరి యను
కన్నియ, జలకేళికాకుతూహ.

గీ. లమున యమునానదీతీరలలితఫలిత
కాననాంతరసీమకుఁ గదలిపోయి
కాంతలిద్దఱు నచ్చటఁ గలసి మెలసి
సంభ్రమంబున బుష్పాపచయ మొనర్చి. 42

గీ. వారలిరువురు నవ్వుచువచ్చి చెంతఁ
జిగురుటాకులమఱువునఁ దగిలియున్న

యొక్కమంజరిఁ జూచి యొండొరులఁ గడవఁ
బాటి యౌవనగర్వసంపదలకతన, 43

క. ఇవ్విరి నాయది యనఁగా
నవ్వలియది తనదియనఁగ, నదిహేతువుగాఁ
గ్రొవ్వారికొఱకై యిద్దఱు
జవ్వనులకు, మాటమాటజగడంబగుటన్. 44

క. తొల! తొలఁగు! తొలఁగు మనుచుం
దల! తల! తల మనుచు, వట్టిదంటతనంబుల్
వలదు వలదనుచుఁ, బల్కఁగఁ,
గలకంఠులకపుడు మిగులఁ గలహాము ముదురన్. 45

ఉ. కొప్పులు వీడఁగా, బిగువుగుబ్బలు పల్మఱు జాఱఁ, బయ్యెదల్
గప్పుచు రత్నకంకణరుళంరుళనాదము మించ, హస్తముల్
త్రిప్పుచుఁ, గౌనుదీఁగెలుచలింపఁగ, వేచని తోడివారితోఁ
జెప్పుచు, నద్ది రా! యనుచుఁ జిట్టలు మీటుచు సందడింపుచున్. 46

క. అయ్యారువురిలో లతయను
తొయ్యలి కప్పువ్వుగుత్తి దొరకినకతనన్
గయ్యమునకుఁ గాల్దివ్వుచు
గయ్యాళితనంబు మీఱఁగా నిట్లనియెన్. 47

క. "తగవెఱుఁగవు, నగవెఱుఁగవు,
మొగమోటయులేదు కొమ్మ! మున్నుగునాచేఁ
దగిలినవిరి, నాకిమ్మని
తగిలెద, వోవెఱ్ఱిపట్టి! తహతహవలదే? 48

ఉ. రక్కెసమాటలేల నగరా!తగువారలు!నోరునొవ్వదే?
డక్కనె యొడ్లసొమ్ములు పడంతుక!యెంతయలంత నొందినన్
నిక్కుచునీల్గుచుం బలుకనేర్చిననీవిటమున్న తీఁగెపై
నిక్కుసుమంబు గోయుటకు నేటికి నేరకయుంటి చెప్పుమా 49

క. కామిని!వాదులు గొఱగా
వేమిటికని యూరకున్న నెఱుఁగవు నన్నున్
వేమఱు నొత్తుకు వచ్చెద
వేమిటనాతోడఁ బోలుదే!యిటఁ జెపుమా!" 50

ఉ. అన్నఁ, దదీయవాక్యముల కామృగలోచన పల్కె, "రూపసం
పన్నతకుం గులంబునకుఁ బాఱకు; నల్గురుమెచ్చనాడు మో
కన్నియ!నన్ను నిన్నును జగంబెఱుఁగున్; మునుమున్న కన్న నా
క్రొన్నన నాకునిమ్మ, మటి రూపుకొలందులు గాననయ్యెడున్. 51

ఉ. వీటిఁడిమాటలేల వినవే!యలవాఁడె కళిందకన్యకా
తీరమునన్ వసించి యతితీవ్రతపం బొనరించు మౌనికం
ఠీరవముం గరంచునదినేర్పు, విలాసముపేర్మి; నేటికిం
బోరఁగ?నప్డు కానఁబడుఁబో! మనయిద్దఱితారతమ్యముల్. 52

క. ఒసపరిమాటలఁ బాటల
నసమానతపోనిరూఢుఁడగునమ్మౌనిం
గుసుమాస్త్రబాణవశమా
నసుఁజేయుట, యిపుడు నీకొ!నాకో!చెపుమా!" 53

చ. అన విని యామృగాక్షిదరహాసము మోమున నంకురింప. యా
వనభరరూపసంపదల వన్నెకు నెక్కుటఁజేసి యిట్లు తా
మునుకలుగంగ నియ్యకొని ముద్దునడన్ మదభద్రదంతినాఁ
గనుఁగొన ధాళధళ్యములు క్రందుకొనం జని, తన్నదీస్థలిన్ 54

మ. కటిఘాటీభవదేణకృత్తితను,జాగ్రన్నాకులేకాగ్రదృ
క్పుటి,లాలాటసమర్పితాంజలి,రమాంభోజాననానాయకో
త్కటనిధ్యానసుధాధునీలహరిమగ్నస్వచ్ఛనిర్ణిద్రహృ
త్తటి,నద్దివ్యమహానుభావజటిఁ జెంతంజేరి లీలాగతిన్ 55

ఉ. ఆడుచుఁ బాడుచున్ సరసమాడుచు మోహనలీల వ్రాల న
చ్చేడియచెయ్వులెల్ల మునిసింహము కన్గొని, "యిప్పుడద్ధిరా!

యోడక వచ్చి నాయెదుర నూరక ప్రేలెడుదీని మత్కుఠా
బాడబకీలలన్నలఁచి పాఱఁగ వైచెద" నంతు, నుగ్రుఁడై 56

మత్త కోకిల

"బాల!యౌవనగర్వరేఖఁ బిసాళమాడెద వేల? నా
ప్రేమ; నెవ్వరిఁగా దలంచితి? మోహసాలసమూహని
ర్మూలనక్రమశాలిఁ జక్రధరుఁ భజించుకృతార్థుఁడన్
జాలుఁ! జాలుఁ! బొకాలు పుట్టురసాతలంబున మర్త్యవై" 57

క. అని ముని శపియించిన, నె
మ్మనమున విభ్రాంతి నొంది, మారుతసంచా
లనచలితలలితలతయన
ఘనభీతి,లతావధూటి, గజగజవడఁకెన్ 58

క. అది గని "కార్యము దప్పెన్
బొదఁడు పొదం"డనుచు నింగిబోటులు మునిరా
ట్పదపద్మవినతులొనరిచి
మృదుమధురాలాపసరణిఁ గృపదళుకొత్తన్ 59

మ. "కినుకన్ మీరొకయింతచూచినఁ ద్రిలోకీలోకసంచారముల్
పొనుఁగై పోవె? భవన్మహామహిమకున్ బూఁబోండ్లు లక్ష్యంబె? యు
వ్వనితన్, దీన, ననాథఁ గావఁగదవే!వాత్సల్యసంసిద్ధి,నో
వనజాతోదరజాతధీవిభవ!యో వాచంయమిగ్రామణీ!" 60

గీ. అనిన నమ్మౌనిపలికె దయాళుఁడగుచుఁ
"గమలముఖులార!నాదువాక్యములు తప్ప,
వైనఁ గానిండు; మున్నొక్కయతివరుఁడు
కంబుఁడనువాఁడొకానొకకారణమున 61

ఉ. మైంధవనామధేయనృపమన్మథుగర్భమునన్ జనించి సౌ
గంధికబంధువంశకలికామధుమాసవిలాసియై సుధా

సింధుసబంధుబంధురవశీకృతకీర్తిధునీప్రపూర్తియై
సింధుఁడునాఁగ రాజకులశేఖరుఁడొస్తుతుఁ గాంచె నెంతయున్ 62

క, ఆరాజకులోత్తంసకు
మారికయై యిది జనించి,మహనీయకళా
శ్రీరంజితయగుఁ బొం"డన
వారిజలోచనలు "కొంతవగఁదిరుగుటయున్ 63

ఉ. "రామలు,కేళికాననధరాస్థలికిన్ మను క్రీడ సల్పరా
రో!మనసారఁ గమ్మనివిరుల్ దమనేర్పులఁ గోసికొంచుఁబో
రో!మదవృత్తి నీగతి మరుల్గొని పోరినవారిఁగాన;మొం
డేమనువారమమ్మ! తరళేక్షణవ్రాఁతఫలం బిటుండఁగన్" 64

క. అని పలికి యమ్మునిపతికిఁ
బ్రణామములఁ దగ నొనర్చి, రాజీవముఖుల్
చని;రిట లతావధూటియుఁ
బ్రణుతయశఃకంధి సింధుపతికుదయించెన్ 65

సీ. ఆసింధుపతియేలునవనిమండలమిది
యతనిపట్టణభర్మహార్మ్యవీధి
నభ్రంకషంబులై యాడెడుఁగేతన
పల్లవంబులుచూడుమల్ల యవిగో!
చేరువకిపుడువచ్చినకాంతిమతియను
తలిరాకుబోఁడి యాసులలితాంగి
యాపువ్వుఁదోట యీయిందీవరేక్షణ
క్రీడసల్పెడునట్టికేలివనము

గీ. మహితమధుమాసమగుట నమ్మందగమన
చెలులుఁ దాను విహారంబు సలుపవచ్చి
పోవుచున్నది నిజపురంబునకు మగిడి
మత్తగజగామినీజనచిత్తచోర! 66

క లేకున్న నింతచక్కని
కోకస్తని, కోమలాంగి, కువలయసుషమా
లోకమునఁ గలదె!మానవ
లోకంబున!నిఖలరాజలోకవతంసా! 67

మ. వనితారత్నము మోము, భ్రూవిలసనవ్యాపారముల్ వక్రము
ద్ర నిరూపింపఁగ,నప్రమాణగతినేత్రంబుల్ పచారింప,నీ
సునఁదర్కింపఁగడంగివచ్చుద్విజరాజున్ ,నిగ్రహస్థానయు
క్తునిగాఁజేసిచెలంగు న?ప్రతిభచేఁగ్రొత్తల్వితర్కింపఁగన్ 68

క. తరుణియెలకౌను, మదకే
సరిసన్నిభయై బలప్రసన్నతగనియున్
గురుకుచభారవహస్థితిఁ
బరఁగియు, నిరుపేదతనము పాయదు కంచే! 69

గీ. అంగలతికావిలాసంబు నాచరించు
యౌవనామృతవృష్టిసంప్రాప్తికొఱకు
లలితనాభీబిలంబువెల్వడినయట్టి
చీమచాలనఁజాలుఁ దద్రోమరాజి 70

క. మును పరమహంసవాసనఁ
బనివడి సామీప్యపదవిఁ బంకేరుహమున్
గనియెనొ యనఁగా వరవ
ర్ణిని పాదయుగంబు, పద్మరేఖన్ బొలుచుఁ 71

చ. కలితసుధారసంబుతొలుకన్ సరసప్రియభాషణంబులన్
బలికిన శీతకాలమగుఁ; బల్లవపాదములెత్తి లీలమై
మెలఁగ వసంతకాలమగుఁ; మించుకనుంగవఁ బాఱఁజూచినన్
దలకొనుకాఱుకాలమగుఁ; దన్వివిలాసము చిత్రమెన్నఁగన్ 72

ఉ. వ్రీడదొఱంగి,యూహరివిరించిముఖుల్ భ్రమనొంది గుట్టుపో
నాడరొ!పంచసాయకశరాహతిపాల్పడి పువ్వుఁబాన్పులన్

? స్వ

వాడరో!చంద్రచంద్రికలవంకఁ గనుంగొన నోడరో!తగన్
జూడరుగాక యక్కలికిచూపుల బాలకురంగలోచనన్ 73

చ. ప్రచురవివేకసార!యలబాలిక నేమని చెప్పువాఁడ!వా
గ్రచనలుగావు;మేనమరుఁ గల్పకవల్లిమతల్లి తల్లియై:
కుచనిచయంబుపొల్పమరుఁ గార్కొనుతుమ్మెదచాయచాయయై
కుచలికుచంబులింపెసఁగుగ్రొవ్విరిబంతులమేలిబంతులై 74

ఉ. అచ్చిగురాకుఁబోడినవయౌవనరూపవిలాసరేఖ నీ
విచ్చటఁ గంటినంటి;వదియెంతయుఁగల్ల; యొకింతచూచినన్
బచ్చనివింటివాఁడు తెగఁబాఱక నిన్నిపుడింతదవ్వు రా
నిచ్చునె!రాజశేఖరనరేశ్వర!''యంచు శుకంబు పల్కినన్ 75

గీ. పార్థివాగ్రణి సంతోషభరితుఁ డగుచు
''నవ్వీలాసినితెఱఁగెల్ల నానుపూర్విఁ
దెలిసి యీరీతిఁ బల్కునేర్పులు శుకేంద్ర!
నీకుఁ, బుస్తకపాణికిఁ గాక,కలవె! 76

ఉ. కంటిఁ దపోవిశేషమునఁ గన్నులపండువుగాఁ దలోదరిన్;
వింటి భవద్వచోరచన వీనులచల్లఁగఁ దద్గుణాళి;పూ
వింటియతండు వన్గినిసి వెంపరలాడకమున్నె, యల్లవా
ల్గంటి మనోజ్ఞసంగమసుఖస్థితియేగతిఁ గల్గుఁ? జెప్పవే! 77

ఉ. చంచలనేత్రపోవునెడ,సన్నపుఁబయ్యెదకొంగుజాఱఁ గాం
ఛించుచెగాని చన్నుఁగవక్రేవలఁ బ్రోవులుగట్టియున్నక్రొ
మ్మించుల నామచూడ్కి మిఱుమిట్లుగొనం గనరాకపోయె నొ
క్కించుకయేని,తద్గరిమ యెట్లుభరింపుదు!నిచ్చనెచ్చెలి! 78

ఉ. కంగినవైఁడికుండల వకావకలై చనఁజేయఁజాలుచ
న్నుంగవవ్రేఁగునం దనతనూలత యల్లలనాడఁ, దేటవా
లుంగనుదోయిచూపులు తళుక్కన నల్లనవచ్చినన్ దృఢా
లింగనమావరించ కవలీఢమనోవ్యధ మాననేర్చునే? 79

సీ. బలువిడి నేతెంచి వలరాచబెబ్బులి
వాఁడితూపులగోళ్ళ వ్రచ్చెనేని
యెలమావికొనయెక్కి పెళపెళవార్చికో
వెల పోటుఁగూఁతలవెట్టెనేని
బడిబడిఁ గమ్మపుప్పొడినిప్పుకలుచల్లి
వెడవెడగా గాలిసుడిసె నేని
తేనియల్ గ్రోలి మత్తిలి గండుఁదుమ్మెద,
కెరలి జుమ్మంచు జంకించెనేని

గీ. బాడబజ్వాలికలతోడఁ గూడిమూడి
వచ్చి వెన్నెలతేటకార్చిచ్చు బలిసి
యిట్టలంబుగఁ బైఁజుట్టుముట్టెనేని
పాంథులక్కట! యేరితి బ్రతుకువారు! 80

వ. అని పలుకుచు నమ్మానవపతి, మానినీవిలాసాపహృతమానధనుండై,
మనోభవాధీనమానసుండగుచునుండె నంత నిచ్చట. 81

చ. వెడవెడజాఱునీవి, యరవీడినవెన్నెటిగొప్పు నెన్నెడం
దడఁబడుపాదపద్మములు, దారినకన్గవచూపు, తోరమై
బడిబడివెళ్ళునూర్పుగమి, పయ్యెద యొయ్యెన జాఱఁగా బయల్
పడుచనుగుబ్బలుం గలవిలాసినిచందముఁ జూచి, నెచ్చెలుల్. 82

చ. గుజగుజలాడ, వారిఁ గనుగోనల బిట్టదలించి క్రౌధవా
రిజముఖయో ర్తు చూచి, సతిప్రేమభరంబు మరల్పరాదు, బే
రజపులతాంతబాణుఁడు కరస్థితపల్లవఖడ్గధారచే
గజిబిజిచేసెనేని, మరికార్యము దప్పు నటంచు, గొబ్బునన్. 83

క. ఆరాజన్యపురంబును
బేరును వంశంబు నతనిపెంపును దెలియం
గోరి, వివేకిని యగున
వ్వారిజముఖి, తల్లతానివాసంబునకున్. 84

క. వచ్చి, తమకాంతిమతిపై
జెచ్చెర మరుఁడేసినట్టి చిచ్చఱకోలల్
తెచ్చినగతిఁ, జెంగలువలు
కచ్చు నృపాగ్రణికిఁ దెచ్చి, కానుకయిచ్చెన్. 85

ఉ. ఇచ్చి, తదీయమూర్తిఁ గని యెంతయు నచ్చెరువావహిల్లఁగా
మెచ్చి "కుమారమన్మథ!యమేయగుణాకర!నేఁడు క్రొత్తగా
నిచ్చటికేగుదేరఁ గతమెయ్యది? దేవరపేరు వేఁడ నా
కిచ్చ భయంబు పుట్టెడు; నహీనమహామహిమంబు చూచినఁ. 86

ఉ. ఇంతకుమున్ను లీలమెయి నిచ్చటికిం జనుదెంచి, సింధుభూ
కాంతునికూర్మిపట్టి యగు కాంతిమతీసతి నిన్నుఁ జూచి, య
త్యంతమనోనురాగదశ నాఱడిఁ బొందుచుఁ దావకీనవృ
త్తాంతమెఱుంగ నన్ను వసుధావర!నీకడకంపె వేడుకన్." 87

చ. అనిన నతండు లేతనగ వాననమందు నిగుర్వుఁ, గీరముం
గనుఁగొనినన్, మహీధవశిఖామణితో నదిపల్కె నేర్పునఁ
"మనుజకులాధినాథ! యొకమాఱొకయించుకమాత్రఁ నిన్నుఁ జూ
చినచిగురాకుఁబోఁడి తమిఁ జిక్కదొ!యప్పుడ నీకు దక్కదో? 88

చ. మనుకులదంత్ర!నీదుసుకుమారమనోహరమూర్తి చూచి యే
చినతమిఁ జిక్కిచిక్కె; నిజసీమకు నీవిటఁ బోకమున్న యి
వ్వనముననున్న వేళనె భవచ్చరితం బెఱుఁగం దలంచి తాఁ
బనిచిన దీవధూటి, నలబాలవివేకము మెచ్చఁ జెల్ల దే! 89

క. అలసింధుభూమిపాలక
తిలకాత్మజ, కెల్లవిధముఁ దేటపడంగాఁ
దెలిపి, యిటఁదోడితెచ్చెదఁ
బలుకులు వేయేల!నన్నుఁ బంపుకుమారా!" 90

వ. అనిన శుకవల్లభునకు, భూవల్లభుండిట్లనియె. 91

క. "నీకొలఁది నలువరాణికిఁ
గా కొరులకు నెట్లు తెలియఁగావలయు ననన్
లోకమున నెవ్విఁడైనను
నీకు నసాధ్యములు గలవె!నిర్మలహృదయా! 92

క. నినుఁ బాసి యెంటి నేనీ
వనమున నిలుపోపఁజాల, వనితామణికిఁ
మనల నెటిఁగించిరమ్మి!
యనఘా! కనుఁ జెప్ప వేయునంతటిలోనఁ."

ఉత్సాహ

అనుచుఁ బల్కఁ, జిల్కఁ జేని నవనినాథవర్యుఁడ
వ్వనితచేతికిచ్చి, "కీరవరుఁడు మంజులోక్తి మీ
యనుఁగుబోటితోడఁ జెప్పు నడుగఁబడ్డపద్ధతుల్
చను"మటన్న సంభ్రమించి, జలజనేత్ర పోవుడున్. 94

ఉ. అంతకుమున్న కాంతిమతి యాత్మపురంబునకేగి, యొక్కయే
కాంతవిహారసౌధమున నాత్మసభీజనులన్మొఱంగి సం
క్రాంతదృఢానురాగము నిగాఢముగా నిలుపోపక,మ్మహీ
కాంతు మనోజ్ఞరూపగుణగౌరవముల్ మదిలోఁ దలంపుచున్. 95

క. "తరుణులు తఱుములు పెట్టుచు
సరగునఁ దోఁతేరఁ దెలియఁజాలినమతిఁ, ద
త్పురమును బేరు నెఱిఁగినఁ
బరితాపము కొంత డిందుపడదే? నాకున్. 96

సీ, అక్కుమారకుని నింకొక్కమా రెదిరించి,
కన్నులారఁగఁ జూడఁగల్గునొక్కొ?
యారాజసర్వజ్ఞు నభిరామగుణములు,
వీనులు చల్లగా విందునొక్కొ?

యామానినీమన్మథాకారు బిగియారు
కౌగిట, నుండంగఁ గాంతునొక్కొ?
యామేరునగధీరుతో ముచ్చటలఁదీఱి,
సరససల్లాపంబు దొరకునొక్కొ?

గీ. యాకళాపూర్ణిమాచంద్రు, నాసమగ్ర
భోగదేవేంద్రు వరియించి, పొంది పొసఁగి
కొలఁదియిడరానికోర్కులఁ గలసిమెలసి,
నిలువఁ గల్గుట యది జన్మఫలముగాదె. 97

ఉ. అవ్వలనుండునో? కడచి యవ్విభుఁ డవ్వలికెందుఁ బోవునో?
యెవ్వరిఁ బంపుదుఁ దెలియ, హెచ్చినమచ్చిక పిచ్చలింపఁగా?
నెవ్విధి నిల్చుదాన? మదినెట్టుభరింపుదు? నివ్వటిల్లునీ
నెవ్వగ నెవ్వగం గడవనేరుతు! నెద్దియుపాయ మింకిటన్. 98

చ. చెలులకు నామనోరథము చెప్పిన నేమని గేలిఁబుత్తురో!
తలఁకెడు నామనంబుఁ గని తల్లియుఁ దండ్రియు బుద్ధి నేమిగాఁ
దలఁతురొ! రాజకన్యకలధర్మముగాదిది యంచు బంధువుల్
పలుచనగాఁగ జూతురొకొ!పాయపుఁగోరిక లేమిచేయుదున్." 99

చ. తలఁపున నాథునిం గలసి తానది నిక్కముగాఁ దలంచి మిం
చుల్క దులకించుమోవిపయి సోఁకినకెంపులు గప్పిపుచ్చె నె
చ్చెలి మఱువెట్టఁగాఁ దలఁచి, చిత్రగతాబ్జము మూర్కొనంగ ని
చ్చలు గుఱిచేయు. నవ్వికచసారసలోచన ప్రేమమేమనన్, 100

క. అమ్మాడిక్కు నేకతంబున
నుమ్మలికం బొగులుచున్న యువిదంగని, "యో
యమ్మ!యివి మిగులఁ గ్రొత్తలు
పొ;మ్మని వెఱఁగంది యపుడు బోఁటులు తమలోన్. 101

ఉ. "కంటిరె యమ్మలార! యవగాఢము దీనివియోగవహ్ని దా
ర్వింటఁ దొలంగి పోవలయుఁ గ్రేవకనన్ వలవంత లింక నే

వెంట భరింపవచ్చు? మనవీటి౯డిబుద్ధుల నేమిచెప్ప; న
ట్లొంటి వసించియున్న పతియూరును బేరు నెఱుంగ౯బోలదే! 102

ఉ. ఎచ్చటనుండివచ్చె నిపుడీమధుమాసము? వచ్చు౯గాక మా
కిచ్చ వనీవిహారమున కిప్పుడ యేటికి౯ బుట్టె౯? బుట్టె౯గా
కచ్చటికప్పుడన్నరవరాగ్రణి రా౯గత మేమి? యింతలో౯
బచ్చనివింటివా౯డొకనెపంబిడి కత్తులు నూరనేటికిఁ? 103

సీ. విరహపన్నగఫణావిహరణంబన, వేఁడి
యూర్పులఁ బయ్యెద యొయ్యఁగదల
ననురాగజలధిసంజనిత ఫేనచ్ఛాయ
లన, మేనివెలిచాయ లతిశయిల్ల
గాఢచింతాలతాకలికాకదంబకం
బన ఘర్మకణజాల మంకురింప
నురుమోహతిమిరఖద్యోతంబులనఁ, గాక
బెట్టకుంకుమలేర్చి పేఁటులెగయఁ

గీ. గుటిలకుంతలయున్న యిప్పటితెఱంగు
ప్రాణపదమైనమనకుఁ జెప్పంగ నేల?
చాల నట్టింటిపగయైనశంబరారి
యట్టివానికి మది దయపుట్టకున్నె!" 104

వ, అని చేరం జనుదెంచి. 105

సీ, "కలికిరాచిలుకఁ జెక్కిలినొక్కి యూఱార్చి,
ముద్దాడవేటికి ముద్దులాడి!
పసిఁడివీణియఁగూర్చి పంచమశ్రుతిమించ,
మ్రోయింపవేటికి మోహనాంగి!
నీలాలగప్పుపెన్నెఱికొప్పు నొప్పుగాఁ
గీల్కొల్పవేటికిఁ గేకియాన!

గొనబుగాఁదిలకంబుఁ గొనగోరఁదీర్చి, య
ద్ధమువూడవేటికిఁదలిరుఁబోఁడి!

గీ. ప్రొదిరాయంచ రమ్మని బుజ్జగించి
యాటనేర్పవదేటికే యంబుజాక్షి!
మారువేదనఁ దెరలెడివారిఁ దెగడు
నీకు నీరీతిఁ జెల్లునే నీలవేణి!" 106

క. అని పలికి కలికి తొయ్యలి
తమసంతాపంబు వాపఁదలఁచి, విసవిస
జని, బిసవిసరముఁ జిగురులు
ననలుం బుప్పొళ్ళుఁ దెచ్చి, నైపుణి మెఱయన్. 107

క. అజ్జలజపత్రనేత్రలు,
గొజ్జఁగినీరుప్పతిల్లఁ గులికినవిరిపూ
నెజ్జపయిఁ దార్చునప్పుడు
లజ్జావతి, వాడి యొరగులతయనఁ బరఁగెన్. 108

క. తరుణి నటఁదార్చి, పైపై
నరవిరులం గ్రుమ్మరించి రంగనలు; రతీ
శ్వరమధురధనుర్ని రద
కరకాకాంతములభంగిఁ గానంబడఁగన్. 109

సీ. చెంగావి గట్టె నెచ్చెలియోర్తు, మానంపు
రవి గ్రుంక నగుసాంధ్యరాగమనఁగఁ
గర్పూరరజమొకకాంత చల్లె, వియోగ
దహనమహాకీర్తిమహిమ యనఁగఁ
గలువలు కన్నుల కలఁది యొత్తె నొకర్తు.
ప్రాణవాయువులోనికడఁచెననఁగఁ
బొండుమల్లియ లొకపొలఁతి రాశిగఁ బోసె,
నంగజభూతోపహారమనఁగ

గీ. నబల కీర్తి శిరకృత్యము లొనర్ప
నంతకంతకు సంతాపమావహిల్ల,
జెలులు కనుఁగొని తమలోన నలబలంబు
లుడిగి నివ్వెఱగంద నందోర్తుచూచి. 110

సీ. "చిగురాకులే కత్తులగునేని, నింతకు
[22]దగరకోయిలనోరు దెగకయున్నె?
యలరుఁదేనియ వేఁడియగునేని, నింతకుఁ
గండుఁదుమ్మెదముక్కు కమలకున్నె?
యరవిరులే నిప్పులగునేని, వింతకుఁ
బూవిల్తునఱచేయి పొక్కకున్నె?
యసదుగాలియె వెట్టయగునేని, నింతకుఁ
గమలవనంబెల్ల గ్రాఁగకున్నె?

గీ. భామ! యేటికిఁ జిగురుకై వాడఁబాఱ
వనిత! యేటికిఁ దేనెపై వడియఁబాఱ
వెలఁది! యేటికి ననలకై వెల్లబాఱఁ
బొలఁతి! యేటికి సురటిగాడ్పులకుఁ బాఱ", 111

క. పెదపెదమాటల నిప్పగి
దిదొడ్డకలకలముగాఁగ, దేవేరియుఁ దా
నిది యెయ్యదియో చూడుము
పదమనుచుం, జేర సింధుపతి వచ్చుటయున్. 112

క. సిగ్గుపడి మేను వడఁకఁగ
దిగ్గునఁ బూసెజ్జడిగ్గి తెరమఱుఁగునకై
యగ్గురుకుచ వోవఁగఁ, జెలి
బెగ్గిల నద్దేవి చూచిప్రియము దలిర్పన్ 113

క. "ఇది యేమి తప్పుగా నిటు
బెదరెదరే! నాదుకూర్మిబిడ్డ తనమదిన్

---

22 గండుకోయిల

మదనునిఁ గోరిన రప్పిం
చెదఁ జెప్పుఁ" డటన్నఁ బ్రీతిఁ జెలఁగి లతాంగుల్. 114

సీ. "ఓయమ్మ! నేడు మేముత్సవాహ్వాయకేళి
కాననాంతరసీమ గౌరినోమఁ
జని, విహారంబులు సలిపి క్రమ్మఱీరా, ర
సాలవేదికపై విశాలనేత్రుఁ
డాజానుబాహుఁ డత్యంత మోహనమూర్తి
యొకరాజనందనుండొంటినుండ,
మనకాంతిమతి చూచి, మన్మథుఁడనుభ్రాంతి
నుల్లంబు దురపిల్ల నున్నయదియు

గీ. విన్నవించితి మంతయు వెఱపులేక
యింకమీఁదటఁ గర్తవ్య మెద్ది గలదు
దెలిసి బాలిక విభ్రాంతిఁ దీర్పుఁ"డనుచుఁ
జెలులు పలుకంగ నప్పుడచ్చెరువు దోఁప. 115

క. మతిశాలిరాజశేఖర
పతి యనిపినదివ్యరత్నపంజరశుకముఁ
జతురతఁ గైకొని, యప్పుడ,
చతురిక యేతెంచి రాజసమ్ముఖముగుటఁ. 116

గీ. తరుణిచేతికి నిచ్చుట తగవుగామి
నృపునిసన్నిధినిడి, "దేవ! నేఁడు నేను
వనవినోదంబునకుఁ బోయి వెనుక చిక్కి
రాఁగ, నొకచక్కఁ జక్కనిరాజసుతుఁడు. 117

క. మీరాజుసమ్ముఖంబున
నీరాజశుకోత్తమంబు నిడుమన, నిదియే
కారణమె యనుచుఁ దెచ్చితి
భూరమణవరేణ్య!" యనుచుఁ బొలఁతి తొలంగఁ. 118

క. చిలుక యపుడధిపుతోడన్
బలికెం, బంజరము వెడలి, భాషాలలనా
కలకలమంజీరధ్వని
గలకలనగఁదగినకలికికమ్మని పలుకుల్. 119

సీ. "శుభమస్తు! వైభవప్రభుగుణసంభవ
శ్లాఘాపరాభూతశక్ర!నీకు
భద్రమస్తు! సముద్రముద్రితక్ష్మాభరా
భరణకద్రూసుతప్రౌఢ!నీకు
విజయోస్తు! నిష్ఠురనిజభుజాసముదగ్ర
విక్రమక్రమకళావిజయ!నీకు
కల్యాణమస్తు! సత్కవిరాజసంకల్ప
కల్పనాకల్పనాకల్ప!నీకు

గీ. నాయురస్తు! తుషారనీహారహార
ధాళధళ్యప్రభామలధవళకీర్తి
సాంద్రచంద్రాతపక్లాంతశత్రురాజ!
విరహిణీలోకహృదయారవింద! నీకు. 120

శా. రామప్రాభవ!మైంధవాధిపకుమారా!సింధుభూపాల!న
న్నేమోకా మడిలోఁ దలంపకు, వచోహేవాకకాకోదర
స్వామి;న్నాకుఁ ద్రికాలవేదియని భాషాదేవి పేరిచ్చె;నా
రామారత్నము చేతిరాచిలుక నేర్పన్ నేర్చితిన్ సర్వముఁ. 121

శా. వాదింతున్ బహువేదశాస్త్రకలనావైయాత్యసంసిద్ధి న
వ్వేదవ్యాసులతోడనైన, మది సంవీక్షించి యెచ్చోటనేఁ
గాదన్నన్ మటినిర్వహింపఁగ నశక్యంబేని, కస్మద్వచ
శ్శ్రీదాంపత్యము నాక నాకయనుకో సిగ్గయ్యెడున్ భూవరా! 122

మ. ప్రకటశ్రీకరరాజశేఖరమహీపాలుండు ఘోరాసుర
ప్రకటధ్వంసనమాచరింపఁగ, నటన్ బ్రత్యక్షమై, చంద్రమ

శ్మకలో త్తంసవధూటి నన్నొసఁగె నా శౌర్యక్రియాశాలికిఁ
శుకమాత్రంబని నన్నుఁ జూడకు; బుధస్తోమైకచింతామణీ! 123

మ. అది యట్లుండఁగనిమ్ము! హేతిహతమత్తారాతిసంతీర్తిపా
రదశోభాకరదోఃప్రతాపశిఖరారజ్యద్విచిత్రక్రమా
స్పదుఁ, డావంచకనాధనందనుఁడు రక్షశ్శ్రీ లదంభోళి, యు
మ్మదిరాక్షీమకరాంకమూర్తి, గడు సన్మానించు నన్నిఁ నృపా! 124

మ. కదనక్షోణివిశంకటాసురవరగ్రామీణుదర్పంబు వా
ల్చి, దదీయంబగునాత్మదేశమున కక్షీణత్వరం బోవఁ, ద్రో
వ దరశ్రాంతిఁదదీయరథ్యములునిల్పన్ నేటికి న్నిల్చినాఁ,
డదె!నీకేళివనాంతసీమ"నన, రాజాశ్చర్యనిర్మగ్నుఁడై. 125

మ. తనదేవేరిమొగంబు చూచి, "యిదె కాంతా! కంటివే వింతలే
మని వర్ణింపఁగ వచ్చు? నిచ్చిలుక యూహాపుట్టి నిట్టాడునే!
మన మాశ్చర్యపయోనిధిన్మునిఁగె; నీమహాత్మ్య మేరితిఁగ
ల్గెనొ! మున్నేమితపంబు చేసెనొకొ! యీకీరంబు పెంపెట్టిదో! 126

మ. మనువంశాగ్రణి రాజశేఖరుఁడు సామాన్యుండుగాఁ; డిప్పు డే
జనియించోటికిఁ దోడితేవలయు నీసౌజన్యధన్యాత్మ. నీ
యనఘుం గీరవరేణ్యుఁ గాంతిమతికిమ్మా! వేడ్క సంధిల్ల" నం
చునృపాలుండు, మృదంగభేరిపటహస్తోమాతిసన్నాహుఁడై. 127

గీ. చని కనుంగొని యత్యంతవినయసంభ్ర
మంబులుప్పొంగ నాలింగనం బొనర్చి
హేమధన్వమహీపాలుఁడేని యింత
వేఱు సేయఁడుగా మమ్ము వీరవీర్య! 128

గీ. ఇట్లు చేరువకేతెంచి యిష్టబంధుఁ
డయిన ననుఁజూచి పోవునంతయునులేదె!"
యనుచు విహితానులాపంబులాడుసింధు
కువలయాధీశుప్రియముచేకొని యతండు. 129

శా. ఆరూఢిం బురరాజవీథి విభవాహంకారజంభారియై
రారా, నంతకుమున్ను కాంతిమతి యారాచిల్కయుండాను గే
లీరాజన్మణిసౌధమెక్కఁ, దమి, నాలీలావతీమన్మథా
కారక్షీనిధి రాజశేఖరమహీకాంతు, న్నిరీక్షింపఁగన్. 130

చ. చిలుకపురోహితుండగుచుఁ జెంగట నుండఁగ, సిగ్గుపెం దెరల్
దొలఁగఁగఁగ్రోచి, బంధుగతిఁ దోరపుఁగోర్కులు సందడింపఁగా
దలఁపు లతాంగికన్నమును తాన కనుంగవదోయిలించి చూ
పులఁ దలఁబ్రాలుపోసె నృపపుత్రునిపై, విరహాగ్నిసాక్షిగఁ 131

వ. అప్పుడారాజకీరంబు రాజముఖికిట్లనియె. 132

ఉ. "చేడియ! యీనృపాలకులశేఖరు సంతతదానశీలుఁ గొం
డాడఁగవేయినోళ్ళువలెనంచు పచించితి నప్పు, డిచ్చకం
బాడితినో, నిజంబ కొనియాడితినో! యిటఁ గన్నులారఁగాఁ
జూడుము! హేమధన్వనృపసూతిమనోహరరూపసంపదల్. 133

సీ. తలిరాకుఁబోఁడి! నీతపములు ఫలియించెఁ,
గడలేనిమమతలఁ గలయవమ్మ!
చంపకగంధి! నీసంకల్ప మీడేఱె,
నానందవార్ధి నోలాడవమ్మ!
పల్లవపాణి! నీభాగ్యంబు చేకూఱె,
మనసులోఁ దహతహల్మానవమ్మ!
పూర్ణేందువదన! నీపుణ్యంబు సమకూఱెఁ,
జిరవైభవోన్నతిఁ జెలఁగవమ్మ!

గీ. మాటలించేల సౌఖ్యసామ్రాజ్యమునకుఁ
గంబుకంధర! పట్టంబు గట్టవమ్మ!
పెనిమిటియు నీవు మచ్చిక ననఁగిపెనఁగి
మగువ! నామీఁదిపతుంబు మఱవకమ్మ! 134

ఉ. ఎక్కడిరాజరాజసుతుఁ, డెక్కడి నిర్జరరాజనందనుం,
డెక్కడియిందిరాతనయుఁ, డేలనుతింతురో! కాని లోకు, లీ
చక్కనిమానవేశ్వరునిచందము చూడరు సువ్వె! యొక్కనాఁ
డక్కఱతోడ వానిఁ గలయంగనునంగన భాగ్య మెట్టిదో!" 135

క. అని యపుడు రాజకీరము
వనితామణి నధికమధురవాగమృతాబ్ధిఁ
మునిఁగించె, నచటమైంధవ
జనపాలకనందనుండు, సంభ్రమపరుఁడై. 136

సీ. కనకపంజరశారికాకీరకిన్నర
ద్వంద్వకోలాహలోత్తాలరవము
మహురనిలోద్ధూతతుహినోదభస్త్రికా
పతదంబుకణగణప్లావితంబు
మర్దలౌఘధిమధిమధ్వానగతినట
త్కంజధృన్మండలీరఁజితంబు
జాలకాంతరలసచ్చందనాగరుధూప
సౌరభసంభారసంభృతంబు

గీ. లలితతోరణమాలికాలంకృతంబు
బహువితానవితానవిభాసితంబు
నైన నవరత్నకీలితహర్మ్య మొకటి
విడిదిగావించి, యవ్విభు విడియఁజేసి; 137

క. తననగరికరిగె; నపుడ
జ్జనపతినందనుఁడు, గేళిసౌధస్థలిపై
వనితామణిఁ దలపోయుచు
ననువేలధృఢానురాగుఁడై యుండుతఱిన్. 138

చ. పనివడి పద్మినిం బగలుఁ బై కొనియుండుట గాననీక వం
చన నటియించి, పశ్చిమదిశారమణిం గలయంగఁబోవుచో,

వనజహితుండు, మై తుడిచివై వఁగ రాలుపరాగపుంజమో
యనఁ గనుపట్టె, న స్తశిఖరాంతరసీమల సాంధ్యరాగముల్, 139

గీ. అపుడు చీఁకటి యల్లల నాక్రమించి
పార్థివాగ్రణి యనురామభద్రుమీఁదఁ
బొంచి యమ్మ్మలవాన నిండించె నపుడు
చిత్తసంభవుఁ డల యింద్రజిత్తనంగ 140

మ. జలజాతాహితమంత్రికాగ్రణి, కళాజాలాధ్యుఁడై, దీపికా
కలికాభీలవిషానలావిలతమఃకాలాహి మార్కొ, వియ
ల్లలనాదేహము తారకానికరలాలాబిందువై యుండ, వె
న్నెలమందుల్ పయిఁబూసి తేర్చెనఁగాన్పించెం బ్రసన్నద్యుతిన్ 141

వ. మఱియు నంతకంతకుఁ జెన్నుమిగుల వెన్నెలమున్నీరు బెట్టునిట్ట
వొడిచినందొట్టిపట్టపగలింటిచందంబున నందంబై కనుపట్టెనప్పుడుప్ప
తిల్లువిరహపరితాపంబులఁ జీకాకులగుచుం దెగి ఘనశోకంబులగు చక్రవా
కంబులును, నరవిరిసి. నెఱసి చెంగలించుచెంగల్వవిరులకచ్చుల మెచ్చుల
క్రొత్తనెత్తావిమొత్తంబులనెత్తుకొని హత్తుకొని మెత్తమెత్తనం దిరుగు
జిలిబిలివలికరువలిబలంబులును, నిండునెలమగండు గండుమెఱసి
యేతేరఁ దేటిచూచినతొగమగువవిరులనిగనిగనిగుడంజూపుఁజాలనంజాలి
యందంద యందలిమధురమధురసకణవిసరంబులెసక మెసఁగం గ్రోలి
మైమఱచి తఱుచుపఱుచుతుమ్మెదకొదమపదుపులును, బుట్టపుటనికట్టికి
వెన్నెలతుటుములం జిటులఁ జంచూపుటంబులం గమిచి సముచితోప
లాలనంబునం దెచ్చియిచ్చి తమతమగరితలుగరితాల్వ నెఱతనంబున నటి
యించి హృత్తటంబునం బొడమిన చిటపొటలువో ఘటియించు చంచ
చ్చకోరవిటపటలంబులును, గరంగి తరంగితంబగుచుం బొంగి తురంగాం
కోపలసలిలంబులంబాఱు నేఱుల ఘుమఘుమధ్వానంబులును, నిజకాము
కుల చక్కటికింబిక్కటిలునక్కఱి జిక్కఁ చనుచక్కనిచ్చందనగంధుల
యందియలసందడియును, గుసుమకోదండచండశరకోదండదండితల్లగుచు

దండియలుమీటుచుం బాడు చేడియలకలకలంబులును, దండోపతండంబు
లగురుచికాండంబుల మెండుకొను వెండిపళ్ళెరంబులొండొండనిండఁ
బుండ్రేఁకుఖండశర్కరాఖండఘీరపూరఁబులు నించి యించుపిలుకాని
మామకుఁ బ్రేమనర్పించుకన్నియల తిన్ననియెలుంగుల యలబలంబులును
నై, విజృంభించ, పంచశరశరసంచయవంచితధైర్యుండగుచు నమ్మ
హీవల్లభుండాయల్లకభరంబున నుల్లంబు పెల్లగిలం దురపిల్లుచుండె.
అంతఁ గాంతిమతియును నత్యంతసంతాపితాంతరంగ యగుచు, వగల
నొగులం, దగుసఖులకొప్పగించి, యచ్చిలుకఁజేఁడు నరపతిచందం
బరయ రయంబుననేతెంచిన. 142

క. రాచకొమరుండు ముద్దుల
రాచిలుకం జూచి పలికె "రసవద్వికస
ద్వాచాలమధురమధురిమ
మోచాఫలసార!నాకు ముచ్చటదీఱన్ 143

క. క్షితిపాలకుఁడేమనియెం?
జతురిక యేమనియె? నితరసఖులేమని? రా
సతిమణి దానేమనియెను?
మతిశాలీ! వేగఁ జెప్పుమా" యన నదియున్ 144

సీ. "మనుజేంద్ర!యలకేళివనములో మీరంపఁ,
బనివిని శుద్ధాంతమునకుఁ బోయి
తిమి; యట మున్న కాంతిమతికుమారికా
విరహాపలాపముల్ వినీ,నృపాలుఁ
డును దేవియును వచ్చి తనయచక్కటినుండఁ,
జతురిక నన్నుంచె నతని యెదుట;
నేను దేవరరాకయెఱిఁగింప, హర్షించి
యచటికి వేవేగ నరుగుదెంచె

గీ. నిటఁ గుమారిక నన్ను నెంతేని గార
వించి భవదీయగుణములాలించి పంచ

శరశరాహతిఁ గుంది దుర్భరవియోగ
భరము భరియింపఁ జాలక తెరలిపడుచు 145

సీ. తుదగోళ్ళఁ బలుమాఱుఁ ద్రుంచిప్రోవులుగాఁగ
వేసినచివురులవిధముచూచి
పెట్టుగాఁ దెట్టువల్ గట్టి, పైపై సెకల్
చల్లునిట్టూర్పులజాడచూచి
మిక్కుటంబుగ మేనియుక్కచేఁగమిలిన
విరిపూవుసజ్జలకరణి చూచి
కడలేనికాటుకకన్నీటికాలువ,
మడువులుకట్టినవడువుచూచి

గీ. కనలి యూరకపనిలేనిపనికినైన
నింతమొకమోటలేక యయ్యిందువదన
ప్రాణసఖఁ బల్కుపల్కులపగిది చూచి
నాకు వెఱఁగయ్యె నప్పుడోనరవరేణ్య! 146

ఉ. సందియమింతలేదు; పెలుచన్ నునుమొగ్గలమిట్టకోలలన్
గందనకాయనేసె సుమకార్ముకుఁ, డేమనిచెప్పువాఁడ? నే
నందుకుఁదోడు, వీఁడె, హరిణాంకుఁడహంకృతిఁ జూపఁజొచ్చె, నిం
కందరళాక్షిచందమెటుగాఁగలదో!" యనుడుందలంకుచున్ 147

వ. అప్పుడప్పుడమిజేఁడు విరహభరంబుభరియింపలేక రాకానిశాకరు
నుద్దేశించి 148

సీ. "కఱచుకొంచును ద్రావఁగాఁ గాచియున్నారు
సురలు, నీయెమ్మెలు ద్రుక్కవేల?
ఋయము నానాఁట నగ్గలముగానీఁకనొత్తి
వచ్చు, నీజాడలువదలవేల?
పెనుపాఁపపగవాఁడు పెడతలగండఁడై
యుండ, నీమదవృత్తి యుడుగవేల?

యదియునుగాక మేనంతయుఁగాళిప
ట్టుకరాఁదొడంగె, నీవిక్రియేల?

గీ. యదిరిపాటుగ నుదధిలో నౌరవహ్ని
నెపుడుపడియెదవోకాని యెఱుఁగరాదు
చెప్పినట్టులువచ్చునే సితమయూఖ!
యేలత్రుళ్ళెద? విదియేనిమేలు నీకు 149

ఉ. రాహువఁగాను; నిన్నఅగరాచిన శూరుఁడఁగాను; నీతను?
ద్రోహముచేసినట్టియలరోహిణితండ్రినిగాను; దజ్జగ
న్మోహిని, నీలనీలకచ. ముద్దులచక్కెరబొమ్మఁ. గూర్పక
య్యో!హరిణాంక!తావకమయూఖముఖంబుల నేచనేటికిన్? 150

వ. అని యిత్తెఱంగునఁ జిత్తంబున నెత్తినతత్తఱంబునం దరంబుగానిఁ
విరహభరంబు భరియింపఁజాలక పొరలునంత

గీ. రతిపశరవర్ష నాశనక్రమలు దెలుప
మొనసి దీపించునలయింద్రధనువనంగఁ
బ్రాచి యుమిసినతాంబాలరసమునంగ
నుదయరాగంబు మెల్లన నుప్పతిల్లె 142

గీ. తనదు మనుమని పెండ్లికెంతయును వేడ్క
నఖలదిజ్నాగపతుల రమ్మనుచు శోభ
నాఋతంబులు వెట్టిన యట్టికరణిఁ
గమలబాంధవదీప్తి నల్గడల నెఱసె 153

సీ. అటుప్రభాతంబైన, నావంచకాధీశు
తనయుండు కాలకృత్యములుదీర్చి
వసియింప,నటసింధువసుధేశుఁడును మంత్రి
హితపురోహితులసమ్మతివహించి
యాహైమధన్వికి నాత్మతనూజాతఁ
గాంతిమతీకన్యకాలలామఁ

గల్యాణమొనరింపఁ గాతుకోన్నిద్రమా
నసుఁడై, దిగంతభూనాథతతికిఁ

గీ. బ్రీతి శుభలేఖ లనిచి రప్పించి మిగుల
మంచిలగ్నంబుగా నిశ్చయించి పురమ
లంకరింపంగ నియమించె లవణవార్ధి
వేష్టితాశేషమహిజనుల్వెఱఁగుపడఁగ 154

సీ ఏవీధిఁ జూచిన, నిందుబింబాననా
లాలితలాస్యకోలాహలంబు
లేవాడఁ జూచిన, నితరేతరాలాప
సమ్మర్ధబధిరితాశాముఖంబు
లేచాయఁ జూచిన, లోచనోత్సవకర
ప్రత్యగ్రమౌక్తికరంగవల్లు
లేచక్కిఁ జూచిన, నిద్ధపుణ్యాంగనా
కల్పితకల్యాణగానఫణితు

గీ. లెచటఁజూచిన నవరత్ననిచయరచిత
వివిధతోరణమౌళికావిలసనంబు
లెందుఁజూచిన జగదభినందితాచ్ఛ
బహువితానంబు లప్పురిఁబరిఢవిల్లె 155

క. చనుదెంచుపౌరయాత్రిక
జనులకుఁ, బర్ణానిలంబుచలువలకనఁగా
మునువాకిళ్ళను బెట్టిరి
కనకమయోదగ్రకదళికాస్తంభములన్ 156

గీ. అపుడు శుద్ధాంతమునకేగి యవనివిభుఁడు
"శుభముహూర్తంబు నేఁడు; మెచ్చులవరుండు
గలిగె మనకాంతిమతిభాగ్యగౌరవమున;
నేల యాలస్యమింకఁ బూర్ణేందువదన! 157

క. సైరంధ్రుల బిలిపించి కు
మారిక గైసేయఁబంపుమా!"యన, నద్దే
వేరియు భూపతియనుమతి
వారి నియోగింప, నధికవైభవ మొదవన్ 158

సీ. అంగనామణికిని, సంపంగినూనియ
శిరసంపె నొక్కరాజీవగంధి
పువ్వుఁబోఁడికి గోళ్ళ దువ్వి గంధామల
కమువెట్టె నొక్కసైకతనితంబ
కలకంఠకంఠికిఁ గమ్మపన్నీట మ
జ్జనమార్చె నొక్కవిశాలనేత్ర
యలినీలవే ణికి వెలిపట్టుపావడఁ
దడియొత్తె నొక్కవేదండగమన

గీ. మానవతికోర్తు చెంగావిమడుగగట్టె;
గురుపయోధరకోర్తు క్రొవ్విరులు దుఱిమెఁ;
గీరభాషిణికోర్తు కస్తూరి యలఁదెఁ;
జంద్రముఖికోర్తు రత్నభూషణములిడియె. 159

క. ఆనలినాక్షి యప్పుడు
నానావిధరత్నభూషణచ్ఛవిలోన
గానంగఁబడియెఁ, గింశుక
సూనాంతరభాసమానశుకియోయనఁగన. 160

శా. ఆరీతిన్ సఖులొయ్యఁదేర వసుధాధ్యక్షుండు తానక్కుమా
రిరత్నం బతిమానమానసదృఢప్రీతిన్ విలోకించి, పై
పై రోమాంచము లంగకంచుకములై ప్రాపింపఁ, బెల్లుబ్బె జం
భారాతిప్రథమానవైభవకళాహంకారసంక్రాంతుఁడై 161

గీ. అధికసంభ్రమయుక్తిఁ గల్యాణవేది
కై కుమారికఁ దెమ్మని యచటికపుడు

రాజశేఖరమేదినీరమణవరుని
రా నియోగింప వైభవప్రాభవముల. 162

సీ. తమరుధమామికాతమ్మటకాహళ
పటహభేరీమహార్భటులు మెఱయ
సకలపుణ్యాంగనాజనసమర్పితలాజ
జాలంబు నక్షత్రసమితిఁ దెగడ
భూపాలవర్గంబు తోపుత్రోపాడుచు
గిరికొని రెండుపక్కయల నడవ
నవనీసురశ్రేణి యాశీర్వచఃప్రౌఢి
కోలాహలంబు దిక్కులఁ జెలంగ.

గీ. జయ!విశంకటరిపుశైలజంభభేది!
జయ!త్రిలోకవిసారితసారకీర్తి!
జయ!విలాసవతీపుష్పచాప!యనుచు
వందిజనవాక్యవైఖరి క్రందుకొనఁగ. 163

గీ. నగరిమొగసాలకేగె నానరవరుండు
తాను బంధులు సంభృతోత్సాహుఁడగుచు
నెదురుగావచ్చి తోడ్కొని యేగుదేరఁ
జూపఱకుఁ జూడ్కులింపులఁ జూఱలాడె. 164

ఉ. ఈ జగమెల్ల నేలుమని యేర్పడఁ జూపెడుభంగిఁ, బంకజ
శ్రీజనయిత్రులైన తమచేతులఁ గీల్కొనఁజేసి, రత్నవి
ర్భాజహిరణ్యపాత్రికలు పల్మఱుఁ ద్రిప్పుచు నొయ్యనొయ్య నీ
రాజనముల్ ఘటించి, రుడురాజనిభాస్యలు. హైమధ్వనికిఁ. 165

గీ. చవులుగొలిపెడు ముత్యాలచవికెలోనఁ
బసనివెలిపట్టు నిండారఁ బఱిచినట్టి
కనకపీఠికఁ జూపి, యజ్ఞనవిభుండు
చేరి వినయముసేయ నాసీనుఁడయ్యె. 166

శా. డాకేలన్నిజకన్యకామణుల కంత్రశ్రేణి గీలించి, వీ
ఱాకంజాతము లాత్మపాదనఖరేఖందార్చి, సంగీతవి
ద్యాకౌశల్యము గానరా మదికి నాహ్లాదంబు సంధిల్ల, గౌ
రీకల్యాణముపాడిరప్పుడు, పురంధ్రీరత్నముల్ వేడుకన్. 167

శా. రారమ్మంచుఁ గడంగి వృద్ధవనితల్ ప్రార్థింప, లజ్జానతా
కారం బంగజసజ్యకార్ముకగతిం గల్పింప నేతెంచి త
న్నీరేజాక్షి కెలంకులం బసిఁడిగిండిం దోయములోయ్వీయ, న
గ్గారాపల్లుని పాదముల్గడిగె, నయ్యబ్రమోదాత్ముఁడై. 168

ఉ. కల్పితశోభనోచితసుకర్ములు, గౌతమగార్గ్యగాలవా
నల్పమహానుభావమతు; లాత్మపురోహితు, లాగమోక్తసం
కల్పముచెప్ప, భూధవశిఖామణి కన్యక ధారవోసె నా
కల్పవిశాలకీర్తికి, జగజ్జనసంస్తవనీయమూర్తికిన్. 169

క. వరనిశ్చలశౌర్యాంబుధి
తెరయెత్తినరీతి నడుమఁదెరయెత్తిరి య
న్నరపతియు ముద్దుపట్టిం
దెరమఱుఁగునకపుడు తోడితే నియమింపన్. 170

సీ. ప్రాణసఖీరత్న, మరగొను గెంగేలఁ
దొడికి, యెయ్యొయ్యన నడువుమనఁగ
నుడిగంపుఁదొయ్యలియోర్తు, పావడఁదెచ్చి,
చిఱుతనెమ్మోముఁజేఁజెమట తుడువ
సందడి జడియుచు నిందుబింబాస్యలు,
కైదండలిచ్చుచుఁ గ్రందుకొనఁగ
మందయానంబున నుసలుటఁ బదనఖ
లాక్షారసాంకముల్ల క్ష్యముగనఁ

గీ. గ్రేళ్ళుదాఁటెడుచూపులు క్రిందనిండఁ
గ్రమ్మి నీలాలనెలకట్టుకరణి మెఱయ

గాఢలజ్జాభయంబులు గడలుకొనఁగఁ
జంద్రముఖి వచ్చెఁ బెండిలిచవికెకడకు; 171

క. మంగళసూత్రముఁ గట్టెఁ గు
రంగవిలోచనకు నపుడు రాజోత్తంసుం,
డంగాంగయోగసౌఖ్యత
రంగితపులకాంకురాళి, గ్రందుకొనంగన్. 172

మ. చెలులెల్లం గరపాణిపద్మమున నా చిన్నారిపొన్నారి ము
ద్దులరాచూలి వలగ్నముందొడికి తోడ్తోనె త్తఁగా, ముత్యపుం
దలఁబ్రాలోసె వసుంధరాధిపకులో త్తంసంబుపై, నమ్మహీ
తలనాథుండు నొనర్చె నట్టి పగిదిం, దత్ప్రక్రియాకేళికల్. 173

గీ. అట్లువైవాహికార్హ్యకృత్యములు నెఱపి
నాలుగవనాఁడు సకలబాంధవులుఁ జెలఁగ
నరవరాగ్రణిలోచనానందమొదవ
నాగవల్లియొనర్చుటకై గుఱింప. 174

సీ. ఆణిముత్తియము లొక్కింతగా నొండొండ
మేలేర్చి, నిండారఁగీలుకొలిపి
వెలలేని భ్రాఁతిపచ్చలు దెచ్చి దోయిళ్ళ
నించి, దట్టంబుగా నెఱపి నెఱపి
నెఱరంగుగలజాతినీలాలు గుదిగ్రుచ్చి,
యేనుఁగల్ చక్కఁగా నేర్పఱించి
యెదిరికన్గొనరానిమదురుఁగెంపులువోసి,
తెఱపిఁగానికలు క్రిక్కిఱియఁబఱపి

గీ. కలయఁ జొక్కింపు గోమేధికములు నిలిపి
పంచెవన్నెలమ్రుగ్గులు పరిఢవిల్ల
భ్రూలుదీర్చిరి, చూడ్కికింపులు ఘటింపఁ
బడఁతు లత్తఱిఁ బసిఁడికీల్పరితిమలనఁగ; 175

గీ. కన్నెచనుదోయి చుట్టముల్ గానఁ బ్రీతి
వానికల్యాణవేళ కై వచ్చినట్టి
తమ్మిపూమొగ్గలోయనఁ దార్చిరచటఁ
బూజకుండలు తారకారాజముఖులు; 176

గీ. సింధుభూపాలుసతీకర్తి చెలఁగి, పద్మ
జాండ మవ్వలనీరీతి నావరించుఁ
జూడుఁడనుమాడ్కిఁ, దెల్లనిసున్నమలఁది
మానవతులందు నిలిపిరై రేనికడవ. 177

క. ప్రోలనియెడు కాసారము
లో, లీలఁ జెలఁగుచెంగలువమొగ్గలనఁ
జాల బహుదీపకళికలు
చాలుగ ముట్టించి రంతఁ,జంద్రనిభాస్యల్. 178

వ. మఱియుఁ దత్తదుచితకృత్యంబులు మసలక ముసలిమ త్తెదువలొనరింప, నిలింపవిభునిభుండగునమ్మహీకాంతుండు కాంతిమతీకన్యకాసమేతంబుగా హోమక్రియాకలాపంబులు, బహువిధసల్లాపంబులు, గురుజనవందనంబులు, గులదేవతాసందర్శనంబులు, నాదియగు మంగళకరణీయంబులు గావించి. 179

చ. మగువయునాథుఁడుం బసిఁడిమంచముపై వసియించి, యొండొరుల్
మొగములువంచి యోరసిలి, ముంచినసిగ్గులఁ గన్నుగోనలఁ
నగవుదొలంక, విప్రమిథునంబుల కిచ్చిరి. దివ్యవాసనల్
బుగులుకొనంగఁ జేసినయపూర్వమనోహరవీటికావళుల్. 180

ఉ. అంతటఁ, బౌరయాత్రికధరావరముఖ్యులు, వారివారిక
త్యంతదృఢానురక్తి వివిధాభరణంబులు, చిత్రవర్ణసం
క్రాంతవినూతనాంబరనికాయములుం జదివించి, రాత్మనిం
తంతనరానివైభవమహావిభవంబులు సందడింపఁగఁ. 181

ఉ. మామ యమేయమార్గణసమాజమధువ్రతపుష్పవాటికా
సీమ యొసంగె నల్లునకు సింధుసబంధుతటాకబంధుర
గ్రామము, లాతిథేయపురరాజరమావిభవప్రయుక్తసం
గ్రామము, లిష్టబాంధవనికాయము నివ్వెఱగంది చూడఁగన్ 182

ఉ. మాకులభర్త శీతరుచి మాన్యుఁడు, తావకకీర్తి యేతదు
త్సేకమడంచెఁ జెల్లదనిచేతికి నప్పనచేసెనోయనన్
గోకకుచామనోభవునకున్ దనయల్లునకిచ్చె సింధుధా
త్రీకమనాగ్రగణ్యుఁ, డొకదీపితవజ్రసుగంధపేటికన్. 183

ఉ. దీని రణోర్వినెక్కు నరదేవుఁడజేయుఁ, డతండు గట్టులా
యాన, ననేకవర్ణజవనాశ్వము, లాతఁడు కన్గొనుంద్రిలో
కీనుతకీర్తులంచు, నృపకేసరి యల్లునకిచ్చె నొక్కతే
జీ, నపరంజి వ్రాఁతపనిచిత్తరుపల్లము లుల్లసిల్లఁగన్. 184

క. పసుపునకిచ్చెఁ గుమారికి
వసుధాతలభర్త, శాలివరవర్ణితముల్
కుసుమశరచాపరుచిభూ
లసమానము లూళ్ళు, నూఱు, లర్ఘ్యముగాఁగన్. 185

ఉ. మాళవగౌళచోళకురుమాగధులంపినవారిలోన, సం
శీలలఁగా, వివేకవరసీమలఁగా, రమణీయరూపరే
ఖాలలితాంగవల్లరులఁగా. నుడిగంబున కేర్పటించి, భూ
పాలకుఁడిచ్చె నూఱుపురబాలికలం దనయాలలామకున్. 186

ఉ ప్రాణముప్రాణమైనతనయామణినప్పుడుచేరఁబిల్చి, యిం
ద్రాణికినైనఁ, గంసరిపురాణికినైన, గణింపరానిక
ట్టాణిమెఱుంగుముత్తియ, మనర్ఘ్యము ముంగరకిచ్చెఁ దల్లియ
క్షీణరుచిప్రకాండములుచెంగట వెన్నెల గాయుచుండఁగన్. 187

సీ ధగధగాయతరుచిస్థగితనానారత్న,
సముదీర్ణ రత్నభూషణచయంబు
చిత్రవర్ణాంబరశ్రేణీసమంచిత,
కాంచనమయ పేటికావ్రజంబు
ఘనసారకస్తూరికాసంకమదపూర్ణ,
రారజ్యమానకరండసమితి
ప్రచురముక్తాఫలవ్రాతకళాచికా,
కర్కరికాసముత్కరము మటియు

గీ. వివిధవస్తువితానంబు వేఱువేఱ
కంచుకీసంచయంబులు గొంచురాఁగ
సింధుభూభర్తదేవేరి చిఱుతముద్దుఁ
గూఁతునకునిచ్చెఁగోర్కలుగొనలుసాగ. 188

క. కంజాతరాగమణిగణ
సంజాతరుచిచ్ఛటావిశంకటమగుచుఁ
రంజిలుపంజర, మాన్యప
కుంజరుఁ, డారామచిలుకకుం దగనిచ్చెన్. 189

గీ. అట్లు మామయు నల్లుండు నఖిలబంధు
సమితియును నీడుజోడాడి సంభ్రమింప,
నంతనరుణోదయంబయ్యె; నప్పుడుచిత
కృత్యములు దీర్చి సింధురాత్రీవిభుండు. 190

సీ. సకలవస్త్రావాతసంపూరితములైన,
కాంచనమయశతాంగములు నూఱు
ఖచితనానారత్నకంకణంబులతోడఁ,
గొమరారుదంతావళములు వేయి
కరువలికన్న వెగ్గలముగామున్నాడఁ,
జాలిన దొడ్డతేజీలు లక్ష

విక్రమార్కునికంచె విక్రమోన్నతి గల,
పరమాప్తులై నసన్నటులు కోటి

గీ. వేఱువేఱుగ నేర్చి పృథ్వీతలేంద్ర
తిలకమగు నాత్మజామాతఁ గొలిచి వెంటఁ
బోవ నియమించి శుద్ధాంతమునకుఁ బోయి
తనదుదేవేరితోడ నిట్లనియె నృపుఁడు. 191

క. "మనముద్దుపట్టి భాగ్యం
బనితరసులభంబు, మోహనాంగుఁడు; విద్యా
ఘనపదవి; నమ్రనానా
జనపతి;వరుఁడయ్యె, నిఁక విచారంబేలా! 192

గీ. తగినబుద్ధులుచెప్పి యీతలిరుఁబోఁడి
ననుఁగుఁ గూఁతును నిప్పుడ యనుపు"మనిన
విన్నఁదనమున వసివాడి కన్నుగొనల
నీరు దొలఁకంగఁబలికె, నన్నీరజాక్షి; 193

క. "నాచిన్నిముద్దుఁగూఁతుర!
నాచక్కనితల్లి కాన! నామదిలోనన్
దోఁచినచింతల నెచ్చో
నేచంపమునం జరింతునే యిటఁజెపుమా! 194

క. కులమును, రూపును, బ్రాయము,
నిలువడియును, గలుగువరున 'కేఁగంటి నినున్
దొలి నానోచిననోములు
ఫలియించెం జూవె! వికచపంకజనేత్రా! 195

క. ఏతెఱఁగున నీమగనిం
బ్రీతునిఁ జేసెదవొ! యెట్లు పెంపొందెదవో!
నీతెలివియు, నీకడఁకయుఁ,
జూతముగా! యింక నోవిశుద్ధచరిత్రా! 196

క. నీమగఁడు భానువంశో
ద్దాముఁడు, నినుఁగన్నతండ్రి ధవళాంశకుల
గ్రామణి. యాయుభయకుల
శ్రీమించఁగ జేయ, నీకచెల్లుఁ గుమారీ! 197

క. మూసినముత్యమవై, కడు
వాసియువన్నెయును గలిగి, వరుఁడొననఁగా
నీసకలబంధుకోటికిఁ
బూసలలోదారమగుచుఁ, బొసఁగ మెలఁగుమీ! 198

క. నీవేమియుఁ బతివేఁడకు!
దా వేడుక విభుఁడొసంగఁ దగదనకు! నినుఁ
రావింపఁ దడవు సేయకు!
రావింపమి నటకుఁ జేరరాకు! లతాంగీ! 199

క. మగఁడెవ్వరిఁ దెగఁజూచుఁ
మగఁడెవ్వరిఁబ్రోచు, నట్టిమాడ్కిన సతికిఁ
దగునడవ; దేవుఁడనఁగా
మగఁడనఁగా వేఱుగలదె! మదగజగమనా! 200

సీ. నామాఱుగా నింతనాఁటనుండియు నిన్ను,
వేడ్కఁ బెంచినదాది వెంటరాఁగ
సకలవిద్యావిచక్షణత మించినయట్టి,
బ్రాణముప్రాణమై పాయక నినుఁగూడి,
విహరించుచతురిక వెంటరాఁగఁ
హితవు విశ్వాసంబునెఱుకయుఁగలిగిన,
వృద్ధకంచుకు లెల్ల వెంటరాఁగ

గీ. సంతతాక్షీణదాక్షిణ్యజన్మభూమి
ప్రియకళాలాపఘన నీదువెండ్లికర్త

యీశుకీభ ర్తవెంటరా, నిప్పుడింత
దలఁకనేటికి నీవు నాతల్లి కాన! 201

సీ కాళాంజిపట్టు నికళికి గౌడేంద్రనం
దన, దీని లెస్సగా మనుపవమ్మ!
కుంచియవై చు నీకోమలి చోళక
న్యక, దీని మన్నన నడపవమ్మ!
యడపంబుపట్టునీయతివ మాళవరాజ
సుత, దీనిఁ జులుకగా జూడకమ్మ!
[23]శావడపట్టునీపడఁతి మాగధుకూర్మి
బిడ్డ, దీనిఁదలంచి పెంచవమ్మ!

గీ. పసఁడిపావలువెట్టు నీపద్మగంధి
పాండ్యభూపాలు గారాపుఁబట్టి, దీని
ననుదినంబును నరసి కాపాడవమ్మ!
వలయువారలఁ దగురీతి మెలఁపవమ్మ!'' 202

వ. అని యద్దేవేరి తనముద్దుఁగూఁతునకుఁ బెద్దయు బుద్ధులుచెప్పి యచ్చిలుక
ఱేనిమొగంబై యిట్లనియె. 203

క. "మాపాలి భాగ్యదేవత
వై, పేరునుఁ బెంపుఁ గలమహారాజునకున్
జేపట్టి పెండ్లిచేసితి
వీ పాపను, నిన్ను వేఱ యేటికిఁ బొగడన్! 204

సీ. అనునయోక్తులు వల్క, యత్తమామల కాత్మఁ
గృపపుట్టఁగా నప్పగింపవయ్య!
సకలబంధులకు;వంచనలేక వినయంబు
సేయఁ, బల్మాలు బుద్ధిచెప్పవయ్య!
పతిచిత్తవృత్తిరా. సతతంబు విసువక,
సేవయొనర్ప శాసింపవయ్య!

---

23 ధౌతవస్త్రము.

కినిసి యెవ్వారి నొచ్చిననోర౮ బల్క౮క
యోర్పుమైనుండంగ నేర్పవయ్య!

గీ. యెల్ల వారలవలె నేమి యెఱుఁగదయ్య !
నిన్నియును నేల!నీచేతి కిచ్చినార
మీకుమారిక; మీచిత్త మెట్లువచ్చు
నట్టి జాడలఁ గరుణఁ జేపట్టవయ్య!" 205

క. పలుమఱు నీగతి నవ్విభు
కులపాలిక బుద్ధిచెప్పి, గుణశాలికి న
ప్పలుకుం దేనియకొలఁకుకుఁ
జిలుకకుఁ దగనప్పగించెఁ, జిలుకలకొలికిఁ 206

క. అప్పుడు శుకకులచంద్రుం
డప్పాటలగంధి కనియె, "నంగన!ప్రియముల్
చొప్పడఁ బెఱవారికిబలెఁ
జెప్పెదు; నన్నింత వేఱుసేయందగునే? 207

క. కుటిలాలక!నీ పుత్రిక
యఁట! యెటగుణశీలగరిమ మడుగఁగ నేలా?
నిటలాంబకకులకాంతకు
నిటువంటి వివేక మేది? యే నెఱుఁగుదుఁగా! 208

గీ. ఉభయవంశపవిత్ర యీయాయుత్పలాక్షి
సర్వలక్షణ సౌభాగ్య జన్మసీమ
యీకుమారిక చొచ్చినయిల్లుఁ, బుట్టి
నిల్లు, నెంతయు వన్నెకు నెక్కకున్నె? 209

క. పతియునుఁ దానన్యోన్య
స్థితి నిప్పుడ కలసిమెలసి చెలులన్ మనలన్
మతినొకనాఁడుఁ దలంపదు
గతమిచ్చెద దీనికేమి కంజాతముఖీ! 210

క. పట్టానదేవివై. నీ
పట్టి, జగంబెల్ల మెచ్చఁ బతిమానస మి
ట్టట్టు చననీక యన్నిట
జట్టిగొనన్నేర్చు; నీవు సంతసమందన్. 211

క. దినముల వెంబడి నన్నియు
పినియెద; వేటికి వచింప? విభునింటికి నీ
మనసునఁ దెలివిడికూఁతుం
బనుపు"మనం, దనయఁ జూచి పై కొనుమమతన్ 212

గీ. అమ్మహారాజుదేవి యిట్లనియె మగుడ
"నన్ను నున్నించి యీశుక నాథుపల్కు-
లేమిజవదాఁటకుండుమీ! యిదియ నీకుఁ
బరమమైనట్టి బుద్ధిపోఁ బద్మగంధి! 213

క. మనమున దయవుట్టఁగ నీ
పనిపాటలు విన్నవించుఁ బ్రాణేశున, కీ
యనఘుఁడకారణబంధుం"
డని తెలియంబలికి; గుండియదిగుల్లనఁగన్ 214

క. తలగ్రుచ్చి కొఁగిలించుచుఁ
దెలిగన్నులనీరుదుడిచి దీవించి,"నినున్
నలువది నాళ్ళకె, తోడనె
పిలిపించెద; నింతయేల బెగడకు తల్లీ!" 215

గీ. అనుచు నూరార్చి పదవప్మ్మయనుచుఁ దానుఁ
బ్రాణసఖులును గఞ్చ్యాంతరములు గడచి,
దిద్దివై చినయొకనూత్న దివ్యరత్న
ఖచితమగుపల్లకీమీఁదఁ, గన్నెనునిచి; 216

గీ. ఎట్టకేలకు నప్పుడయ్యింతియంతి
పురములోనికి వసివాడియరిగె మగిడి

మగిడి చూచుచు, నెంతయు మహిమ నిచటఁ
గంచుకులవాక్యవై ఖరి గ్రందుకొనఁగ 217

గీ. వల్లకీపాణిపల్లకి యల్లనల్లఁ
బురమువెల్వడ, సింధుభూవరుఁడు దాను
దండనాథులు సకలబాంధవులు వెంట
లీలమైనేగి రపుడతేజీలనెక్కి 218

సీ, ఆరీతినేగి మున్నఖిలసేనాసమే
తుఁడయివెలిని వీడువిడిసియున్న
మనువంశపతిఁ జేరఁజని, ముద్దుఁగూఁతును
నప్పగించి విచారమావహిల్ల
నొకభంగి నేగె నయ్యుర్వితలాధ్యక్షుఁ;
డిటపైమధన్వియుఁజటులపటహ
మురజమర్దలరావములు మిన్నుముట్టగఁ
గన్యకాసహితుఁడై కతిపయప్ర

గీ. యాణముల నాత్మపురిఁ జేరనరుగుదెంచి
యప్పుడవ్వార్తఁ దండ్రికిఁ జెప్పిపనుప
సమ్మదాంభోధి నోలాడి సకలబలము
నెదురుగాఁ బంచె నావంచకేశ్వరుండు 219

వ. ఇట్లు సకలసేనాసమన్వితుడగుచు నక్కమారపంచాననుం డకించిదంచిత కాంచన కదళికానికాయచ్ఛాయాజాయమానకాయమానగృహబహిర్భాగంబునుఁ, దరుణతరణిరోచిస్సమీచీనచీనాంబరవిరచితవితానప్రతానంబును, వసూవరవరసౌందర్య సందర్శన కుతూహలసముత్పతత్పక్ష్మలాక్షీకటాక్షవీక్షణావిలక్షితాక్షయాగరుధూపప్రదీపితగోపురంబునుఁబటు పటహపణవశక్కారావబధిరితాశావకాశముఖంబును, గనకరుచివిస్ఫు త్వరతత్పరాభియుక్తముక్తారంగవల్లికంబును, ఘుస్మృణకుసుమరసాలేపిత వితర్దికంబును, ఋక్షపునరుద్గ్రీవపారకులసంకులసంకుమదాంకితరాజ

మార్గంబును, లోహితవిహితాగ్రతోరణమాలికాశాలికలధౌతసౌధ
తలంబును, రంగత్కురంగలోచనాంగీకృతలాస్య ప్రశస్యమంగళసంగీత
ప్రసంగానుషంగమృదంగధిమధిమధ్వానతరంగితమంచికాసంచయంబును
నగుపురంబుప్రవేశించి, ముహుర్ముహురన్యోన్యాహూతకన్యకాజనలతికా
నికరకలితకుసుమసమాజభ్రాజ మానలాజాక్షతంబులవలనం బురంధ్రీ
విరచ్యమాననీరాజనవిరాజమానంబులవలనం, బృథ్వీసురాశీర్వాదంబుల
వలనఁ, బ్రబుదితహృదయుండై రాజగృహద్వారంబు చేరంజని, నిజ
వాహనావతరణంబొనరించి: సౌవిదల్ల వృద్ధామాత్యసామంతసైనిక
ప్రవరుల నుచితవచనశిరఃకంపకరసంజ్ఞావిలోకనంబులఁ దగినచందంబున
ననిచి, కక్ష్యాంతరంబులు గడచియయ్యవసరంబున. 220

ఉ. ఉల్లముపల్లవింప వినయోన్నతిఁ జేరి, సుధామరీచిమే
నల్లునిఁబోలు నమ్మనుకులాగ్రణి, మత్తవిరోధిదైత్యసం
పల్లతికాశితాసి, పరిపాండురకీర్తి, ససంభ్రమంబునఁ
దల్లికిఁ దండ్రికిన్ గురుజనంబులకున్, ధరఁ జాగిమ్రొక్కుడున్ 221

ఉ. గ్రుచ్చి కవుంగిలించుకొని, కోరికలీరికలెత్త నమ్మహీ
భృచ్చతురాననుండనియె, "భీకరదైత్యుల నుక్కడించి నీ
వచ్చటఁ జేసి ప్రాణములువచ్చెఁ జుమీ!యిట నేఁడు మాకు; వి
వ్వచ్చుఁడు పోరులన్ సవతువచ్చునె? నీకసమానమానుషా! 222

మ. రణసీమన్ సురకోటినొంచి, ఖచరవ్రాతంబుఁ దూలించి చా
రణులం దర్పమడంచి, బాహుబలగర్వస్ఫూర్తి మార్లేక భీ
షణవృత్తిన్ విహరించుదైత్యునొరులేసంధించువా?, రీవుకా
రణజన్ముండవు గానఁ, గూల్చితి, కుమారా! రాజకంఠీరవా! 223

వ. అని బహువిధంబులం బ్రశంసించి, పునఃపునరాలింగనంబొనరించి,
యన్నరదేవుండు దేవియుందానును బరమానందంబునం బొంది
యుండ. 224

క. కోమలపల్లవపాణిం,
గోమలి. నమ్మొద్దుఁబెండ్లికూఁతును నొకమైఁ
దామెయ్యఁదార్చి, యత్తకు
మామకు మ్రొక్కించిరపుడు మంజులవాణుల్ 225

క. మ్రొక్కినకోడలిఁ, గొమ్మం,
జక్కనిజవరాలిఁ, జూచి సతియును బతియుఁ
మిక్కిలియక్కఱమీఱం
బెక్కువిధంబుల నుతించి పేశలఫణితిఁ 226

క. "రావమ్మ! సింధుపుత్రీ!
పావనచారిత్ర! నేత్రపర్వము గాఁగఁ
నీవునుఁ బతియును దేవియు
దేవరవలె నుండుఁ." డనుచు దీవించి తగన్ 227

క. కులదేవతానమస్కృతి
సలుపన్నరనాథుదేవి చక్కనితనము
ద్దులకోడలిఁ జెయిపట్టుకొ
ని లీలమైఁ జనియె; నిచట నృపతియుఁ బ్రీతిన్ 228

శా. "ఓనిర్నిద్రభుజప్రతాపతపనా! యోబంధుచింతామణీ!
యోనారీమకరాంక! యేపగిది నయ్యుగ్రాసురున్ గెల్చితో?
మౌనిశ్రేష్ఠునిపట్టి నెట్టికరణిఁ మళ్ళించితో; సర్వమున్
వినుల్చల్లఁగఁ జెప్పు"మన్న, నతఁడావిర్భూతసమ్మోదియై 229

క. రాచిల్క మోముచూచుడు
నాచందంబది యెఱింగి యవనీశ్వరుతోఁ
దూచాతప్పకయుండఁగ
వాచాగోచరవిశేష వై ఖరిమెఱయఁ 230

సీ. తొలితొలిఁ గవ్వంపుమలకునేగి విశంక
టునిభుజాదర్పమార్చినవిధంబు
బ్రత్యక్షమై దివ్యరత్నంబుఁగాళి యి
చ్చినయట్టి విధమును. దనవిధంబు,
ముష్టింపచస్వామిముద్దుఁగూఁతును దెచ్చి
యతనికర్పించినయవ్విధంబుఁ
బదరికాశ్రమభూమిఁ బారికాంతులచేత
దీవనల్ చాలఁ జెందినవిధంబు

గీ. నుత్సవాహ్వాయవనసీమనున్నవిధము
భవ్యగుణధన్యసింధుభూపాలకన్యఁ
బెండ్లియాడినవిధము,నొప్పిదముగాఁగఁ
దేటపడఁ జెప్పె రాచిల్క మేటి యచట 231

వ. అట్లు పలికినయక్కీరశునాసీరు మెచ్చుల పల్కులకమ్మహీభృచ్ఛతురాన
నుండిచ్చ నచ్చెరువంది, నిష్పందానందకందళితహృదయారవిందుండై
సుఖంబుండె; నట రాజశేఖరకుమారుండును, గాంతిమతీకుమారికాసమే
తుండై. 232

ఉ. ఈడితమాధవీకుటజహింజులవంజులమంజుకానన
క్రోడములన్, విహారగిరికూటములన్, దమకంబు త్రోపుత్రో
పాడ మనోనురాగమనయంబును లోఁదొలఁకాడ, మన్మథ
క్రీడలు సల్పుచుండె నురరీకృతసౌఖ్యకళాభిరాముఁడై; 233

ఉ. సారసలోచనాకుసుమసాయక! బంధురదానతోయవి
స్తారితపంచశాఖతలసంజనితప్రథమానవల్లికో
దారకృపాణికావిమతధాసితగోపురవాహరత్నదు
ర్వారమదాంధసింధుర! ధరాభరధైకమహోధురంధరా! 234

మా లి ని

కుసృతిపరమహోరాటూక్కటవృక్కాస్యగర్వి
మస్యణకరకృపాణీ! మారజిన్మౌళిసింధు
స్వసృవిమలయశఃశ్రీఘాళితాశాంత!దాన
ప్రసృతిసలిలధారాప్లావితాంభోనిధానా! 235

కా. స్వర్భామాజనకీర్తనీయగుణ! ఘోషద్విట్పృతాపార్యమ
స్వర్భానూద్భట! పారసీకఖరిచీసావీరఘోటీఖురా
విర్భాతోద్బలధాటిధూళిభర! దోర్వీర్యావధూతార్జునా!
గర్భస్థాపితభూర్భువప్రముఖలోకస్వచ్ఛకీర్తి చ్ఛటా! 236

గ ద్య

ఇది శ్రీమదఘోరశివాచార్యగురుకరుణావిశేషలబ్ధసారస్వత
మాదయామాత్య పుత్రమల్లయనామధేయప్రణీతంబైన
రాజశేఖరచరిత్రంబను మహాప్రబంధమునందు
సర్వంబును తృతీయాశ్వాసము.




Goldmedal
WITCHES & ACCESSORIES
With
ISI
Mark
SYMBOL
Of
TRUST

[illegible]

[illegible]

P-93, 172, 173, 174, 175, – 180 ([illegible])

P-38 ([illegible] – [illegible]) ([illegible])

P-33 → 61, ([illegible]) ([illegible])

P-10 → 51 ([illegible])

[illegible] (1[illegible]) → 8 ([illegible])

81 → 120

P-83 ([illegible]) → 131